



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 14.05.2026 | సంపుటి : 12 సంచిక : 294 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్








## నీట్ పేపర్ లీక్‌లో సీబీఐ
# దూకుడు

**ఐదుగురి అరెస్టు**

**దేశవ్యాప్తంగా ఏకకాలంలో సోదాలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ అధికారులు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో సీబీఐ తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి సోదాలు నిర్వహిస్తోంది. ఈ లీకేజ్ వెనుక ఉన్న ప్రధాన ముఠాను బయటకు తీసుకు రావడానికి అధికారులు కృషి చేస్తున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక బృందాలు రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సోదాల సమయంలో అనేక

మిగతా 2లో..

## 'నీట్'ను మొత్తానికే
# రద్దు చేయండి
**ముఖ్యమంత్రి విజయ్ డిమాండ్**

2లో..

## మెగాగ్రోత్ కారిడార్‌పై
# సీఎం సమీక్ష

**కరీంనగర్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్‌లకు ఔటర్ రింగురోడ్డు వేయాలి**

**నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్ ఏర్పాటు చేయాలి**

**ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్**



- రాబోయే ఎయిర్ పోర్టులను దృష్టిలో ఉంచుకొని రహదారులను నిర్మించాలి
- అవసరమైన ఎస్టీపీలు డిజైన్ చేయాలి
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణంలో సాంకేతికత ను వినియోగించుకోవాలి
- ఖర్చు తగ్గించుకోవడానికి ఈవీ వాహనాలను ప్రవేశపెట్టాలి
- ప్రతి చోట పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా ఉండాలి
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి

హైదరాబాద్(జనంసాక్షి): ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్లకు ఓఆర్‌ఆర్‌లు వేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో పెట్టుకొని రోడ్లు నిర్మించాలన్నారు. మెగా గ్రోత్ కారిడార్‌పై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. "అవసరమైన ఎస్టీపీలు రూపొందించాలి. అండర్ డ్రైనేజీల నిర్మాణానికి సాంకేతికత వినియోగించుకోవాలి. ఖర్చు తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు ప్రవేశపెట్టాలి. ప్రతిచోట పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తయ్యేలా చూడాలి. పట్టణాల కేంద్రంగా అభివృద్ధి ప్రణాళిక ఉండాలి. మున్సిపాలిటీల్లో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. రేడియేషన్ తగ్గింపునకు మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటు చేయాలి. సింగరేణి సీఎస్‌ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చుపెట్టాలి. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్ ఏర్పాటు చేయాలి. ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలి. అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. మహబూబ్ నగర్, భూత్పూర్, జడ్చర్లను కలిపి కారిడార్ ఏర్పాటు చేయాలి. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌ను కలిపి కారిడార్ ఏర్పాటు చేయాలి. పెద్ద మున్సిపాలిటీలకు

మిగతా 2లో..

## ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేషన్ కార్యాలయం

**సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సీఈవో దారా ఖోస్రోషాహి వెల్లడి**



2లో..



## విశ్వాస పరీక్షలో
# విజయ్ కేతనం

**తమిళనాడు అసెంబ్లీలో టీవీకేకు 144 మంది మద్దతు**

- విశ్వాస పరీక్షను బహిష్కరించిన డీఎంకే
- అన్నాడీఎంకే చీలిక వర్గం అనుకూల ఓటు
- ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సీఎం విజయ్

**చెన్నై(జనంసాక్షి):** తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు.

మిగతా 2లో..

## విజయ్ ఓఎస్డీ నియామకం రద్దు

**తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం..**

**జ్యోతిషుడి నియామకంపై అన్ని పార్టీల నుంచి విమర్శల నేపథ్యంలో ఉత్తర్వులు వెనక్కి**



**చెన్నై(జనంసాక్షి):** తమిళనాడు సీఎం విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఓఎస్డీగా జ్యోతిషుడు రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్ నియామకాన్ని రద్దు చేశారు. ఆయన నియామకంపై అన్ని పార్టీల నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ రద్దు ఉత్తర్వులు జారీ చేసింది. రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్ దగ్గర విజయ్ జ్యోతిష సలహాలు తీసుకుంటుంటారు. ఎన్నికలకు ముందే

మిగతా 2లో..

# మతవిశ్వాసం వ్యక్తి ఆంతరంగిక విషయం



**గుడికి వెళ్లడం ద్వారా భక్తిని కొలవలేం..**

**మతాచారాల భారాన్ని న్యాయస్థానాలు తేల్చలేవు**

**ఇంట్లో దీపం పెట్టినా మతవిశ్వాసం కిందకే వస్తుంది**

**ఆలయాల్లో మహిళల వివక్షకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ**

**విచారణ జరిపిన సీజేఐ నేతృత్వంలోని తొమ్మిది మంది జడ్జిల బెంచ్**

**న్యూఢిల్లీ, మే 13 (జనంసాక్షి) :** హిందూ మతంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గుడికి వెళ్తే.. ఆచారాలు పాటిస్తేనే హిందూవు కాదని, మనసులో భక్తి ఉంటే చాలని వ్యాఖ్యానించింది. హిందూమతం అంటే కేవలం ఒక మతం కాదు అది ఒక జీవన విధానం అని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. శబరిమల ఆలయ ప్రవేశం, మత స్వేచ్ఛకు సంబంధించిన అంశాల పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు మే 13న సంచలన వ్యాఖ్యలు చేసింది. హిందువుగా కొనసాగడానికి ప్రతిరోజూ గుడికి వెళ్లాల్సిన అవసరం లేదు.. కచ్చితంగా ఆచారాలు పాటించాలన్న నిబంధన కూడా ఏమీ లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక వ్యక్తి తన ఇంట్లో లేదా గుడిసెలో చిన్న దీపం వెలిగించినా.. అది అతని భక్తిని, మతాన్ని చాటుకోవడానికి సరిపోతుందని ధర్మాసనం తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది

మిగతా 2లో..

# రెండు రోజుల గడువు ఇవ్వండి



- 15న ఆధారాలతో విచారణకు వస్తా
- పోలీసులకు బండి భగీరథ్ లేఖ
- పోలీసు విచారణకు గైర్హాజరు

హైదరాబాద్(జనంసాక్షి): పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ

మిగతా 2లో..

## తప్పు చేస్తే ఎంతటివారైనా
# శిక్షార్హులే


**బండి భగీరథ్ విషయంలో వెనకడుగు లేదు**

**మంత్రి సీతక్క స్పష్టీకరణ**

2లో..

## అరెస్ట్ తప్పదు

**బండి భగీరథ్‌ను రక్షించాల్సిన అవసరం మాకేముంది: మహేశ్ గౌడ్**



ఢిల్లీ నగర రహదారిపై కేవలం రెండు వాహనాలతోనే వెళ్తున్న ప్రధాని మోడీ కాన్వాయ్

# మోదీ పొదుపు మంత్రం

**కాన్వాయ్ తగ్గింపు వాహనాల సంఖ్య 15 నుంచి 2కు కుదింపు**

**కేంద్రమంత్రులు సైతం అదేబాటలో..**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్య భారీగా తగ్గింది. రెండు వాహనాల కాన్వాయ్‌తోనే ఆయన ప్రయాణించారు. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఈ మేరకు మార్పులు చేశారు. పశ్చిమాసియాలో సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు పొదుపు మంత్రం పాటించాలని సూచించిన ప్రధాని మోదీ..

మిగతా 2లో..

## చదువు కొనసాగిస్తా.. ప్రజా న్యాయవాదినవుతా

**ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన దేవ్‌జీ**



12లో..

## ఐఆర్‌జీసీ ఆర్థిక మూలాలు తెలియక
# తలపట్టుకున్న అమెరికా

**ఎవరైనా చెబితే రూ. 145 కోట్లిస్తాం • ప్రపంచానికి అమెరికా బంపర్ ఆఫర్**



**వాషింగ్టన్(జనంసాక్షి):** యుద్ధాన్ని ముగించడానికి అమెరికా-ఇరాన్ తీసుకుంటున్న చర్యల్లో ఏమాత్రం పురోగతి కనిపించడం లేదు. యుద్ధాన్ని ముగించడానికి వాషింగ్టన్ చేసిన ప్రతిపాదనలను టెహ్రాన్ అంగీకరించకపోవడంతో ఒప్పందం మరింత ఆలస్యమవుతోంది. ఈక్రమంలో అమెరికా విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. ఐఆర్‌జీసీ ఆర్థిక మూలాలు చెప్పిన వారికి రూ. 145 కోట్ల వరకు బహుమతిగా ఇస్తామని బహిరంగంగా ఆఫర్ చేసింది. ఐఆర్‌జీసీ.. దాని సం బంధిత శాఖలకు కీలక ఆర్థిక వనరులను అందించే బినామీ కంపెనీలు, వ్యక్తులు, ఆర్థిక సంస్థల సమాచా రాన్ని తమకు తెలియజేయాల్సిందిగా కోరింది. గల్ఫ్ దేశాలపై దాడులు చేయకుండా.. అణు కార్యక్రమాలు చేపట్టకుండా ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీయడం కోసమే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. యుద్ధం ముగించేందుకు ఉపయోగపడే ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ పేర్కొన్నారు. అదే సమయంలో ఏవిధమైన దురాక్రమణకైనా తగిన గుణపాఠం చెప్పేందుకు తమ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తప్పుడు అంచనాలు.. తప్పుడు నిర్ణయాలతో కూడిన వ్యూహం ఎల్లప్పుడూ తప్పుడు ఫలితాలనే ఇస్తుందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రపంచమంతా అర్థం చేసుకుందన్నారు. అమెరికాతో చర్చల్లో భాగంగా తాము ప్రతిపాదించిన అంశాలను అంగీకరించడం తప్ప అమెరికాకు మరో ప్రత్యామ్నాయం లేదని పేర్కొన్నారు. యుద్ధంలో ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను నాశనం

మిగతా 2లో..

# ముందుంది పెట్రో మోత



- ఏ క్షణాన్నైనా ధరలు పెరిగే అవకాశం
- ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా చమురు ధరలు పెంచక తప్పదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చన్నారు. స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగితే, ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేసే అవకాశం ఉందని గవర్నర్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే ఇది ఎంతకాలం సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక

మిగతా 2లో..

## భారత్‌కు ఇంధన కొరత
# రానివ్వం

**సరఫరాలో లోటు రాకుండా చూస్తాం**

**రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ హామీ**

2లో..



## బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు

**6 నుంచి 15 శాతానికి పెంచిన కేంద్రం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం తాజాగా పెంచింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను 5 శాతానికి పెంచింది. దీంతో, మొత్తం దిగుమతుల సుంకం 15 శాతానికి చేరింది. గతంలో ఇది 6 శాతంగా ఉండేది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 95.75కి పతనమైన నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచింది.

మిగతా 2లో..

## పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా
# రంగస్వామి ప్రమాణం

- వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు
- ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబీన్ హాజర్
- ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని

9లో..

# ములాయం చిన్నకొడుకు ప్రతీక్ హఠాన్మరణం

**ఆస్పత్రికి తీసుకెళ్లే లోగానే మరణించినట్లు వెల్లడి**

**ప్రతీక్ మృతికి అఖిలేశ్, ముఖ్యమంత్రి యోగి సంతాపం**

# మతవిశ్వాసం వ్యక్తి ఆంతరంగిక విషయం

విచారణ జరిపిన సీజేఐ నేతృత్వంలోని తొమ్మిది మంది జడ్జిల బెంచ్ న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 15వ రోజు విచారణ సందర్భంగా.. న్యాయవాది మోహన్ గోపాల్ వాదనలు వినిపిస్తూ, హిందువులందరూ వేదాలను అత్యున్నత ప్రమాణాలుగా అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన జస్టిస్ నాగారత్న, హిందూమతం ఒక విశాలమైన జీవన విధానమని.. ఇందులో బాహ్య ఆచారాల కంటే వ్యక్తిగత విశ్వాసానికే ప్రాముఖ్యత ఉంటుందని వివరించారు. ప్రతి చిన్న మతపరమైన ఆచారాన్ని కోర్టుకు తీసుకువచ్చి ప్రశ్నిస్తే, మతాల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని.. వందలాది పిటిషన్లతో హిందూ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. 2018లో శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై ఇచ్చిన తీర్పు నేపథ్యంలో, ప్రస్తుతం మత స్వేచ్ఛ పరిధిని ఈ తొమ్మిది మంది న్యాయమూర్తుల బెంచ్ నిశితంగా పరిశీలిస్తోంది.

## ముందుంది పెట్రో మోత

వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను కోరారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి కేంద్రం పెంచింది. దీంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. గత కొంతకాలంగా చమురు ధరలూ పెంచుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఐఆర్‌జీసీ ఆర్థిక మూలాలు తెలియక తలపట్టుకున్న అమెరికా

చేశామని అమెరికా అధ్యక్షుడు చెప్తున్నా.. అగ్రరాజ్య నిఘా వర్గాలు మాత్రం అందుకు వ్యతిరేకమైన ఆధారాలను బహిర్గతం చేశాయి. హర్మూజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌కు ఉన్న 30 స్థావరాల్లో తిరిగి క్షిపణుల తయారీ తిరిగి ప్రారంభం అయిందని పేర్కొన్నాయి . ఆ దేశంలోని దాదాపు 90శాతం భూగర్భ క్షిపణి సౌకర్యాలు మళ్లీ ప్రారంభమైనట్లు తెలిపాయి..

## ఇరాన్ యుద్ధంపై ఏం చేద్దాం?

**చైనా అధ్యక్షుడితో ట్రంప్ భేటి**



బీజింగ్(జనంసాక్షి):: మూడు రోజుల పర్యటన కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌కు చేరుకున్నారు. చివరిసారి 2017లో ట్రంప్ చైనా వెళ్లారు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ చైనా పర్యటనకు వెళ్లారు. ఇరాన్ యుద్ధం, చైనాతో ట్రేడ్ వార్, తైవాన్‌కు అమెరికా ఆయుధాల విక్రయం నేపథ్యంలో ఈ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆయా విషయాలపై చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌తో ట్రంప్ చర్చించనున్నట్టు సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా చైనా చేరుకున్నారు. ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా ట్రంప్‌తో పాటు చైనా వెళ్లారు. తాను కూడా బీజింగ్ చేరుకున్నట్టు మస్క్ ట్వీట్ చేశారు. అమెరికా అధికారులతో పాటు యాపిల్ సీఈవో టిమ్ కుక్, ఎన్‌విడియాకు చెందిన జెన్సన్ హువాంగ్ వంటి అగ్రశ్రేణి కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా చైనాకు వెళ్లినట్టు సమాచారం . చైనాతో అమెరికా టెక్‌కు సంబంధించి పెద్ద ఒప్పందం చేసుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి . ఇదే సమయంలో ఇరాన్ యుద్ధం కూడా ఈ సమావేశానికి ప్రధాన అజెండాగా మారింది. చైనా ప్రభావంతో ఇరాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. బీజింగ్ విమానాశ్రయంలో ట్రంప్‌నకు ఘన స్వాగతం లభించింది. చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్, ట్రంప్‌నకు స్వాగతం పలికారు.

## భారత్‌కు ఇంధన కొరత రానివ్వం

**సరఫరాలో లోటు రాకుండా చూస్తాం**

**రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ హామీ**

మాస్కో(జనంసాక్షి):ఇంధన సరఫరా విషయంలో భారత ప్రయోజనాలకు నష్టం జరగనివ్వబోమని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ హామీనిచ్చారు. ఇంధన సరఫరాకు సంబంధించిన ఒప్పందాలన్నింటినీ నెరవేర్చుతామన్నారు. త్వరలో భారత పర్యటనకు రానున్న లావ్రోవ్ ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్, రష్యాల మధ్య సంబంధాలు స్నేహంపై ఆధారపడి ఉన్నాయని, వాటి దారులు వేరయ్యే పరిస్థితి ఎప్పటికీ ఉండదని స్పష్టం చేశారు. ఇంధన సరఫరా విషయంలో భారత ప్రయోజనాలకు నష్టం జరగనివ్వం. చమురు సరఫరాలో ఆటంకం కలగనివ్వం. భారత అవసరాల దృష్ట్యా గ్యాస్, చమురు, బొగ్గు వంటివి సరఫరా చేస్తూనే ఉంటాం. భారత్-రష్యా బంధాలను బలహీనపరిచేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాల పట్ల ఇరు దేశాలు అప్రమత్తంగా ఉండాలి. కుడంకుళం అణు విద్యుత్ కేంద్రం కోసం కొత్త పవర్ యూనిట్ల నిర్మాణంలో మా సహకారం కొనసాగుతుంది' అని లావ్రోవ్ తెలిపారు. హిందూ-రూసీ భాయ్ భాయ్ అనేది మన సంస్కృతిలో ఒక భాగం. భారతీయ సినిమాలు, రాజ్ కపూర్, టెలివిజన్ సిరీస్‌లకు రష్యాలో ఎంతో ఆదరణ ఉంది. సైనిక సహకారం, ఇంధన సరఫరాలు, ఆర్థిక వ్యవస్థ.. ఇలా ఎన్నో రంగాల్లో ఇరు దేశాల మధ్య బంధం చాలా దృఢంగా ఉంది. అది ఎప్పటికీ కొనసాగుతుంది' అని లావ్రోవ్ స్పష్టం చేశారు.

## ఎయిరిండియా సంచలన నిర్ణయం

**పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిపివేత**

న్యూఢిల్లీ:ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇంధన ధరల పెరుగుదల, గగనతల ఆంక్షల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మొత్తం ఆరు ప్రధాన అంతర్జాతీయ మార్గాల్లో విమానాలను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటన జారీ చేసింది. ఢిల్లీ-చికాగో, ముంబై-న్యూయార్క్, ఢిల్లీ-షాంఘై, చెన్నై-సింగపూర్, ముంబై-ఢాకా, ఢిల్లీ-మాలే రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయం జూన్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో అమలులో ఉంటుందని తెలిపింది.నష్టాల దృష్ట్యా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వీసులను ఎయిర్ ఇండియా తగ్గించింది. ఆ నిర్ణయాన్ని మరికొన్ని రూట్లకు విస్తరిస్తూ తాజాగా ప్రకటన జారీ చేసింది.

# ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేషన్ కార్యాలయం

**సిఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సీఈవో దారా ఖోస్రోషాహి వెల్లడి**

**హైదరాబాద్(జనంసాక్షి):**
హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు.పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

### మెగాగ్రోత్ కారిడార్‌పై సీఎం సమీక్ష

సమీపంలో రేడియల్ రోడ్లు ఉండాలి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం కారిడార్ తెలంగాణకు కీలకం. రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తారు" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## మోదీ పొదుపు మంత్రం

స్వయంగా వాటిని పాటిస్తున్నారు. ఈక్రమంలోనే తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించారు. సాధారణంగా, ప్రధాని కాన్వాయ్‌లో మెర్సిడెస్ అల్ట్రా లగ్జరీ కారు, రేంజ్ రోవర్లు, టయోటా ఫార్చ్యూనర్లు, ఎస్కార్ట్ వాహనాలు, జామర్ యూనిట్లు సహా కనీసం 12-15 వాహనాలు ఉంటాయి. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని మోదీ ఆదేశించినట్లు ఉదయం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ అధికారులు వెల్లడించారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయన వెళ్లే దారుల్లో తప్పనిసరి భద్రతా ఏర్పాట్లు కొనసాగిస్తామన్నారు.టలటఅ

కాన్వాయ్ సైజును కుదించుకున్న కేంద్రమంత్రులు

ఇంధన పొదుపుపై ప్రధాని మోదీ పిలుపు మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా పలువురు మంత్రులు తమ కాన్వాయ్ సైజును రెండు వాహనాలకు కుదించుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సైతం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించుకున్నట్లు వెల్లడించారు.

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

**వెల్‌డన్ రాహుల్ గాంధీ : కేటీఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):**
తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు.



దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో కూడా టాప్‌లో ఉంది.' అని ట్విట్టర్ (ఎక్స్)లో కేటీఆర్ పేర్కొన్నారు. వెల్‌డన్ రాహుల్ గాంధీ.. నిజంగానే తెలంగాణ రైజింగ్ అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యంగ్యంగా అభినందించారు.

# నీట్ పేపర్ లీక్‌లో సీబీఐ దూకుడు

ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రశ్నాపత్రం లీక్, మధ్యవర్తుల వ్యవస్థ, భారీ మొత్తాల్లో డబ్బుల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ వ్యవహారంలో పరీక్షకు ముందుగానే కొందరు అభ్యర్థులకు ప్రశ్నాపత్రం అందించినట్లు అనుమానిస్తున్నారు.
సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందినవారు కాగా, ఒకరు హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన వ్యక్తి. మరొకరు మహారాష్ట్ర లోని నాసిక్ ప్రాంతానికి చెందినవారు. అరెస్టయిన వ్యక్తులు ప్రశ్నాపత్రం సేకరణ, పంపిణీ, అభ్యర్థులతో సంబంధాలు ఏర్పరచడం వంటి కీలక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జమ్వా రామ్‌గడ్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ సోదరులను సీబీఐ అధికారులు బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఈ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాన మధ్యవర్తులుగా వ్యవహరిం చినట్లు అనుమానిస్తున్నారు. వారి ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పలు డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, అభ్యర్థుల జాబితాలు లభించినట్లు సమాచారం. వీరి ద్వారా మరికొందరు అనుమానితుల వివరాలు కూడా సీబీఐకి లభించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లో సోదాలు కొనసాగుతుండగానే మహారాష్ట్రలో కూడా సీబీఐ తన దర్యాప్తును విస్తరించింది. అక్కడ ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మహిళలు అభ్యర్థులు, మధ్యవర్తుల మధ్య సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సోషల్ మీడియా కమ్యూనికేషన్‌లను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. దిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్నీ సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

## 'నీట్'ను మొత్తానికే రద్దు చేయండి

**సీఎం విజయ్ డిమాండ్**

చెన్నై(జనంసాక్షి): దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే 'జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీ'ని (నీట్-యూజీ) మొత్తానికే రద్దు చేయాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడం, పరీక్ష రద్దు వంటివి.. వ్యవస్థాగత లోపాలకు నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటినుంచి నీట్‌ను తమిళనాడు వ్యతిరేకించిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ పరీక్షతో గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు, తమిళ మాధ్యమానికి చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో 12వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి సీఎం విజయ్ విజ్ఞప్తి చేశారు.
లీకేజీ వ్యవహారంలో ఐదుగురి అరెస్టు..
నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో సీబీఐ తన దర్యాప్తు ముమ్మరం చేసింది. జైపుర్‌లో ముగ్గురిని, గురుగ్రామ్‌లో ఒకరిని, నాసిక్‌లో మరొకరిని.. ఇలా ఇప్పటివరకు ఐదుగురిని అరెస్టు చేసింది. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. దిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్నీ సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

## బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు

బంగారం వినియోగంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం భారత్ ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇక ఈక్విటీ మార్కెట్‌లో రాబడులు మందగించిన నేపథ్యంలో గతేడాది భారత్‌లో బంగారానికి డిమాండ్ పెరిగింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఆధారిత ఎక్స్‌చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 186 శాతం మేర పెరిగాయి. కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ధరలు అధికంగా ఉన్నందున కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బంగారం, వెండి దిగుమతుల కట్టడి కోసం ఇటీవల ప్రభుత్వం 3 శాతం ఐజీఎస్టీ విధించింది. దీంతో, బ్యాంకులు దిగుమతులకు దాదాపు నెల రోజుల పాటు బ్రేక్ చెప్పాయి. ఫలితంగా ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల నాటి కనిష్ఠాన్ని తాకాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను తట్టుకునేందుకు దేశ ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోదీ ఆదివారం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

# విశ్వాస పరీక్షలో విజయ్‌కేతనం

అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది' అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది.అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు.ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది' అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు.అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు.234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

## విజయ్ ఓఎస్డీ నియామకం రద్దు

ఆయన టీవీకే విజయాన్ని ఊహించారు. జయలలిత సహా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులకు కూడా ఆయన సలహాలు ఇచ్చేవారు. మంగళవారం ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి (రాజకీయం) గా వెట్రివేల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే దీనిపై అన్ని పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ విమర్శలపై విజయ్ స్పందిస్తూ.. ఆ నియామకాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఓఎస్డీ బాధ్యతల నుంచి వెట్రివేల్‌ను తప్పిస్తూ విజయ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బలపరీక్ష అనంతరం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## రెండు రోజుల గడువు ఇవ్వండి

పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీ యాంశంగా మారింది. మే 15వ తేదీన జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే భగీరథ బెయిల్ కేసులో గురువారం 14న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.
పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరు
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్.. పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల ముందు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్.. పోలీసుల విచారణకు హాజరుకాలేదు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. బాధితురాలి నుంచి రెండో సారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (తి)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. గురువారం ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేయనుంది.

## తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

**మహబూబాబాద్(జనంసాక్షి):**
భగీరథ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా కేసు నమోదు చేయడంలో ఒక్క రోజు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని మంత్రి సీతక్క ఒప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన కేసు వివాదంపై మంత్రి సీతక్క స్పందించారు. కేంద్ర మంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని అన్నారు.ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం కాలయాపన కోసం కాదని, నిజానిజాలు వెలికితీయడానికేనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు మహిళలను గౌరవించాలని, ప్రజలను ప్రేమించాలని ఈ సందర్భంగా సీతక్క విజ్ఞప్తి చేశారు. బాలికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. బుధవారం పోలీసుల ఎదుట భగీరథ్ హాజరుకావాల్సి ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ నెల 15వ తేదీన విచారణకు హాజరవుతానని పేర్కొంటూ పేట్ బషీరాబాద్ పోలీసులకు, సిట్ అధికారులకు ఈ-మెయిల్‌తో పాటు భగీరథ్ ఓ లేఖ పంపించారు.

## అరెస్ట్ తప్పదు

హైదరాబాద్(జనంసాక్షి):పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు. మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు.

## పొదుపు సూత్రాలు తెలంగాణకు నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

**ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత**

**హైదరాబాద్,మే13(జనంసాక్షి):**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు.

# రైతుల ఖాతాల్లోకి రూ. 4,520 కోట్లు

- 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- పౌర సరఫరాల శాఖ అధికారుల వెల్లడి



**హైదరాబాద్, మే13 (జనంసాక్షి) :** 2025-26 రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు పౌరసరఫరాల శాఖ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోంది. ఇప్పటి వరకు విజయవంతంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మార్గదర్శకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా కనీస మద్దతు ధర కింద రూ. 4,520 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. ల్గ÷తులు సన్న మరియు దొడ్డు రకాల ధాన్యాన్ని భారీగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగిలిన 21 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యాన్ని సేకరించడం జరిగింది. ÷-రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, భారీగా వస్తున్న ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఈ విస్తృతమైన క్షేత్రస్థాయి వ్యవస్థలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4,350 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 3,563 కేంద్రాలు, మరియు ఇతర అనుబంధ సంస్థల ద్వారా 662 కేంద్రాలు నడుపబడుతున్నాయి. కొనుగోలు కార్యకలాపాలు సజావుగా సాగడానికి మరియు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని పూర్తిగా సంరక్షించడానికి, పౌరసరఫరాల శాఖ ముందస్తుగానే ఈ కేంద్రాల వద్ద 18.6 కోట్ల గన్నీ బ్యాగ్‌లను మరియు తగిన సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధంగా ఉంచింది. క్షేత్రస్థాయిలో నిల్వల సమస్య తలెత్తకుండా మరియు కొనుగోలు కేంద్రాలు ప్రతిరోజూ కొత్త ధాన్యాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉండేలా, పౌరసరఫరాల శాఖ వేగవంతమైన రవాణా కార్యకలాపాలను అమలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం లేకుండా నేరుగా కేంద్రాల నుండి మిల్లులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు, డీసీఎంలతో కూడిన సుమారు 11,500 రవాణా వాహనాలను అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ పక్రియలను దగ్గరుండి పర్యవేక్షించడానికి, పారదర్శకతను నిర్ధారించడానికి కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద కూడా ప్రత్యేక అధికారులను వ్యూహాత్మకంగా నియమించింది. హమాలీల కొరతను అధిగమించడానికి, భారీగా వస్తున్న ధాన్యాన్ని సజావుగా నిర్వహించడానికి మరియు రైతుల ప్రయోజనాలను కాపాడుతూ కొనుగోళ్లను వేగవంతం చేయడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొనుగోలు కేంద్రాలు మరియు గోదాములలో ధాన్యం నిర్వహణ ఛార్జీలను అధికారికంగా క్వింటాల్‌కు రూ. 17/- కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానాలతో రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో చెల్లింపులు జరిగేలా చూస్తోంది. రైతులు తమకు ఏవైనా సందేహాలు, సమస్యలు ఉన్నా లేదా సహాయం కావాలన్నా పౌరసరఫరాల శాఖకు చెందిన టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1967 ను సంప్రదించాలని తెలిపింది.

## హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్, మే13 (జనంసాక్షి) :** మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ విద్యార్థిని పూజారెడ్డి ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కోదాడకు చెందిన పూజారెడ్డి.. మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని.. బెటర్మెంట్ కోసం పరీక్షకు అప్లై చేసుకుంది. బుధవారం నుంచి ఇంటర్ బెటర్మెంట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా రాత్రి హాస్టల్‌లో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థుల గమనించి వెంటనే హాస్టల్ వార్డెన్‌కు తెలియజేశారు. విద్యార్థిని ఆత్మహత్యపై హాస్టల్ సిబ్బంది.. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు.. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షల ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యపై కుటుంబ సభ్యులకు సమాచా రం అందించారు. తమ బిడ్డ ఇలా ఆత్మహత్య చేసుకోవడంపై తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## దోపిడీ నేపాలీ ముఠా కోసం గాలింపు

**హైదరాబాద్, మే13 (జనంసాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ ఠాణా పరిధిలో నేపాలీ దోపిడీ దొంగలు రెచ్చిపోయిన ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్(68), భార్య డాక్టర్ విజయలక్ష్మి (58)ని బంధించి 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో నిందితులు పరారైన విషయం తెలిసిందే. దోపిడీలో 8 మంది సభ్యుల నేపాలీ ముఠా పాల్గొన్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. వృద్ధ దంపతులను ఇంట్లో బంధించిన తర్వాత నిందితులు ఆటో బుక్ చేసుకుని అక్కడి నుంచి వెళ్లి పోయిన సీసీ టీవీ ఫుటేజ్‌ని పోలీసులు సేకరించారు. ఘటన తర్వాత ప్రొఫెసర్ ఇంట్లోని హార్డ్ డిస్క్‌లు, సీసీ కెమెరాలను నిందితులు ధ్వంసం చేసినట్టు పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి సీపీ సుమతి ఘటనాస్థలిని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. నిందితులంతా ఇప్పటికే నేపాల్ చేరుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

## ఫ్రాంక్లిన్ ఇండియా బ్యాంకింగ్, పిఎస్‌యు డెట్ ఫండ్‌ల 12 ఏళ్ల వేడుక

**ముంబై, మే 11 (జనంసాక్షి) :** ఫ్రాంక్లిన్ ఇండియా బ్యాంకింగ్, పిఎస్‌యు డెట్ ఫండ్, తన 12వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ విభాగంలో అత్యంత పురాతన పథకాలలో ఒకటిగా నిలిచిన ఈ ఫండ్, స్థిరమైన వృద్ధి, డెట్ మ్యూచువల్ ఫండ్ రంగంలో విశ్వసనీయ పెట్టుబడి పరిష్కారంగా తన స్థానాన్ని మరింత బలపరుచుకున్న సందర్భంగా ఈ వార్షికోత్సవం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలపై దృష్టి సారించిన ఫ్రాంక్లిన్ ఇండియా బ్యాంకింగ్, పిఎస్‌యు డెట్ ఫండ్ ప్రధానంగా బ్యాంకులు, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (పిఎస్‌యులు), ఆర్థిక సంస్థలు, ఎంపిక చేసిన మునిసిపల్ కార్పొరేషన్లు జారీ చేసే డెట్ సెక్యూరిటీలలో పెట్టుబడులు పెడుతుంది. ఈ వ్యూహం ద్వారా, తక్కువ క్రెడిట్ రిస్క్‌ను కొనసాగిస్తూ, పెట్టుబడిదారులకు మెరుగైన రాబడులను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

"అత్యుత్తమ నాణ్యత గల, తక్కువ క్రెడిట్ రిస్క్ కలిగిన డెట్ ఇన్‌స్ట్రుమెంట్ల పోర్ట్‌ఫోలియో ద్వారా స్థిరమైన ఆదాయాన్ని అందించే పథకంలో, ఏడాది కంటే ఎక్కువ కాలం తమ అదనపు నిధులను పెట్టుబడి పెట్టాలనుకునే ఇన్వెస్టర్లకు ఈ ఫండ్ అనుకూలంగా ఉంటుంది" అని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మ్యూచువల్ ఫండ్‌కు చెందిన చాందిని గుప్తా అన్నారు.

ఇన్వెస్టర్లకు అనుకూలమైన పలు ప్రత్యేకతలను అందిస్తోంది. ఇందులో ఎంట్రీ లేదా ఎగ్జిట్ లోడ్ లేకపోవడం వల్ల, ఇది మరింత సౌకర్యవంతమైన పెట్టుబడి ఎంపికగా ఆకర్షణీయంగా నిలుస్తోంది. కనీస పెట్టుబడి మొత్తం రూ.5,000గా నిర్ణయించబడగా, తదుపరి పెట్టుబడులు రూ.1 గుణాకారాల్లో పెట్టే అవకాశం ఉండటంతో, విస్తృత శ్రేణి ఇన్వెస్టర్లకు ఇది సులభంగా అందుబాటులో ఉంటుంది. వడ్డీ రేట్ల మారుతున్న కాలచక్రాల మధ్య కూడా స్థిరత్వాన్ని కోరుకునే ఇన్వెస్టర్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, ఫ్రాంక్లిన్ ఇండియా బ్యాంకింగ్ మరియు పిఎస్‌యు డెట్ ఫండ్, ఇటీవలి కాలంలో స్థిరమైన ఆదాయం, మూలధన పరిరక్షణ మరియు నిరంతర పనితీరును లక్ష్యంగా పెట్టుకున్న వారికి ఒక వివేకపూర్వక పెట్టుబడి ఎంపికగా ప్రత్యేకంగా నిలుస్తోంది.

## హజ్ ప్రమాద బాధితులకు అండగా నిలవాలి

- మదీనా ప్రమాద బాధితులకు పరిహారం చెల్లించాలి
- ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలని లేఖ
- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హజ్ యాత్రలో మదీనాకు వెళ్లి బస్సు ప్రమాదంలో మరణించిన బాధితుల్లో ఇంకా పరిహారం అందని 16 మంది కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఐదు లక్షల చొప్పున పరిహారం అందించాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి యాకూబ్ పాషా డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్ 17న సౌదీ అరేబియా లోని మదీనాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 44 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ ఘటనలో మరణించిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించగా, అందులో 29 మంది బాధిత కుటుంబాలకు ఫిబ్రవరి 28న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే విధ్యానగర్ కు చెందిన మృతుడు నసీరుద్దీన్ కుటుంబానికి చెందిన 16 మంది బాధితులకు సంబంధించిన రూ.85 లక్షల విలువైన చెక్కులను ఇప్పటికీ విడుదల చేయకుండా అధికారులు గత కొన్ని నెలలుగా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై బాధిత కుటుంబాలు ఈ నెల 5న మానవ హక్కుల కమిషన్‌ను కూడా ఆశ్రయించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, పెండింగ్‌లో ఉన్న చెక్కులను త్వరితగతిన అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని యాకూబ్ పాషా ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు వెల్లడించారు.


## బైకును ఢీకొన్న కారు..ఇద్దరు మృతి

- కారులోని వ్యక్తులు వెంటనే పరార్

**హైదరాబాద్, మే13 (జనంసాక్షి) :** హైదరాబాద్ నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బుధవారం మల్లాపూర్ స్వాగత్ కన్వెన్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులు మౌలాలికి చెందిన గణెశ్, గంగాధర్‌గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ ప్రతిరోజు కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నాచారం పోలీస్ స్టేషన్ వద్ద మృతుల బంధువులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## లిఫ్ట్‌లో ఇరుక్కుని మరో చిన్నారి మృతి

- గచ్చిబౌలి హాస్టల్‌లో ఐదేళ్ల చిన్నారి మృతి



**శేరిలింగంపల్లి, మే13 (జనంసాక్షి) :** గచ్చిబౌలిలో తీరని విషాదం చోటుచేసుకుంది. లిఫ్టులో ఇరుక్కుని మరో చిన్నారి మృత్యువాత పడింది. గౌలిదొడ్డిలోని ఒక ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో ఓ బాలిక లిఫ్ట్ లో ఇరుక్కుని మృతి చెందింది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఒక కుటుంబం ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి.. గౌలిదొడ్డి లోని మహి ఉమెన్స్ పీజీ హాస్టల్ లో వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఐదేళ్ల చిన్నారి బిస్తూ గోష్, స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. బుధవారం ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ ఆ చిన్నారి గ్రౌండ్ ఫ్లోర్ నుండి ఐదో అంతస్తుకు వెళ్తున్న క్రమంలో.. మూడవ అంతస్తు వద్ద చిన్నారి జుట్టు లిఫ్ట్ డోర్లలో ఇరుక్కుపోయింది. అది గమనించేలోపే లిఫ్ట్ కదలడంతో.. చిన్నారి తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా.. పోలీసులు, హైడ్రా, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన చిన్నారి మృతదేహాన్ని అత్యంత శ్రమతో బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం ఉందా? అనే కోణంలో విచారణ సాగుతోంది. ఐదేళ్ల చిన్నారి కళ్లముందే విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



## సిఎం రేవంత్‌ను కలిసిన పలువురు ప్రముఖులు

**హైదరాబాద్, మే13 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ నివాసంలో పలువురు ప్రముఖులు కలిశారు. వీరంతా సిఎంను మర్యాదపూర్వకంగా కలిసారు. లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ రీజినల్ చైర్మన్ రామన్ రఘు , రీజనల్ డైరెక్టర్ జె. వి. రాజగోపాల్ రావు, సైనిక్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్. ఆర్. బాబులు సిఎంను కలిసిన వారిలో ఉన్నారు.

## చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

- కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన ప్రధాని
- అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
- పలు రాష్ట్రాల సిఎంలు కూడా పొదుపుబాట



**న్యూఢిల్లీ, మే 13 (జనంసాక్షి) :** పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు దిగుమతులపై ఆధారపడ్డ అనేక దేశాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు కూడా వృథా ఖర్చులు తగ్గించుకుని పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రధాని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సగానికి తగ్గించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని కూడా ప్రధాని సూచించినట్టు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లోని కార్ల సంఖ్యను 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని భద్రత దళం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు (ఎస్‌పీజీ) ఆదేశాలు అందాయి. భద్రతా ప్రొటోకాల్ పాటిస్తూనే పొదుపు చర్యలు చేపట్టాలని ఎస్‌పీజీకి సూచనలు వెళ్లినట్టు సమాచారం. ఈ దిశగా ఎస్‌పీజీ కార్యాచరణ మొదలెట్టినట్టు కూడా తెలుస్తోంది. తన కాన్వాయ్‌లో విద్యుత్ కార్ల సంఖ్యను పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్లనే వినియోగించాలని, కొత్తవి కొనవద్దని కూడా ప్రధాని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడున్న కాన్వాయ్‌లో దాదాపు సగం వరకు తగ్గించారని సమాచారం. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా ఈ తరహా పొదుపు చర్యలకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇంధన పొదుపు కోసం ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పలు శాఖలు సమీక్షలు జరుపుతున్నాయి. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంల కాన్వాయ్ కుదింపునకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

## పోక్సో కేసును కులానికి ఆపాదించే యత్నం

- ఇది కుల సమస్య కాదని గుర్తించాలి
- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల



**హైదరాబాద్, మే13 (జనంసాక్షి) :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ్ విషయంలో బీఆర్ఎస్ బాధితురాలి పక్షాన ఉందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నేతల ఒత్తిడితోనే కేంద్ర మంత్రి కొడుకుపై కేసు నమోదు చేశారన్నారు. బండి సంజయ్ కొడుకు పోక్సో కేసును కులానికి ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది కుల సమస్య కాదు. లా అండ్ ఆర్డర్ సమస్య. నిన్న కరీంనగర్ లో బెదిరింపు ధోరణిలో మాట్లాడిన బండి సంజయ్ ఎవరి అంతు చూస్తావ్..? బాధితురాలిని అంతం చేస్తావా, లేకపోతే ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళను అంతం చేస్తావా..? అని గంగుల ప్రశ్నించారు. చట్టానికి, పోలీసులకు బండి సంజయ్ కుమారుడు సహకరించాలన్నారు.

## అమరావతితోపాటే విశాఖ అభివృద్ధి

- అక్కడ ఇప్పటికే అనేక సంస్థలు రాక
- కిమ్స్ ఆసుపత్రి శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు



**అమరావతి, మే 13 (జనంసాక్షి) :** అభివృద్ధి విషయంలో ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని.. విశాఖనూ విశ్వనగరంగా చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖను ఐటి పరంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే అనేక ప్రాజెక్టులు అక్కడ వచ్చాయని అన్నారు. రాజధాని ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి, వైద్య విశ్వవిద్యాలయం నిర్మాణానికి బుధవారం సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నాం. ఆ ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం మారబోతోంది. రాయలసీమ 'టెక్నాలజీ హబ్'గా తయారవుతోంది. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతున్నాయి. శ్రీసిటీ.. ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైందని వివరించారు. ఇకపోతే కిమ్స్ అధినేత భాస్కర్‌రావు ఒక విజన్ ఇచ్చారు. 2027 మే 13న కిమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తాం అన్నారు. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. 2028 డిసెంబరులోపు ఫేజ్-1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చాం. ఎలాంటి అనుమతులు కావాలన్నా త్వరగా ఇస్తాం. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తాం. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుందన్నారు.

## పెళ్లి వాహనం బోల్తా

- బాలుడు దుర్మరణం

**మహబూబ్‌నగర్,మే13 (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లాలో పెళ్లి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. 19 మందికి గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామానికి చెందిన 20 మంది బొలెరో వాహనంలో భూత్పూర్ మండలంలో జరుగుతున్న ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం తిరిగి తమ గ్రామానికి వెళ్తున్న క్రమంలో మహబూబ్‌నగర్‌లోని కొత్త కలెక్టరేట్ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలుడు సాయి వర్షిత్ (6) అక్కడికక్కడే మృతిచెందగా.. మిగతా వారికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

- నేడు రాష్ట్ర వ్యాపిత నిరసనలకు సీపీఐ(ఎం) పిలుపు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో నేడు రాష్ట్ర వ్యాపిత నిరసనలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఒక మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు, అత్యాచారానికి పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని, నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని, నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాలికపై జరిగిన ఈ దారుణంపై రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలు, పౌర సమాజం నిరసనలు తెలుపుతున్నా, నిందితుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనప్పటికీ, పోలీసులు ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని, దీనికి కారణం పోలీసు యంత్రాంగంపై వస్తున్న రాజకీయ ఒత్తిళ్లే. బీజేపీ పలుకుబడిని ఉపయోగించి కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని, న్యాయానికి, చట్టానికి కట్టుబడి ఉంటానని చెప్పే బండి సంజయ్, తన కొడుకుని రహస్యంగా ఉంచి బెయిల్ కోసం కోర్టుల చుట్టూ తిరగడం బాధ్యతారాహిత్యం. నిజంగా చట్టంపై గౌరవం ఉంటే వెంటనే తన కుమారుడిని పోలీసులకు సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి, డీజీపీ తక్షణమే జోక్యం చేసుకుని నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

# విజయ్ నిర్ణయం, ద్రవిడ వారసత్వం

**తమిళనాడు రాజకీయ చరిత్రలో హేతుబద్ధత అనేది కేవలం మాటల వరకే పరిమితమైన భావన కాదు. అది పెరియార్ ఈ.వే.రామస్వామి నాయకర్ నెత్తురూ చెమటతో నిర్మించిన ఒక సజీవ సంప్రదాయం. ఆ సంప్రదాయానికి తాజాగా ఒక చిన్న కానీ సంకేతాత్మకంగా చాలా పెద్దదైన నిర్ణయం జోడైంది. తమిళగ విధివిడుతలై కట్చి (టీవీకే) అధినేత విజయ్, తన పార్టీలో ఓఎస్డీ హోదాలో నియమించిన జ్యోతిష్య సలహాదారుడి నియామకాన్ని రద్దు చేయడం. ఇది చిన్న విషయమా? పైకి అలా కనిపించవచ్చు. కానీ ఈ నిర్ణయం వెనక ఉన్న చారిత్రక సందర్భాన్ని అర్థం చేసుకుంటే ఇది కేవలం ఒక ఉత్తర్వు రద్దు మాత్రమే కాదు, అది ఒక తాత్విక ప్రకటన.**

సంపాదకీయం

ఇరవయ్యో శతాబ్దపు తొలి దశకాలలో, ప్రపంచం పారిశ్రామిక విప్లవం నుండి ఆధునికతలోకి అడుగుపెడుతున్న సమయంలో, భారతదేశంలో ముఖ్యంగా దక్షిణ భారతంలో సమాజం ఇంకా కుల వ్యవస్థ సంకెళ్ళలో, మత మూఢత్వపు చీకట్లలో మగ్గిపోతూ ఉంది. బ్రాహ్మణీయ ఆధిపత్యం సమాజాన్ని పిండివేస్తున్న కాలంలో, అగ్రవర్ణాల గుత్తాధిపత్యం జ్ఞానాన్నీ, అవకాశాలనూ కొల్లగొడుతున్న సమయంలో ఒక సింహం గర్జించింది. ఆ సింహమే.. పెరియార్ ఈ.వే. రామస్వామి నాయకర్. 1879లో జన్మించిన పెరియార్ తన యవ్వనంలో మతంలో విముక్తిని వెతికారు. కాశీ వెళ్ళారు. కానీ అక్కడ చూసింది మోక్షం కాదు కులవివక్ష, అవమానం, పేదల దోపిడీ. ఆ అనుభవమే ఆయనను మార్చింది. వెనక్కు తిరిగి వచ్చిన పెరియార్ దేవుడిని కాదన్నారు కాదు దేవుడి పేరుతో జరిగే అన్యాయాన్ని ధిక్కరించారు. "దేవుడు లేడని నాకు తెలియదు. కానీ దేవుడి పేరు చెప్పి మీ హక్కులు దోచుకుంటున్న మనుషులు మాత్రం ఉన్నారు" అని సూటిగా చెప్పగలిగిన ధైర్యం ఆయనది. పెరియార్ స్థాపించిన స్వయం గౌరవ ఉద్యమం 1925లో ప్రారంభమైంది. ఇది కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు, అది ఒక మేధో విప్లవం. కుల వ్యవస్థను తిరస్కరించింది. పురోహిత వర్గం లేకుండా వివాహాలు చేయించింది. స్త్రీల హక్కులను చాటింది. అక్షరాస్యతను, హేతుబద్ధ ఆలోచనను సామాన్య ప్రజలకు చేరువ చేసింది. ఆయన పత్రిక "కుడి అరసు" ద్వారా, "విదుతలై" ద్వారా సమాజాన్ని మేల్కొలిపారు. "చదువుకో, ఆలోచించు, ప్రశ్నించు" అనే మూడు పదాలే ఆయన ఆయుధాలు.

'జ్యోతిష్యం నమ్మడమంటే మీ విధిని మీరు నిర్ణయించుకునే శక్తిని మీరే వదులుకోవడం. ఇది మిమ్మల్ని బానిసలుగా చేసే సాధనం.' అన్నారాయన. గ్రహ స్థితులు మీ జీవితాన్ని నిర్ణయిస్తాయని నమ్మే వ్యక్తి తన పరిస్థితిని మార్చుకోవడానికి పోరాడాలని అనుకోడు. అందుకే పెరియార్ జ్యోతిష్యాన్ని వ్యతిరేకించారు. అది వ్యక్తిగత నమ్మకం కాబట్టి కాదు, అది సామాజిక నిద్రమత్తుకు కారణమవుతుంది కాబట్టి. పెరియార్ వెలిగించిన జ్వాల నుండి అన్నాదురై ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) స్థాపించారు. ఆ ఉద్యమం తమిళనాడు రాజకీయాలను సమూలంగా మార్చింది. 1967లో అధికారంలోకి వచ్చిన డీఎంకే అంటరానితనాన్ని నిరసించింది, వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు విస్తరించింది, హిందీ రుద్దడాన్ని ధిక్కరించింది. కరుణానిధి హయాంలో హేతువాద ప్రచారం మరింత బలపడింది. మూఢనమ్మకాల నిరోధక చట్టాలు వచ్చాయి. నాటకాలు, సినిమాలు, సాహిత్యం ద్వారా హేతుబద్ధ ఆలోచన సామాన్యుల వరకూ వ్యాపించింది. ఇది తమిళనాడును "హేతువాద రాజ్యం"గా పేర్కొనేలా చేసింది. కేవలం నినాదంలో కాదు, ఆచరణలో కూడా. విజయ్ ఒక చలనచిత్ర నటుడు నుండి రాజకీయ నాయకుడిగా పరివర్తన చెందుతున్నారు. ఆ పరివర్తన మార్గంలో అనేక పరీక్షలు ఉంటాయి. తాను ప్రకటించే సిద్ధాంతానికి తన ఆచరణ అనుగుణంగా ఉందా అన్న పరీక్ష. ఇటీవల పార్టీలో ఓఎస్ డీ హోదాలో ఒక జ్యోతిష్య సలహాదారుడి నియామకం వివాదాస్పదమైంది. ద్రవిడ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న తమిళ సమాజం ఈ నియామకాన్ని తీవ్రంగా విమర్శించింది. హేతువాద సంఘాలు, పెరియరిస్ట్ కార్యకర్తలు, మేధావులు ప్రశ్నించారు. విజయ్ ఆ విమర్శలను పరిగణనలోకి తీసుకున్నారు. నియామకం రద్దు చేశారు. తన ప్రజల మాట విన్నారు.

రాజకీయ నాయకుడు జ్యోతిష్యం నమ్మితే సమాజానికి ఏమి జరుగుతుంది? ఎన్నికల తేదీలు గ్రహ స్థితి బట్టి నిర్ణయిస్తే? విధానాల అమలు "శుభ ముహూర్తం" చూసి చేస్తే? ఆర్థిక నిర్ణయాలు జ్యోతిష్కుడు సూచించిన రోజున మాత్రమే తీసుకుంటే? ఇవి అసాధ్యమైన ఊహలు కావు. ముహూర్తాలు చూసి ప్రమాణ స్వీకారాలు, జ్యోతిష్కులు నిర్ణయించిన పార్టీ పేర్లు, శంకుస్థాపనలు, ఇవన్నీ మన పాలకవర్గంలో లోతుగా ఇంకిపోయిన విషయాలు. ఒక నాయకుడు వ్యక్తిగతంగా జ్యోతిష్యం నమ్మవచ్చు. కానీ రాజకీయ నిర్ణయాలు జ్యోతిష్కుడి సలహాలతో తీసుకుంటే ప్రజాస్వామ్యానికి అర్థమేమిటి? ఓటర్లు ఇచ్చిన మాండేట్‌ను గ్రహాలు నిర్ణయిస్తాయా? లేదు. అందుకే ఇది రాజ్యాంగపరంగా కూడా ముఖ్యమైన విషయం. మన రాజ్యాంగం శాస్త్రీయ దృక్పథాన్ని ప్రాథమిక విధిగా నిర్దేశించింది. ఆర్టికల్ 51-ఏ (హెచ్). అది అక్షరాల్లో మాత్రమే కాదు, ఆచరణలో కూడా చూపించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. అదేవిధంగా కుల వ్యవస్థపై స్పష్టమైన వ్యతిరేకత చాటాలి. స్త్రీల హక్కులపై, వెనకబడిన వర్గాల అభ్యున్నతిపై ఆచరణ చూపించాలి. పార్టీ నిర్ణయాలలో శాస్త్రీయ దృక్పథం, డేటా ఆధారిత ఆలోచన ప్రతిఫలించాలి. పెరియార్ ఉద్యమం కేవలం ఎన్నికల ముఖచిత్రం కాదు, అది ఒక జీవన విధానం అని నిరూపించాలి. హేతుబద్ధత అనేది బలహీనుల ఆయుధం కాదు.. అది ధైర్యవంతుల ఎంపిక.

# భారత కార్మిక మార్కెట్‌లో మారుతున్న ధోరణులు!




2025 సంవత్సరానికి సంబంధించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదికను గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ జనవరి-డిసెంబర్ 2025 కాలానికి విడుదల చేసింది. ఈ సర్వే భారత కార్మిక మార్కెట్ అధ్యయనంలో ఒక ముఖ్యమైన విధానపర మైన మైలురాయిగా నిలిచింది. మొదటిసారిగా పునర్వ్యవస్థీకరించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే గ్రామీణ, పట్టణ భారతదేశాన్ని ప్రతి నెలా కవర్ చేసింది. ఇంతకుముందు జూలై-జూన్ చక్రంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన త్రైమాసిక సర్వే ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించింది. ఇటీవలి సంవత్సరాల్లో గ్రామీణ, పట్టణ భారతదేశం లోని కార్మిక మార్కెట్ పరిస్థితులపై అత్యంత సూక్ష్మమైన సమగ్ర చిత్రాన్ని ఈ నివేదిక అందిస్తోంది.

భారతదేశ మొత్తం కార్మిక శక్తి భాగస్వామ్య రేటు అన్ని వయస్సుల కలిపి 44.9%గా నమోదైంది. అంటే ప్రతి 10 మంది భారతీయుల్లో సుమారు 4 మంది ఉద్యోగంలో ఉన్నారు లేదా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. 2024లో ఈ శాతం 44.7%గా ఉండగా, 2025లో కూడా దాదాపు అదే స్థాయిలో కొనసాగింది.

గ్రామీణ ప్రాంతాల్లో మహిళల కార్మిక భాగస్వామ్యం 34.6%గా ఉంది. ఇది పురుషులతో పోలిస్తే తక్కువగానే ఉన్నప్పటికీ, వ్యవసాయం, గృహ ఆధారిత పనుల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తోంది. అయితే పట్టణ ప్రాంతాల్లో మహిళల భాగస్వామ్యం కేవలం 22.2% మాత్రమే. పట్టణ యువ మహిళల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. పట్టణాల్లో ప్రతి 10 మంది మహిళల్లో కేవలం 2 మంది మాత్రమే ఉపాధిలో ఉన్నారు. దీనికి విరుద్ధంగా పట్టణ పురుషుల భాగస్వామ్యం 59.7%గా ఉంది. అంటే మహిళల కంటే రెండింతలకు పైగా. ఇది భారత పట్టణ కార్మిక మార్కెట్‌లో కొనసాగుతున్న నిర్మాణాత్మక సమస్యలను స్పష్టంగా చూపిస్తోంది.

15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతలో నిరుద్యోగిత రేటు 9.9%గా ఉంది. ఇది జాతీయ సగటు నిరుద్యోగిత రేటు 3.1% కంటే మూడింతలకు పైగా. ప్రత్యేకంగా పట్టణ యువ మహిళలలో నిరుద్యోగిత రేటు 18.9%గా ఉంది. అంటే ప్రతి 5 మందిలో ఒకరు ఉద్యోగం కోసం వెతుకుతూ ఉద్యోగం పొందలేక పోతున్నారు. ఇవి కార్మిక శక్తికి బయట ఉన్న మహిళలు కావు; ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ అవకాశాలు దొరకని మహిళలు.

పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. నిరుద్యోగిత రేటు అనేది కేవలం కార్మిక శక్తిలో ఉన్నవారినే పరిగణనలోకి తీసుకుంటుంది. అంటే ఉద్యోగ అవకాశాల కొరత ఉన్నప్పటికీ మహిళలు ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నారని అర్థం. పట్టణ యువ మహిళల సమస్య మరింత తీవ్రమవుతోంది. 15 సంవత్సరాలు పైబడినవారిలో మాధ్యమిక విద్య లేదా అంతకంటే ఎక్కువ చదువుకున్నవారి నిరుద్యోగిత రేటు 6.5%గా ఉంది. ఇది జాతీయ సగటు కంటే రెండింతలకు పైగా. పట్టణ ప్రాంతాల్లో విద్యావంతుల నిరుద్యోగిత 7.2%గా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 6%గా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్నవారు పూర్తిగా నిరుద్యోగులుగా ఉండకుండా తక్కువ ఉత్పాదకత గల ఉపాధి లేదా జీవనాధార కార్యకలాపాల్లో కొనసాగుతున్నారని ఇది సూచిస్తోంది.

2022 నుంచి 2025 మధ్య మొత్తం నిరుద్యోగిత రేటు 3.6% నుంచి 3.4%కు తగ్గింది. అయినప్పటికీ విద్యావంతుల నిరుద్యోగిత మాత్రం స్థిరంగా అధికంగానే కొనసాగుతోంది. చదువుకున్న వారి సంఖ్య పెరుగుతున్న వేగానికి తగినంత ఉపాధి అవకాశాలు సృష్టించబడలేదని ఇది సూచిస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న మహిళల్లో 70.7% మంది స్వయం ఉపాధిపై ఆధారపడి ఉన్నారు. అయితే ఇది చాలాసార్లు వ్యాపార ఎంపిక కంటే జీవనాధార అవసరాన్ని ప్రతిబింబిస్తుంది. పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న మహిళల్లో 40.4% మంది స్వయం ఉపాధిలో ఉన్నారు. ఇందులో చిన్న వ్యాపారాలు, అసంఘటిత ఉపాధి రెండూ ఉన్నాయి.

సాధారణ వేతన ఉద్యోగాలు లేదా జీతభత్యాల ఉద్యోగాలు సాధారణంగా అధికారిక ఉపాధికి సూచికగా భావిస్తారు. గ్రామీణ మహిళల్లో కేవలం 9.3% మందికే ఇలాంటి ఉద్యోగాలు ఉన్నాయి. మరో 20% మంది రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. అక్కడ పనిచేస్తున్న మహిళల్లో 50.9% మంది క్రమబద్ధ వేతన ఉద్యోగాల్లో ఉన్నారు.

మొత్తం జనాభాలో కార్మిక జనాభా నిష్పత్తి 2022లో 39.7%గా ఉండగా, 2025లో 43.5%కు పెరిగింది. అంటే ఎక్కువ మంది భారతీయులు ఉద్యోగాల్లో చేరుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళల కార్మిక జనాభా నిష్పత్తి 26.9% నుంచి 33.8%కు పెరిగింది. ఇది మహిళల కార్మిక భాగస్వామ్యంలో గణనీయమైన పెరుగుదలను సూచిస్తోంది. రచయిత భారత గణాంక సేవ అధికారి. ప్రస్తుతం గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖలో సంయుక్త సంచాలకుడిగా పనిచేస్తున్నారు. ఇందులో వ్యక్తీకరించిన అభిప్రాయాలు రచయిత వ్యక్తిగతమైనవి.

భారత కార్మిక మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న మార్పులను పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2025 మరింత లోతుగా విశ్లేషించినప్పుడు, దేశ ఆర్థిక నిర్మాణంలో ఉన్న అసమానతలు స్పష్టంగా బయటపడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఉపాధి పెరుగుదల కనిపిస్తున్నప్పటికీ, ఆ ఉపాధి నాణ్యతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మహిళలు ఉపాధిలో చేరుతున్నారని గణాంకాలు చూపుతున్నా, వారిలో చాలా మంది తక్కువ ఆదాయం కలిగిన అసంఘటిత రంగాల్లోనే కొనసాగుతున్నా రు. వ్యవసాయం, పశుపోషణ, కుటుంబ ఆధారిత చిన్న పనులు, స్వయం ఉపాధి పేరుతో జరిగే అసంఘటిత కార్యకలాపాలు మహిళల ఉపాధిలో ప్రధాన భాగంగా నిలుస్తున్నాయి.

గ్రామీణ మహిళల్లో స్వయం ఉపాధి 70.7%గా ఉండటం ఉపాధి అవకాశాల కొరతను కూడా సూచిస్తోంది. అనేక సందర్భాల్లో ఇది స్వచ్ఛంద వ్యాపార ప్రవేశం కాదు. కుటుంబ ఆర్థిక అవసరాల కారణంగా మహిళలు వ్యవసాయ పనుల్లో భాగస్వామ్యం కావడం, ఇంటి వద్ద చిన్న ఉత్పత్తి పనులు చేయడం, పశువుల సంరక్షణలో పాల్గొనడం వంటి అంశాలు ఈ గణాంకాల్లో ప్రతిఫలిస్తున్నాయి. ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ కుటుంబ జీవనాధారాన్ని కొనసాగించేందుకు మహిళలు ఈ రంగాల్లో కొనసాగుతున్నారు.

పట్టణ భారతదేశంలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో మహిళల కార్మిక భాగస్వామ్యం కేవలం 22.2% మాత్రమే ఉండటం నగరీకరణ పెరుగుతున్న దేశానికి ఒక పెద్ద సవాలుగా మారింది. విద్యావంతులైన మహిళలు ఉద్యోగాల కోసం సిద్ధంగా ఉన్నప్పటికీ, తగిన అవకాశాలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. అనేక సంస్థలు మహిళలకు సమాన అవకాశాలు ఇస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో నియామకా లు, వేతనాలు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత వంటి అంశాల్లో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయి.

ప్రత్యేకంగా పట్టణ యువ మహిళల నిరుద్యోగిత 18.9%గా ఉండటం తీవ్రమైన హెచ్చరికగా పరిగణించాలి. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు; సామాజిక నిర్మాణంలో ఉన్న అడ్డంకులను కూడా ప్రతిబింబిస్తోంది. కుటుంబ బాధ్యతలు, భద్రతా సమస్యలు, ఉద్యోగ ప్రదేశాల్లో వివక్ష, రవాణా సౌకర్యాల కొరత, పెరుగుతున్న జీవన వ్యయం వంటి అనేక అంశాలు మహిళల ఉపాధి అవకాశాలను ప్రభావితం చేస్తున్నాయి. అనేక యువ మహిళలు చదువుకున్నప్పటికీ వివాహం తర్వాత ఉద్యోగాలను వదిలేయాల్సి వస్తోంది.

పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే గణాంకాలు విద్యావంతుల నిరుద్యోగితపై కూడా తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దేశంలో విద్యా విస్తరణ వేగంగా జరుగుతున్నప్పటికీ, ఉద్యోగ మార్కెట్ అదే స్థాయిలో విస్తరించడం లేదు. ఇంజినీరింగ్, పట్టభద్ర, స్నాతకోత్తర విద్య చదివిన లక్షలాది మంది యువతకు తగిన ఉద్యోగాలు దొరకడం లేదు. ప్రైవేటు రంగంలో అవకాశాలు పరిమితంగా ఉండగా, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య కూడా తక్కువగానే ఉంది. ఫలితంగా చదువుకున్న యువతలో నిరాశ, అసంతృప్తి పెరుగుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువత నిరుద్యోగులుగా నమోదు కాకుండా వ్యవసాయం లేదా కుటుంబ ఆధారిత పనుల్లో కొనసాగుతున్నారని నివేదిక సూచిస్తోంది. దీని వల్ల గ్రామీణ నిరుద్యోగిత పట్టణాల కంటే తక్కువగా కనిపించినప్పటికీ, వాస్తవానికి అది దాచిన నిరుద్యోగిత రూపంలో కొనసాగుతోంది. ఒకే వ్యవసాయ భూమిపై అవసరానికి మించిన కుటుంబ సభ్యులు పని చేయడం వల్ల ఉత్పాదకత తగ్గుతోంది.

భారత ఆర్థిక వ్యవస్థలో సేవారంగం వేగంగా పెరుగుతున్నప్పటికీ, ఆ రంగం అందరికీ సమాన ఉపాధి అవకాశాలు కల్పించడం లేదు. సమాచార సాంకేతికత, ఆర్థిక సేవలు, సమాచార ప్రసారం, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో అధిక నైపుణ్యం ఉన్నవారికి మాత్రమే అవకాశాలు లభిస్తున్నాయి. తక్కువ నైపుణ్యం కలిగిన యువత మాత్రం అసంఘటిత రంగాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. సరుకు పంపిణీ సేవలు, తాత్కాలిక ఒప్పంద పనులు, అనువర్తన ఆధారిత ఉపాధి వంటి ఉద్యోగాలు పెరుగుతున్నప్పటికీ, వాటిలో ఉద్యోగ భద్రత చాలా తక్కువగా ఉంది.

దేశంలో మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచడానికి ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయి. స్వయం సహాయక సంఘాలు, ముద్ర రుణాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభ సంస్థల ప్రోత్సాహకాలు వంటి కార్యక్రమాలు అమలులో ఉన్నప్పటికీ, వాటి ప్రభావం అన్ని ప్రాంతాలకు సమానంగా చేరడం లేదు. ముఖ్యంగా పట్టణ మధ్యతరగతి మహిళలకు తగిన ఉద్యోగ అవకాశాలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి.

యువతలో నిరుద్యోగిత పెరగడం దేశ ఆర్థికాభివృద్ధిపై కూడా ప్రభావం చూపుతుంది. ఉద్యోగాలు లేకపోతే వినియోగం తగ్గుతుంది. వినియోగం తగ్గితే పరిశ్రమల ఉత్పత్తి ప్రభావితం అవుతుంది. ఇది తిరిగి కొత్త ఉద్యోగాల సృష్టిని తగ్గిస్తుంది. ఈ చక్రం దీర్ఘకాలంలో ఆర్థిక వృద్ధిని మందగింపజేయవచ్చు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## మనుషులు!



పక్షి జంతు సమూహాలకు
ఉన్న ప్రేమ మనిషికి లేదు!
వీడిని వాటితో పోల్చొద్దు
అవి బాధపడతాయి!

దున్నపోతా! కుక్కా! నక్కా
కోతీ! గాడిదా.. ఇవి అన్నీ
ప్రేమలో అగ్రస్థానం తెల్సా!
వీడెందుకూ పనికి రాడు!

కుక్క పిల్ల కుంటలోపడితే
అది చూసిన **కోతిపిల్ల** బాధ
జాతి వివక్ష కూడా లేదు!
కిచకిచమంటూ ఏడుపు!

పిల్లిపిల్లకు పాలిచ్చే కుక్క!
కాకి చనిపోతే చుట్టూ
కాకులు చేరి **కాకిగోల!**
గోలకాదుహృదయవేదన

కాని మనుషులకేమైంది?
రోడ్డుపైప్రమాదంజరిగితే
వీడు వీడియో తీస్తాడు!
చూసుకుంటూ పోతాడు!

వీధిలో సంగతి సరే!
ఇంట్లోనే దిక్కులేదు!
డబ్బుకోసం గడ్డితిని
లుప్తమైన ప్రేమలు!

భార్యాభర్తలు తల్లీపిల్లలు
అక్రమ సంబంధాలు
హత్యలు ఉన్మాదం
ఎవరికి ఎవరో ఈ లోకం!

విలువల్లేవు! డబ్బు కోసం
ఎంత నీచానికైనా రెడీ!
కొట్టుకుచస్తున్నారు!
దున్నపోతు వెధవలు!

అయ్యో! దున్నపోతుతో
పోలిక కుదరదు!ఎలా
తిట్టాలో అర్థం కావట్లేదు!
చావండి ఃడబ్బుఃకోసం!

గల్లీ తగాదాలే కాదు
ఢిల్లీ రాజకీయాలు
ప్రపంచమంతా డబ్బే!
**చిన్న లేదు పెద్ద లేదు !**

ప్రేమలేమై పోయాయ్!
డబ్బులు మింగేసాయ్!
అంతా నటచక్రవర్తులు!
డబ్బులు!మనుషులు!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్



# నిశ్శబ్దమే నీ స్వేచ్ఛా ప్రకటన

ఇప్పుడు మనం నిశ్శబ్దం గురించి కాస్త మాట్లాడుకుందాం. నిశ్శబ్దం అనేది శూన్యం కాదు, అది ఒక నిండుతనం. ఈ సమాజం మనల్ని మాటలతో, నిర్వచనాలతో బంధించాలని చూస్తున్నప్పుడు, "నేను మీకు అందను" అని చెప్పే నిశ్శబ్దమే మన స్వేచ్ఛా పతాకం. అది మనల్ని మనకే పరిచయం చేస్తుంది. "నిశ్శబ్దం అనేది ఒక రకంగా స్వేచ్ఛకు పునాది. "నిశ్శబ్దమే నీ స్వేచ్ఛా ప్రకటన" ఈ మాట వినడానికి సాదాసీదాగా అనిపించినా, దీని వెనుక అనంతమైన తాత్వికత, మానసిక లోతు ఉంది. ఆధునిక ప్రపంచంలో "మాట్లాడటమే" ఉనికి అని భావిస్తుంటారు. "నిశ్శబ్దం"గా ఉండటాన్ని నిస్సయతగా అనుకుంటుంటారు. "నిశ్శబ్దం"గా ఉన్నవారిని శక్తిలేనివారిగా ఒంటరైనవారిగా భావిస్తుంటారు. కానీ "నిశ్శబ్దం"అనేది ఒక తిరుగుబాటుగా, అత్యున్నత స్వేచ్ఛా ప్రకటనగా చూడాలి. అంతే కాదు చాలామంది నిశ్శబ్దాన్ని నిస్సహాయత అనుకుంటారు. కానీ నిజానికి, అనవసరమైన చోట మౌనంగా ఉండగలగడం అత్యున్నతమైన శక్తి. ఈ ప్రపంచం మనల్ని రకరకాల అభిప్రాయాలతో ప్రభావితం చేయాలని చూస్తున్నప్పుడు, వాటన్నింటినీ కాదని మనలో మనం స్థిరంగా ఉండటమే నిజమైన స్వేచ్ఛ. నేటి సోషల్ మీడియా కాలంలో ప్రతి చిన్న విషయానికి స్పందించడం ఒక అలవాటుగా మారింది. అందరూ ట్రెండింగ్ విషయాల మీద పోస్టులు పెడుతున్నప్పుడు, మీరు ఏమీ స్పందించకుండా ఉండటం కూడా ఒక గొప్ప స్వేచ్ఛే. అది "నేను ఈ డిజిటల్ గొర్రెల మందలో భాగం కాదు" అని మీరు మీకు ఇచ్చుకునే స్వేచ్ఛా ప్రకటన. మనం చూస్తుంటాం. మనం ఎప్పుడూ ఇతరులకు సమాధానం చెప్పాలనే తాపత్రయంలో ఉంటాం. ఎవరైనా విమర్శిస్తే వెంటనే కౌంటర్ ఇవ్వాలి అనుకుంటాం. ఎవరైనా ఆరోపణలు చేస్తే కంగారు పడటంమో, ఉలిక్కిపడటమో చేస్తుంటాం. కానీ "నేను ఎవరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు" అని మీరు అనుకున్న క్షణం, మీరు స్వేచ్ఛా జీవి అవుతారు. సమాజంలో మన గురించి రకరకాల పుకార్లు లేదా విమర్శలు వస్తుంటాయి. ప్రతిదానికీ వివరణ ఇచ్చుకుంటూ పోతే మన శక్తి వృథా అవుతుందని గ్రహించాలి. మౌనంగా ఉండి తమ పని ద్వారా సమాధానం చెప్పడం అంటే ఆ మౌనం "నా విలువ నాకు తెలుసు, మీ సర్టిఫికెట్లు నాకు అక్కర్లేదు" అనే స్వేచ్ఛను ప్రకటిస్తుందని అందరికి అర్థం కానీ నిశ్శబ్ద స్వేచ్ఛా ప్రకటన. శబ్దం ఉన్న చోట గందరగోళం ఉంటుంది. నిశ్శబ్దం ఉన్న చోట స్పష్టత ఉంటుంది. గొప్ప ఆవిష్కరణలు, లోతైన ఆలోచనలు అన్నీ ప్రశాంతమైన మౌనంలోనే పుడతాయి. మనల్ని మనం తెలుసుకోవడానికి ఒక అత్యున్నతమైన ఆయుధంగా ఉంటుంది. కొన్నిసార్లు నిశ్శబ్దం అత్యంత శక్తివంతమైన నిరసనగా కూడా ఉంటుంది. అనవసరమైన తర్కాలకు తావు ఇవ్వకుండా, మౌనంగా తన పని తాను చేసుకుపోవడం అనేది ఎదుటివారి అహంకారాన్ని దెబ్బతీసే ఒక పదునైన యుద్ధ ప్రకటన కూడా అనేది ఆ మౌన తాత్వాకత కలిగిన మనుషులకు ఉంటుంది.

ఇక్కడ మనం ఎంతోకొంత అర్థం చేసుకోవాల్సిన అంశం ఏమిటంటే "నిశ్శబ్దమే నీ స్వేచ్ఛా ప్రకటన" అంటే అర్థం నీ మనసుపై నీకు పూర్తి నియంత్రణ ఉందని ప్రపంచానికి చాటి చెప్పడం. మాటల ప్రవాహంలో కొట్టుకుపోకుండా, నీ నిశ్శబ్దంలో నువ్వు గంభీరంగా నిలబడగలిగితే, అదే నీ అసలైన గెలుపు. నీవు ఎంత తక్కువగా మాట్లాడితే, ప్రపంచం నీ మాటల కోసం అంత ఎక్కువగా వేచి చూస్తుంది. నీ మౌనం నీ బలం కావాలి కానీ బలహీనత కాకూడదు. అందుకే ఎదుటి వ్యక్తి నిశ్శబ్దంగా ఉంటే అదేదో బలహీనతగానో, నిస్సయతగానో చూడటం అజ్ఞానమే అవుతుంది. నిశ్శబ్దంగా ఉన్న వ్యక్తిలో తాత్విక కోణంలో స్వేచ్ఛా ప్రకటన, ధిక్కారం, ఈ సమాజం విధించే అనవసరమైన నిబంధనలు తోసిపుచ్చుతూ నిశ్శబ్ద స్వేచ్ఛా ప్రకటన చేస్తున్నాడా అనేదే ప్రమాణికంగా ఉంటుంది.



రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్
rajenderdamera@mail.com

## ప్రజలకు పొదుపు పై పాఠాలు చెప్పే ముందు

# మోదీ లగ్జరీ జీవన విధానం మారుతుందా!?

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవలి పశ్చిమ ఆసియా సంక్షోభం మధ్య , దేశ ప్రజలను ఆదా చేయమని, పొదుపు పాటించమని సలహాలు , సూచనలు చేశారు.ముఖ్యంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ వాడకం తగ్గించండి, బంగారం కొనుగోళ్లు నిలిపేయండి, విదేశీ ప్రయాణాలు తగ్గించండి, స్వదేశీ వస్తువులను మాత్రమే వాడండి అని పిలుపు ఇచ్చారు. ఇది ఆర్థిక సంక్షోభ సమయంలో ప్రజల నుంచి త్యాగాలు కోరే సాధారణ రాజకీయ ఉపాయం కావచ్చు. మంచి సలహాలే. కానీ ఈ పిలుపు ఇచ్చే వ్యక్తి స్వయం జీవన విధానం, ప్రభుత్వ వ్యయ వైభవం చూస్తే రక్తం మరిగిపోతుంది. ఇది స్పష్టమైన ద్వేషపూరిత ద్వంద్వ ప్రమాణాలు.

మోదీ ప్రభుత్వం కాలంలో అత్యంత ఖరీదైన వివిఐపి విమానాల కొనుగోలు ఒక ఉదాహరణ. సుమారు "ఎనిమిది వేల కోట్ల రూపాయలు" ఖర్చు చేసి రెండు బోయింగ్ ఎనిమిది వందల డెబ్బై ఏడు-మూడు వందల ఈఆర్ విమానాలు (ఎయిర్ ఇండియా వన్) తెచ్చారు. ఇందులో అత్యాధునిక భద్రతా వ్యవస్థలు, విలాసవంతమైన అమరికలు ఉన్నాయి. ఒకవైపు ప్రజలు పెట్రోల్ ఆదా చేయాలని, మరోవైపు ప్రధాన మంత్రి ప్రయాణాలకు భారీ ఇంధనం వాడే, కోట్లు ఖర్చు చేసిన విమానాలు. ఇది కేవలం అవసరం కాదు, ప్రజల డబ్బుతో వ్యక్తిగత వైభవం. యుపిఎ కాలం నుంచి ప్రారంభమైందని చెప్పి బాధ్యతల నుండి తప్పుకోవడం సులభం, కానీ ఖర్చులు మోదీ పాలనలోనే జరిగాయి. ఇంత ఖర్చు చేస్తే ఎందుకు ప్రజలు మెట్రోలో, బస్సులో ఇబ్బంది పడాలి?

బంగారం విషయంలో మరింత దారుణం. మోదీ పిలుపును బలపరచడానికి బీజేపీ/ఆర్ఎస్ఎస్ సోషల్ మీడియా యంత్రాంగం ఒక ఘోరమైన కృత్రిమ వార్తను వైరల్ చేసింది. 1967లో "ది హిందూ " పత్రికలో ఇందిరా గాంధీ "బంగారం కొనవద్దు" అని సూచించిందని కృత్రిమ క్లిప్పింగ్ తయారు చేశారు. ది హిందూ స్వయంగా దీనిని ఖండించింది. చరిత్రను కాల్చి, దేశాన్ని మోసం చేసి, ప్రజలను త్యాగం చేయమని బెదిరించడం ఎంతటి నీచం? బంగారం దిగుమతులు భారీగా ఉన్నాయనేది నిజమే, కానీ ప్రజల బంగారం మీద వ్యామోహం వదిలేసి, కొనుగోళ్లు ఆపాలని చెప్పిన ప్రభుత్వం తన వైభవాన్ని కొనసాగించడం అన్యాయం కదా. బంగారం, వజ్రాల వ్యాపారులు, నగలు తయారు చేసే కార్మికులకు లక్షలాది మంది ఉపాధి,బేరాలు లేక రోడ్డున పడతారు.వాళ్ళం ఏలా బ్రతకాలి?



అలాగే ఇలాంటి ప్రభోదాలు చేసే మోదీగారి వ్యక్తిగత జీవిత విలాసం ఎంతో బహిరంగంగా ప్రజలకు కనపడుతుంది. కస్టమ్ మేడ్ కుర్తాలు, లక్షల రూపాయల మోనోగ్రామ్డ్ సూట్లు, బీవీఎల్‌గారి గ్లాసెస్, ఖరీదైన స్విస్ వాచీలు, మాంట్‌బ్లాంక్ పెన్స్, కాశ్మీర్ షాల్స్ – ఇవన్నీ "సాధారణ చాయ్‌వాలా" ఇమేజ్‌ను ఎగతాళి చేస్తున్నాయి. అధికారిక ఉపయోగం కోసం మెర్సిడెస్ మేబాక్, భారీ కాన్వాయ్‌లు, అపారమైన భద్రతా ఏర్పాట్లు ఇవన్నీ ప్రజల డబ్బుతో నడుస్తున్న విలాసాలే. ప్రజలు గ్యాస్ సిలిండర్ ఖర్చు భరించలేకపోతే, నాయకుడు ఎందుకు ఇంత వైభవంగా జీవించాలి?

ప్రభుత్వం "భద్రతా అవసరం" అంటుంది. కానీ భారతదేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు సాధారణంగా ప్రయాణించారు. ఇంత ఖర్చు చేసి, ఇంత వైభవం చూపించిన ప్రధాన మంత్రులు గతంలో ఎవరూ లేరు.ఆగర్భ శ్రీమంతుడు జవహర్లాల్ నెహ్రూ కూడా నిరాడంబరంగా జీవించారు. ఇప్పుడు మోదీ ప్రజలను ఆదా చేయమని అడగడం అవమానకరం. సోమనాథ్ ఆలయం, వివిధ కార్యక్రమాల్లో అధికారిక వ్యయాలు కూడా విలాస స్థాయిలోనే ఉన్నాయి. ఇది ప్రజా ధనాన్ని వ్యక్తిగత బ్రాండ్ నిర్మాణానికి వాడుకోవడం కాదా!?. భారతదేశం ఇంధనం, బంగారం, ఎడిబుల్ ఆయిల్ దిగుమతులపై ఆధారపడి ఉంది. సంక్షోభ సమయంలో ప్రజలు నిజంగా ఇబ్బంది పడుతున్నారు. కానీ నాయకులు "ధర్మం ఇంటి నుంచి మొదలవ్వాలి" అని మరచిపోయారు. ఎనిమిది వేల కోట్ల విమానం ఉంటే, ప్రజలు బంగారం కొనకూడదని, పెట్రోల్ తగ్గించాలని అడగడం పూర్తి అన్యాయం. ఇది రాజకీయ నాయకత్వం యొక్క నైతిక క్షీణతను చూపిస్తుంది.

మోదీ ఇమేజ్ సాధారణత్వం మీద నిర్మించబడింది. కానీ వాస్తవం చాలా భిన్నం.తాను విలాసం, వైభవం, అపారమైన ప్రభుత్వ వ్యయం చేస్తూ. ప్రజలకు మాత్రమే పొదుపు పాఠాలు చెప్పే ఈ వైరుధ్యాలు ప్రజల విశ్వాసాన్ని క్రమంగా కోల్పోతున్నాయి. త్యాగం అంటే అందరికీ సమానంగా ఉండాలి, ఒక్క వర్గం మాత్రం విలాసాలు అనుభవించడం కాదు. ఇది కేవలం విమర్శ కాదు, జవాబుదారీతనం కోసం... ప్రజలు నుండి వచ్చిన బలమైన ప్రశ్న. ప్రజల డబ్బుతో విలాసాలతో జీవించే నాయకులు ముందు తమ జీవన విధానాన్ని మార్చుకోవాలి. లేకపోతే ఈ పిలుపులకు అర్థం లేదు. కేవలం డొల్లతనపు మాటలుగా మిగిలిపోతాయి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
14 మే 2026

# నీట్-2026 పేపర్ లీకేజీ - మోడీ ప్రభుత్వ ఘోర వైఫల్యం

- 22 లక్షల విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
- ధర్మేంద్ర ప్రధాన్ తక్షణం రాజీనామా చేయాలి
- ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద ఉరివేసుకుని ఎస్ఎఫ్ఐ వినూత్న నిరసన




**హైదరాబాద్, మే 13 (జనంసాక్షి):** దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాల ఆశలను మోస్తున్న నీట్-2026 పరీక్ష మరోసారి అవినీతి, నిర్లక్ష్యం, కోచింగ్ మాఫియా - అధికార యంత్రాంగం కుమ్మక్కు కారణంగా విద్యార్థుల శాపంగా మారిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండిపడింది.
నీట్ పరీక్షను పారదర్శకంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద ఉరివేసుకుని వినూత్న నిరసన చేపట్టారు.
ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. నాగరాజు, జాతీయ సహాయ కార్యదర్శి ఎం.డి. అతిక్ అహ్మద్ మాట్లాడుతూ, మే 3న నిర్వహించిన నీట్-2026 పరీక్షలో పేపర్ లీకేజీ, భారీ అక్రమాలు వెలుగులోకి రావడం మోడీ ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నేడు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.
2024లో జరిగిన పేపర్ లీక్ ఘటనపై అప్పట్లోనే కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే నేడు ఇంత పెద్ద స్కాండల్ పునరావృతమైందని, పరీక్షా వ్యవస్థను కేంద్రం కోచింగ్ మాఫియాకు, కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నేతలు ఈ సంచలనం కేసులో కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకొని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# సీబీఎస్ఇ 12వ తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల జయకేతనం

- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి




**కరీంనగర్ బ్యూరో, మే 13 (జనంసాక్షి) :**
చక్కటి ప్రణాళికల ద్వారా సరైన పద్ధతిలో సమీక్ష నిర్వహణ ద్వారా విద్యార్థులచే విజయాలను సులభంగా సాదింప చేయవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో అల్ఫోర్స్ సీబీఎస్ఈ సీనియర్ సెకండరీ పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు బుధవారం రోజు ప్రకటించిన 12వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల నిర్వహించి నటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలు పాటించడమే కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినటువంటి అధ్యాపకులచే బోధన అందిస్తూ అగ్రగామిగా నిలుపుతున్నామని వారు సంతోషం వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో పై చేయి సాధించడం, ఇప్పటివరకు ప్రకటించినటువంటి అన్ని రకాల పరీక్షల ఫలితాల్లో స్ఫూర్తిదాయకమైన మార్పులతో ఆదర్శంగా నిలిచినదని సంతోషం వ్యక్తం చేశారు. 7గురు విద్యార్థులు 460 పైగా సాధించారని, 47 మంది విద్యార్థులు 400 మార్కులు పైగా సాధించడం చాలా గొప్ప విషయమని చెప్పారు.
పిసీఎం విభాగంలో వి. శ్రేయాస్ రెడ్డి 475 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిల్చాదని, జి.చైత్ర 471 మార్కులు, ఎన్.రత్నప్రకాష్ 469 మార్కులు, బి.లిఖిత్ సాయి 461 మార్కులు, కే. ఐశ్వర్య 458 మార్కులు, హర్షఫ్ అర్మాన్ 456 మార్కులు, వి.సాయి హర్షిత్ 456 మార్కులు, బి రోహిత్ 455 మార్కులు, ఎన్.కావ్య, జె.సరయు 450 మార్కులు తదితరులు మంచి మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు.
పిసిబి విభాగంలో డి.రుత్విక్ 476 మార్కులుతో పాఠశాలలో ప్రథమస్థానం లో నిలిచాడని, పి.శృత్విక 472 మార్కులు, డి.శ్రేయన్ష్ 462 మార్కులు తదితరులు అత్యుత్తమ మార్కులు సాధించారని చెప్పారు. అధ్యాపకుల నిరంతర కృషితో తల్లిదండ్రుల అమూల్యమైనటువంటి సహకారంతో ఈ అద్భుతమైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు. గత 36 సంవత్సరాలుగా అల్ఫోర్స్ విద్యాసంస్థలు చాలా చక్కటి కార్యక్రమాలతో, ప్రపంచ ప్రమాణాలను పాటింపచేస్తూ, భారతదేశంలో గుర్తింపు పొందిన బోధనా సిబ్బందితో బోధిస్తూ అగ్రగామిగా ఉంటున్నామని వారు చెప్పారు. చాలా చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్చాలను, స్కోర్ కార్డ్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**తలకొండపల్లి మే13(జనంసాక్షి):** విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలను,గురుకులాలను బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందేలా చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు.బుధవారం మండల పరిధిలోని మెదక్ పల్లి గ్రామంలో రూ,16 లక్షల 50 వేల నిధులతో ప్రాథమికోన్నత పాఠశాల భవన నిర్మాణానికి సర్పంచ్ రమేష్,నాయకులు విజేందర్ రెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వము కృషి చేస్తుందని ఆయన అన్నారు.తలకొండపల్లి మండలంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం,వెల్జాల్,కు మోడల్ స్కూల్ మంజూరైనట్లు పేర్కొన్నారు.పాఠశాల భవన నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలను పాటించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ యాటగీతా నర్సింహా,వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి,ఎంపీడీవో శ్రీకాంత్,మండల విద్యాధికారి చాంప్లా నాయక్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ రమేష్,ఉప సర్పంచ్ కసిరెడ్డి సుధాకర్ రెడ్డి,మాజీ సర్పంచులు అల్వాల్ రెడ్డి,జగన్నాథం గౌడ్,కాంగ్రెస్ నాయకులు కసిరెడ్డి విజేందర్ రెడ్డి,మాజీ ఎంపీపీ రఘు రాములు,డేవిడ్,విష్ణు గౌడ్,జనార్దన్,నరేందర్ గౌడ్,ఈశ్వర్ గౌడ్,అశోక్,నరేష్ గౌడ్,రవికిరణ్ రెడ్డి,పవన్ వాల్మీకి,మల్లేష్,చెన్నకేశవులు,వివిధ శాఖల అధికారులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఒత్తిడితో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**శేరిలింగంపల్లి, మే 13 (జనంసాక్షి) :** తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీస్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతానికి చెందిన మద్యపు పూజారెడ్డి(16) మాదాపూర్ పరిధి సరస్వతి క్యాంపస్ లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతుంది. ఈ మధ్యనే రాసిన ఇంటర్ పరీక్షలలో మార్కులు తక్కువగా రావడంతో బెటర్మెంట్ కోసం సప్లమెంటరీ ప్రిపేర్ అవుతుంది. ఈ క్రమంలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై మంగళవారం రాత్రి తన రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాల యాజమాన్యం సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని పూజ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తును కొనసాగిస్తున్నారు. పోస్టు మార్టం ముగిసిన పిదప వారి కుటుంబ సభ్యుల కు మృతదేహాన్ని అందించనున్నట్లు పోలీస్ అధికారులు మీడియా సమావేశంలో వెల్లడించారు.


# జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ సేవలను వినియోగించుకోవాలి




**నిజామాబాద్ సిటీ మే 13 జనం సాక్షి :**
జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ సేవలను వినియోగించుకోవాలని లిజే సి ఎస్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్టీ ఆకుల పాపయ్యలి అన్నారు. నిజామాబాద్ నగరంలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్టీ సభ్యులు లిడా. రామ్మోహన్ రావు ,డాక్టర్ జయనీ నెహ్రూలి దంపతులు వందలాది పుస్తకాలను జెసియస్ ప్రసాద్ మెమోరియల్ లైబ్రరీ కి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఖలీల్ వాడి లో సభను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆకుల పాపయ్య మాట్లాడుతూ నిజామాబాద్ నగరం కోటగల్లి లో ఉన్న జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ లైబ్రరీ లో ఎంతోమంది విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, ఉపాధి అవకాశాలే కాకుండా శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవడానికి ఇక్కడ అనేక పుస్తకాలు దోహదపడుతున్నాయని, అన్ని రకాల వేలాది పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయని వాటిని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, త్వరలో డిజిటల్ లైబ్రరీ చేయడానికి జెసిఎస్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాట్లు చేస్తుందని అన్నారు. సభలో లిడాక్టర్ సూరిలి మాట్లాడుతూ ప్రజలు పుస్తకాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు, జంపాల ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ గ్రంథాలయాన్ని నిర్వహించడాన్ని అభినందించారు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల యువకుల అవసరాలకు అనుగుణంగా గ్రంధాలయాన్ని అభివృద్ధి పరచాలని అందుకు తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని తెలియజేశారు. లిడాక్టర్ రామ్మోహన్ రావు ,డాక్టర్ జయనీ నెహ్రూలి దంపతులు మాట్లాడుతూ జంపాల ప్రసాద్ గ్రంథాలయం అనేక సంవత్సరాలుగా నిజాంబాద్ వాసులకు విజ్ఞానాన్ని అందిస్తుందని గ్రంథాలయం, ట్రస్టు సేవలను కొనియాడారు తాము భవిష్యత్తులో కూడా ట్రస్ట్ కి అండదండలందిస్తామని ఈ సందర్భంగా తెలిపినారు. ఈ కార్యక్రమంలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు పరుచూరి శ్రీధర్, మీనా సహాని , ఇంజనీర్ రవికుమార్ ప్రజా సంఘాల నాయకులు అరుణ రేఖ, వేల్పూర్ భూమన్న, వనమాల సత్యం,జి.రమేష్, శివ కుమార్, జన్నారపు రాజేశ్వర్,జి.సంజన, పవన్,భవాని, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలలకు కాంగ్రెస్ ప్రభుత్వ అండ

**ఫకీర్ టేక్య తండాలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్**



**ఘట్కేసర్, మే 13 (జనం సాక్షి):** మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని ఎంఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్, ఎదులాబాద్ 7వ డివిజన్ ఘనపురం గ్రామంలోని ఫకీర్ టేక్య తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వద్యా జ్యోతి, నానావత్ బుజ్జి కుటుంబాలకు చెందిన నూతన గృహాలను మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలలను నిజం చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాసాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి గృహప్రవేశం ఒక పండుగ వాతావరణాన్ని తీసుకొస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని విమర్శించిన ఆయన, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్య స్థాపన దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఇంటి నిర్మాణంలో దశలవారీగా నిధులు విడుదల చేస్తూ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ఘనపురం గ్రామ మాజీ సర్పంచులు నానావత్ రూప్ సింగ్ నాయక్, వేముల మమత గౌడ్, బద్దం గోపాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వేముల సత్తయ్య గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుర్జకుంట నర్సింహా, నానావత్ శివాజీ నాయక్, మాజీ వార్డు సభ్యులు బింగి సురేష్ గౌడ్, వద్యా జైహిందర్ నాయక్, వద్యా చాంది, నానావత్ సురేష్ నాయక్, రామావత్ రాణి, నాయకులు కొంశెట్టి శ్రవణ్, వద్యా సురేష్ నాయక్, వద్యా దేవ్ సింగ్ నాయక్, మూడవత్ చందర్, నానావత్ రాజ్‌కుమార్, రామావత్ మల్లికార్జున్‌తో పాటు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విబిజిరామ్ జి 2025 రద్దు చేయాలి

- రెండు సార్లు ఫోటో క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలి
- ఎన్‌టిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య
- మే 15న నర్సాపూర్ ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా



**నర్సాపూర్ మే 13 (జనం సాక్షి) :**
తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, పెద్ద చింతకుంట, చిన్న చింతకుంట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పని ప్రదేశాలను సందర్శించి కూలీలతో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎన్‌టిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేయడనికి కుట్రలు చేస్తుందని అన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజులు పని కల్పించాల్సి ఉన్నప్పటికీ ఎక్కడ కూడా 100 రోజులు పని కల్పించడం లేదని అన్నారు విబిజి రామ్ జి పేరుతో ఉపాధి కూలీల హక్కులను కలరస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు 60:40 శాతం నిధులు ఖర్చు చేయాలని నిర్ణయం చేయడం అంటే రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారం పెరుగుతుందని అన్నారు.125 రోజులకు పని దినాలు పెంచుతున్నామని చెప్తున్నా ప్రభుత్వం 60 రోజులు పని చేయకుండా నిషేధన్ని విధించడం జరిగిందని అన్నారు. రెండు సార్లు ఫోటో క్యాప్చర్ విధానాన్నిరద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద చింతకుంట,చిన్న చింతకుంట, రెడ్డి పల్లి గ్రామాల్లో పని ప్రదేశాల్లో టెంట్, వాటర్, మెడికల్ కిట్ సౌకర్యం లేదని అన్నారు, పని చేసినప్పటికి వేతనాలు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. రోజు కూలీ 303 రూపాయలు రావాల్సి ఉన్నప్పటికీ ఎక్కడ కూడా 303 రావడం లేదని అన్నారు. ఎండలో పని చేస్తున్న కూలీలకు చేతులకు బొబ్బలు వస్తున్నాయని అన్నారు.పెద్ద చింతకుంట,చిన్న చింతకుంట, రెడ్డిపల్లి గ్రామాల్లో కొద్దీ మంది కూలీలకు గత సంవత్సరం పని చేసిన వారికి వేతనాలు రాలేవాని అన్నారు.ప్రతి వారం కూలీలకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న కఠినమైన విధానాల వలన పనికి హాజరయ్యే కూలీల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతు oదని అన్నారు. పని ప్రదేశాలను అధికారులు సందర్శించడం లేదని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయించడంలో కీలకంగా ఉన్న మెట్లకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు జారీ చేసి పని కల్పించాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డు కలిగిన వారికి పని కల్పించకుంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలని చట్టంలో ఉంటే ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు.గడ్డపార, గంపలు, పారలు ఉచితంగా పంపిణి చేయాల్సి ఉన్న ఎక్కడ కూడా పంపిణి చేయడం లేదని అన్నారు.దూర ప్రాంతం వెళ్లి పని చేస్తే రవాణా చార్జీలు చెల్లించాలని చట్టంలో ఉందని అన్నారు.పాత పద్ధతిలోనే నరేగా ను కొనసాగించాలని డిమాండ్ చేశారు.లిఉపాధి హామీ పథకంలో వస్తున్న సమస్యలు పరిష్కారం చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, రెండు సార్లు ఫోటో క్యాప్చర్వి ధానాన్ని రద్దు చేయాలని, పని ప్రదేశంలో టెంట్, వాటర్, ఓఆర్ఎస్ ప్యాకె ట్స్ పంపిణి చేయాలని డిమాండ్ చేస్తూ మే 15న నర్సాపూర్ ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు ఈ సమావేశాల్లో చిన్న చింతకుంట, పెద్ద చింతకుంట, రెడ్డిపల్లి గ్రామాల ఉపాది కూలీలు శివయ్య, అమృత, కిష్టమ్మా,బాలయ్య, పోచయ్య,రాజు, నగేష్, శేషాద్రి పాల్గొన్నారు

# నేడు తొలి దశ జనగణన కార్యక్రమం ప్రారంభం

**దుండిగల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకట మనికిరణ్.**

**నిజాంపేట్ మే 13 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలో నేడు జనగణన 2027 తొలి దశ ఘనంగా కార్యక్రమం ప్రారంభం కానున్నదని దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కిరణ్ తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనగణన-2027 తొలి దశ గణన కార్యక్రమం నేటి నుంచి జూన్ 9 వరకు ఇంటింటి సర్వే రూపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా ప్రతి ఇంటి ప్రాథమిక వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్య, నివాస పరిస్థితులు ఇతర అవసరమైన సమాచారం సేకరించబడుతుందని వెల్లడించారు.
జనగణన ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఇంటింటికి వచ్చే గణన సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. సరైన ఖచ్చితమైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వానికి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో ఉపయోగపడుతుందని వివరించారు.

# పోక్సో బాధితులకు వేగవంతమైన సహాయం అందించాలి


**భరోసా సెంటర్‌ను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 13 (జనం సాక్షి):**
లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలలకు భరోసా సెంటర్ ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను ఆయన సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించిన అదనపు ఎస్పీ.. పోక్సో కేసులు, లైంగిక వేధింపుల బాధితుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్, న్యాయ సహాయం, అవగాహన కార్యక్రమాల అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. లైంగిక దాడులు, వేధింపులకు గురైన మహిళలు, బాలల పట్ల సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. బాధితుల్లో భయాందోళనలు తొలగించి ధైర్యం కల్పించాలని, ప్రతి కేసులో సకాలంలో న్యాయ, వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే బాధితులకు మానసిక బలం చేకూర్చే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. పోక్సో చట్టాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.
ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. వేధింపులు, అత్యాచారాలు, నిరాదరణకు గురైన మహిళలు, పిల్లలకు ఒకే చోట న్యాయపరమైన, వైద్యపరమైన సేవలు, సామాజిక భద్రత, మానసిక ధైర్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో భరోసా సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధితులకు అవసరమైన అన్ని సేవలను సమన్వయంతో అందిస్తున్నామని చెప్పారు. లైంగిక వేధింపులకు గురైన వారు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. మహిళలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు కఠినంగా అమలులో ఉన్నాయని, లైంగిక వేధింపులు లేదా దాడులకు పాల్పడిన వారికి కఠినమైన జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ శ్వేతతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కాలుష్యంతో కమ్ముకపోతున్న కల్లకాల్

- ప్రధాన రహదారిపై కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలు
- కాలుష్యంపై నజర్ వెయ్యని పిసిబి
- వాయు కాలుష్య నియంత్రణ 1981 చట్టానికి తూట్లు



**మనోహరాబాద్ మే13 (జనంసాక్షి) :**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధిలోని కల్లకాల్ గ్రామంలో పరిశ్రమలు ఉండటం వలన కాలుష్యంతో కమ్ముకపోతున్న గ్రామం ప్రధాన రహదారిపై కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలు వీటి నియంత్రణకు కంపెనీ యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. పారిశ్రామిక వాడల్లో కాలుష్యానికి గురి అయిన పట్టించుకోని క్షేత్రస్థాయిలో పరిశీలన చేయలేని దీనాస్థితిలో ఉన్న పిసిబి యంత్రాంగం పిసిబి యంత్రాంగం కూడా ప్రత్యేకంగా పరిశ్రమలపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం తప్పకుండా ఉంది వాయు కాలుష్యంతో గ్రామస్తుల ఆరోగ్యానికి ముప్పు వాయు కాలుష్యం వాతావరణంలోని అన్ని కారకాలపై అన్నింటిని ప్రభావితం చేస్తుంది ఇది మన ఆరోగ్యానికి హానికరం మరియు దృశ్యం మానతను తగ్గిస్తుంది అదేవిధంగా సూర్య రశ్మిని అడ్డుకోవడం ఆమ్ల వర్షాలకు కారణమవడం వ్యవసాయానికి హాని కలిగించడం అడవులు వన్య ప్రాణులు దెబ్బతినే అవకాశం ఉంటుంది గ్రీన్ హౌస్ వాయు కాలుష్యం మొత్తం పర్యావరణాన్ని క్షీణతకు దారితీస్తుంది
వాయు కాలుష్య నియంత్రణ 1981 చట్టానికి తూట్లు వాయు కాలుష్య నివారణ నియంత్రణ చట్టం పరిశ్రమల నుండి వచ్చే కాలుష్య కారక పొగ గాలిని నియంత్రించకుండా ఈ చట్టానికి పరిశ్రమలు తూట్లు పొడుస్తున్నాయి పరిశ్రమలు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి వాయు కాలుష్యం హాని కలిగించే కారకం వాయు కాలుష్యం పరిశ్రమలు అధికంగా పొగను వెదజల్లటం వలన గాలి నాణ్యత క్షీణించడం వలన శ్వాస కోస వ్యాధి బారిన పడే అవకాశం ఉంటుంది అస్తమ బహిరంగ వాయు కాలుష్యల ద్వారా ముప్పు వాటిల్లే అవకాశం ఉంటుంది
భవిష్యత్ తరానికి భారం కానున్న కాలుష్య కారకాలు
పట్టణీకరణ వలన రోజురోజుకు పర్యావరణం కలుషితం అవడంతో సహజ సంపద పూర్తిగా కలుషితమవుతుంది దీని నివారణకు ప్రత్యేకంగా ముందస్తు జాగ్రత్తలు నివారణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉంది పారిశ్రామిక ప్రాంతాలకు ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి అభివృద్ధి చెందిన పారిశ్రామికవాడలో పరిశ్రమల క్షేత్రస్థాయి పర్యవేక్షణకు తప్పకుండా ముందస్తుగా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా కాలుష్యాన్ని మరియు అక్రమనకు గురి కాకుండా కంపెనీల చట్టం ప్రకారం విధులు నిర్వహించడం జరుగుతుంది
అనుమతులకే పరిమితమవుతున్న పరిశ్రమలు
పర్యావరణ పరిరక్షణ వాయు కాలుష్య నియంత్రణకు పరిశ్రమలు అనుమతులు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిశ్రమల యజమాన్యం కాలుష్య నియంత్రణకు అడ్డుకట్ట వెయ్యలేక పోయాయి
పర్యావరణ పరిరక్షణ చట్టానికి పంగనామాలు
పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునే అధికారం పిసిబికి ఉంది కనుక పిసిబి ప్రత్యేక ముందస్తు చర్యలు తీసుకోవాలి

# మార్వాడి షాపులకు అనుమతులు ఇవ్వవద్దు

### వినతిపత్రం అందజేసిన లోకల్ వ్యాపారులు



**శివ్వంపేట మే 13 (జనంసాక్షి) :** తమ కుటుంబాలను పోషించుకోవడం కోసం చిరు వ్యాపారాలను నడుపుతూ ఉపాధి పొందుతున్నామని, మార్వాడి షాపుల ఏర్పాటు వల్ల తమ దుకాణాలే మూతపడతాయని, శివ్వంపేటలో మార్వాడి షాపుల నిర్వహణ కోసం ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు శివ్వంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొద్దిపాటి గిరాకీలతో కాలమేల్లదీస్తున్నామని, భారీ స్థాయిలో మార్వాడి షాపులు ఏర్పాటు అయితే తమ బ్రతుకులు ఆగమవుతాయని వినతిలో వారు పేర్కొన్నారు. పొద్దంతా పని చేసిన సరైన వ్యాపారం ముందుకు సాగడం లేదని దీంతో పెట్టుబడికి తెచ్చిన ఫైనాన్స్ లు, చిట్టి డబ్బులకే సరిపోతోందని, తమ ఉపాధిని దెబ్బ తీసే ఎలాంటి మార్వాడి షాపుకైనా సరే అనుమతులు ఇవ్వొద్దని స్థానిక వ్యాపారాలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట వ్యాపారులు బాసంపల్లి యాదగిరి గౌడ్, భీమనపల్లి మురళీ,ఇసుగారి నర్సిములు, కొత్తపేట శ్రీనివాస్ గౌడ్, బాలునాయక్, నల్లవల్లి రమేష్ ఉన్నారు.

# నిర్వాసిత రైతులకు మార్కెట్ ధర కంటే మూడింతల పరిహారం

### సింగోటం - గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులు వేగవంతం చేయాలి : రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల, మే 14 (జనంసాక్షి)**

వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామంలోని రైతు వేదికలో భూబాధిత రైతులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ సింగోటం – గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. భూ సేకరణకు రైతులు సహకరించాలని కోరుతూ, భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర కంటే మూడింతల పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామంలో సంగినేనిపల్లి, తూముకుంట, బొల్లారం గ్రామాలకు చెందిన భూబాధిత రైతులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమై అభ్యంతరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.11.50 లక్షల పరిహారం ప్రస్తుతం ప్రభుత్వ మార్కెట్ విలువ రూ.1,87,500 చాలా తక్కువగా ఉందని రైతులు అభ్యంతరం వ్యక్తం చేయగా, మంత్రి సానుకూలంగా స్పందించారు.బేసిక్ మార్కెట్ విలువను రెండింతలు పెంచి రూ.3,75,000గా ఖరారు చేయాలని అధికారులను ఆదేశించార. పెంచిన విలువ ఆధారంగా భూసేకరణ చట్టం ప్రకారం మూడింతల పరిహారంతో పాటు గెజిట్ తేదీ నుంచి వడ్డీ కలిపి ఎకరాకు మొత్తం రూ.11,50,000 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మంత్రి నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.తక్షణమే అవార్డు



కాపీలు జారీ చేసి పరిహార పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యంను మంత్రి ఆదేశించారు.అసైన్డ్, పట్టా లేని రైతులకు కూడా పరిహారం,అసైన్డ్ పట్టాలు కలిగిన రైతులకు కూడా సాధారణ పట్టాదారులతో సమానంగా పరిహారం ఇవ్వాలని గ్రామస్థులు కోరగా,మంత్రి అందుకు అంగీకరించారు.ఎలాంటి పట్టాలు లేకుండా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు భూసేకరణ చట్టంలోని '3ఆర్' నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం అందించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.40 వేల ఎకరాలకు సాగునీరు లక్ష్యం కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో జూరాల ప్రాజెక్టు పరిధిలో 25 వేల ఎకరాలు, భీమా ప్రాజెక్టు కింద 15 వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని మంత్రి వివరించారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 2018లో సింగోటం – గోపాలదిన్నె లింక్ కెనాల్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేయించినట్లు తెలిపారు.భూసేకరణ వివరాలు నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి లో 50 ఎకరాలు,వీపనగండ్ల మండలం బొల్లారం -- 73 ఎకరాల 13 గుంటలు,వల్లభాపూర్ 87 ఎకరాల 3 గుంటలు సంగినేనిపల్లి లో 94 ఎకరాల 8 గుంటలు సేకరించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా భూసేకరణ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఆయా శాఖల అధికారులు,బొల్లారం, తూముకుంట సర్పంచులు సుదర్శన్ రెడ్డి,రామన్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, చిన్నారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నిమిషం ఆలస్యం.. వెనుదిరిగిన 8 మంది

**జోగులాంబ గద్వాల జిల్లా, మే 13 (జనంసాక్షి)**



టీఎస్ పాలిసెట్ 2026 పరీక్ష మే 13, 2026న ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించబడుతున్న నేపథ్యంలో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ తెలంగాణలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల ప్రవేశానికి ఈ పరీక్షను నిర్వహిస్తుంది. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ పాలిసెట్ పరీక్షకు 8 మంది విద్యార్థులు ఆలస్యం అవ్వడంతో ఎనిమిది మంది వెనుతిరిగారు. ఒక నిమిషం ఆలస్యం అనే అంశాన్ని గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు హోరెత్తిస్తున్నాయి. జిల్లా కేంద్రం మొత్తం 40 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నది, 11 గంటలకి ఎగ్జామ్ కాగా 10 గంటలకు పరీక్ష కేంద్రంలోకి రావలెను అని సూచించబడ్డ విద్యార్థులు రవాణా సౌకర్యం లేదని బస్సులు రాలేదని ట్రైన్ లేట్ అయిందని ఇలా ఎనిమిది మంది విద్యార్థులు పలు కారణాలు జనం సాక్షితో మాట్లాడిన సందర్భంలో ఎగ్జామ్ హాలులోకి అప్పటికి నాలుగు నిమిషాలు లేట్ అయినందువల్ల ఆ విద్యార్థులను ఎగ్జామ్ కు అనుమతించబడలేదు. విద్యార్థులు అలాగే గేటు దగ్గర తమ బాధను అధికారులకు చెప్పుకున్న లాభం లేకపోయింది. ఇకనైనా విద్యార్థులు ఒక నిమిషం ఆలస్యాన్ని గుర్తించుకొని ఎగ్జామ్స్ కు అటెండ్ కావాలని అధికారులు అన్నారు.

# లారీలు లేక రైతుల అవస్థలు.. నేడు ధాన్యం కొనాలంటూ ధర్నా

**తూప్రాన్ మే 13 (జనం సాక్షి):** మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని పలు ఐకెపి సెంటర్ లలో ఉన్న రైతులందరినీ వేధిస్తున్న ఐకెపి సెంటర్లు. తూప్రాన్ మండలం వట్టూర్ లో ఐకిపి సెంటర్ ప్రారంభమై 20 రోజులు గడుస్తున్న ఏ ఒక్కరి వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదు ఒక్క లారీ అయినా రావడం లేదు, ప్రభుత్వం ఇచ్చే బస్తాలు లేవు అని గ్రామస్తులు వారి బాధను వెల్లడించారు. కొబ్బరికాయలు కొట్టి పూజ చేసి ఐకెపి సెంటర్లు ప్రారంభించారు, కానీ నేటికీ 20 రోజులు గడుస్తున్న వడ్లు కొనుగోలు చేయడం లేదు, రైతులు అధికారులను వడ్లు కాంట పెట్టమని అడిగితే



మా చేతిలో ఏమీ లేదు పైఅధికారులు ఏ విధంగా చెబితే ఆ విధంగానే చేస్తామని తలతిక్క బదులు ఇస్తున్నారు. ఇది ఇంతే ఎవరికీ చెప్పుకుంటారో చెప్పుకోండి! అని సమాధానం ఇస్తున్న ఐకెపి సెంటర్ అధికారులు. పరిస్థితులు గమనిస్తే అకాల వర్షాలు కురిసి ధాన్యం కొట్టుకు పోతుందని భయాందోళన లో రైతులు బిక్కు బిక్కుమంటున్నారు. ఆరుగాలం కష్టపడి చేతికి వచ్చిన పంటను వర్షార్పణం చేసు కునేందుకు ఏ రైతు సిద్ధంగా లేమన్నారు. ఆర్డిఓ మరియు ఎమ్మార్వో కార్యాలయాల ముందు రైతులందరూ ఏకమై ధర్నాకు దిగాలని రైతులకు జరుగుతున్న అన్యాయం పై అధికారులను నిలదీయాలని పిలుపునిచ్చారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీనీ వెంటనే మూసివేయాలి

### అఖిలపక్ష పార్టీల డిమాండ్



**బెజ్జంకి, మే 13 (జనం సాక్షి) :** మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల పెరుగుతున్న వాయు,నీటి,శబ్ద కాలుష్యాలకు నిరసనగా బుధవారం రైతు యుద్ధం-ప్రజా ఆరోగ్యం పేరుతో అఖిలపక్షం ప్రజా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, సిపిఎం, సిపిఐ, డిఎస్పి, ఎంఆర్పిఎస్ తో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న తీవ్రమైన దుర్వాసనతో ప్రజలు ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది అనీ అన్నారు. విష వాయువుల కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల పర్యావరణం దెబ్బతింటోందని, వ్యవసాయ భూములు పాడవుతున్నాయని ఆరోపించారు. అధిక మొత్తంలో నీటిని వినియోగించే ఈ ఫ్యాక్టరీ కారణంగా రానున్న రోజుల్లో భూగర్భ జలాలు భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉందని, దీంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల్లో బోర్లు ఎండిపోతున్నాయని, ప్రజలకు తాగునీటి సమస్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. తీవ్ర శబ్ద కాలుష్యంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం లేకుండా పోయిందని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఇలాంటి ఫ్యాక్టరీలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టకపోతే ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు కలిసి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించి, ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల భవిష్యత్తు, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లింగాల సురేష్(డీస్పీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్), వంగల నరేష్,తిప్పారపు శ్రీనివాస్, సంగెం మధు, తిప్పారపు మహేష్, దొంతరవేణి శ్రీనివాస్,లోనే నర్సింగ్, లింగల వెంకటేష్, పొట్లపెల్లి శివ, రాధారం హరీష్, మహంకాళి సురేష్, సంఘ ఎల్లయ్య, బొమ్మిడి సాయికృష్ణ, బోనగిరి లింగం, దొంతర వేణి మహేష్, పర్శరాములు, మధు, శ్రీనివాస్, లింగయ్య, విజయ్, శంకర్, చంద్రం, ఇథనాల్ ఫ్యాక్టరీ చుట్టూ ఉన్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# మొక్కజొన్నను ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలి

### అదనపు కలెక్టర్ హరిప్రియ

### జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డులో కొనుగోలు పరిశీలన

**జడ్చర్ల, మే 13 (జనంసాక్షి):** రైతులు పండించిన మొక్కజొన్నను ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె జడ్చర్ల పట్టణంలోని పత్తి మార్కెట్ యార్డును సందర్శించి, అక్కడ జరుగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు వస్తున్న మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేయడమే కాకుండా, కొన్న వెంటనే నిల్వలను తరలించేలా (లిఫ్టింగ్) పక్కా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ పంటను అమ్ముకోవడంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి గింజను సేకరిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం కొనుగోలు కేంద్రాల వద్ద రికార్డులను, నిల్వలను తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారిణి బాలమణి, తహశీల్దార్ నర్సింగ రావు పాల్గొన్నారు.

# రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు

### ఎమ్మెల్యే ప్రభాకర్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



**సదాశివపేట మే 13(జనం సాక్షి) :** సదాశివపేట పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. బుధవారం సదాశివపేట పట్టణంలోని 6,7,8 వార్డులలో టియుఎఫ్ఐడిసి నిధుల ద్వారా రూ.13 కోట్ల అంచనా వ్యాయంతో బీటీ రోడ్డు, డ్రైనేజ్ వ్యవస్థ, ఇండోర్ స్టేడియం, రోడ్డు విస్తరణ పనులకు టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ నిధులతో పట్టణంలోని ప్రధాన రహదారుల సమస్యలు తొలగిపోతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని సదాశివపేట పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని అన్నారు. గతంలో మంజూరైన పనులను కొంత మార్పులతో అమలు చేస్తున్నారని తెలిపారు. పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ శివాజీ,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజ్ గౌడ్,మున్సిపల్ కౌన్సిలర్‌లు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లు, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు,మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం తగదు

- నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి
- రిజిస్టర్లు, ట్యాబ్ ఎంట్రీలు సక్రమంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాలు

**గద్వాల నడిగడ్డ, మే 13 (జనంసాక్షి)**



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం తగదని,రిజిస్టర్లు,ట్యాబ్ ఎంట్రీలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం ధరూర్ మండలం మార్లబీడు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, ప్యాడీ లోడ్లు వెళ్లినా ఎంట్రీలు నమోదు చేయకపోవడం, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వంటి అంశాలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో రైతుల వివరాలు, వాహనాల సమాచారం, ధాన్యం రాకపోకల వివరాలు పూర్తి స్థాయిలో నమోదు చేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్ నిర్లక్ష్యంగా నిర్వహించడం తీవ్ర తప్పిదమని పేర్కొన్నారు.కేంద్రంలో ప్యాడీ క్లీనర్ లేకపోవడంపై కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్యాడీ శుభ్రపరచకుండా మిల్లులకు పంపితే రైతులకు నష్టం జరుగుతుందని, మిల్లర్లు కూడా అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. శుభ్రపరిచిన ధాన్యమే మిల్లులకు పంపించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారుల పనితీరుపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈఓలు కేవలం తేమ శాతం పరిశీలించి వెళ్లిపోవడం సరికాదని, సెంటర్‌లోకి వచ్చే మరియు బయటకు వెళ్లే ధాన్యాన్ని పర్యవేక్షించడం, రిజిస్టర్లు పరిశీలించడం వారి బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో వ్యవసాయ శాఖ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పర్యవేక్షణ లోపాలు కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్యాబ్ ఎంట్రీలు చేయకుండా ధాన్యం తరలించడం వల్ల రైతులకు చెల్లింపుల్లో సమస్యలు వస్తాయన్నారు. ప్రతి లోడ్‌కు వెంటనే ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్రంలో మహిళా సంఘ సభ్యులతో మాట్లాడిన కలెక్టర్ కొనుగోలు ప్రక్రియ, కేంద్ర నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలోని కొందరు రైతులు అధిక ధరల కోసం ప్రైవేటుగా ఇతర ప్రాంతాలకు ధాన్యం తరలిస్తున్న విషయాన్ని కూడా సమీక్షించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సమర్థంగా పనిచేస్తే రైతులు బయటకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. కొనుగోలు కేంద్రాలు పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ విమల, డీఏవో వీరప్ప, తహసిల్దార్ నందిని, ఏఈఓ రోహిత్, తదితరులున్నారు.

# మితిమీరుతున్న మట్టి మాఫియా

**జోగులాంబ గద్వాల జిల్లా మే 13 (జనంసాక్షి)**



తెలంగాణాలో మట్టి మాఫియా ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, మరియు కొండలను తవ్వుతూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అధికారుల అండదండలతో, కొన్ని చోట్ల పోలీసుల కళ్లెదుటే పెద్ద సంఖ్యలో వాహనాల్లో మట్టి తరలిపోతోంది.మట్టి మాఫియా-ప్రస్తుతము నదులు కొండలు, గుట్టల విధ్వంసం,పర్యావరణాన్ని దెబ్బతీస్తూ ఎకరాల కొద్దీ భూమిని, చిన్న కొండలను తవ్వి చదును చేస్తున్నారు.చెరువులు, కుంటల నుండి అక్రమంగా మట్టిని తవ్వడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది.అధికారుల నిర్లక్ష్యం వల్ల మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోకపోవడం, కొన్నిచోట్ల వారి అండదండలతోనే ఈ దందా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. గద్వాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా, అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి.ఈ విధ్వంసం వల్ల భూములు బీళ్లుగా మారుతున్నాయి మరియు పర్యావరణం దెబ్బతింటోంది.

గద్వాల మండలం కృష్ణా నది పరివాహక ప్రాంతంలో మట్టి మాఫియా యథేచ్ఛగా ఎలాంటి పర్మిషన్లు లేకుండా కృష్ణా నదిలో భారీ వాహనాలలో జెసిబి లతో భారీ వాహనాలను నింపి పట్టపగలే జిల్లా కేంద్రంలో జిల్లా అధికారుల ఎదుట ఈ మాఫియా మట్టిని తరలిస్తూ ఉంటే అడిగే నాధుడే కరవైపోయాడు అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏ అనామకుడో తన ఇంటి ముందు తన ఇల్లు నిర్మాణ సమయంలో బరంతునింపడానికి తీసుకువెళుతున్నారు అంటే అవసర నిమిత్తం అని అనుకోవచ్చు కానీ ఇక్కడ భారీ వాహనాలతో పెద్ద పెద్ద అపార్ట్మెంట్లు నిర్మాణంలో ఇసక మట్టిని తరలిస్తున్న వారు ఏ రకమైన మనస్తత్వం కలిగిన వారు అలాంటి వారిని అధికారులు ఎందుకు పట్టుకుని వదిలేస్తున్నారని,నదులు వాగులు , వంకలు కొండలు గుట్టలు కరిగిపోతా ఉంటే వాటిని తోడైస్తా ఉంటే భావితరాలకు వాటిలో నీరు నిలువ ఉంటుందని జ్ఞానం ఉన్న ఎవడికైనా అర్థమవుతుందని విద్యావంతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున మాఫియా చేస్తున్నటువంటి వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారు.కేవలం వారి వారి పబ్బాలు గడుపుకోవడానికి, ఇదే సరసన భూమి లో నీరు ఇంకి పోయి ఆ ప్రాంతంలో నీరు దొరకక ఆ ప్రాంతం కరువు పీడిత ప్రాంతంగా మారిపోదా ఈ విషయం ప్రభుత్వంలోని భాగస్వామ్యులైన అధికారులు అనధికారులు ప్రజాప్రతినిధులకు ఎందుకు బోధ పడటము లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి భవిష్యత్తు తరాల గొంతు తడిపేందుకైనా మాఫియాకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉన్నదని ఈ ప్రాంత ప్రజల తాగునీరు సాగునీరు ఎద్దడి ఏర్పడక ముందే ఈ ప్రాంతం పర్యావరణం దెబ్బతినకముందే మట్టి మాఫియాను తొక్కి తాటతీయాలని అధికారులను ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు.



# నల్గొండలో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం అద్భుతమైన ఫలితాలు

**నల్లగొండ ప్రతినిధి, మే 13 (జనంసాక్షి) :** నేడు ప్రకటించిన సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం నల్లగొండ 100 శాతం ఉత్తీర్ణత సాధించి మరోసారి తన ప్రతిభను చాటుకుంది. విద్యాలయానికి చెందిన విద్యార్థిని చింతపల్లి విజయ 500 మార్కులకు గాను 450 మార్కులు సాధించి 90 శాతం ఫలితాన్ని నమోదు చేసినట్లు ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసులు తెలిపారు.ఇటీవల ప్రకటించిన 10వ తరగతి ఫలితాల్లో కూడా విద్యాలయం 100 శాతం ఫలితాలను సాధించిందని, వరుసగా గత తొమ్మిది సంవత్సరాలుగా 10వ మరియు 12వ తరగతుల్లో శాతం ఫలితాలను కొనసాగిస్తూ వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయాలకు కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాలయ నిర్వహణ కమిటీ సభ్యులకు ప్రిన్సిపాల్ అభినందనలు తెలియజేశారు.

# వేగంగా రబీ ధాన్యం కొనుగోళ్లు

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, మే13 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లాలో రబీ 2025-26 సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. జిల్లాలో మొత్తం 1,93,809 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు రైతుల నుండి 22,456 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో 20,006 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటివరకు 1,450 మంది రైతులకు రూ.19.90 కోట్ల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ధాన్యం కొనుగోలు, లోడింగ్, రవాణా ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని, రైతులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

# న్యూరో, ఫిట్స్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- సకాలంలో గుర్తిస్తే మెరుగైన చికిత్స సాధ్యం
- యశోద హాస్పిటల్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సాయి సతీష్




**మంచిర్యాల ప్రతినిధి , మే 13 (జనంసాక్షి) :** న్యూరో సంబంధిత వ్యాధులు, ఫిట్స్ సమస్యల పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సాయి సతీష్ కె సూచించారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని నార్త్ ఇన్ హోటల్ లో సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ మేనేజర్ అంకం మల్లేష్ నిర్వహణలో న్యూరో, ఫిట్స్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం జీవనశైలి మార్పులు, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, ఆహారపు అలవాట్ల కారణంగా న్యూరో సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. తలనొప్పి, మతిమరుపు, చేతులు-కాళ్లలో బలహీనత, తల తిరగడం, అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఫిట్స్ సమస్య వచ్చినప్పుడు భయపడకుండా వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదిస్తే థ్రాంబో లైసిస్ ప్రక్రియను స్ట్రోక్ సంభవించిన 4.5 గంటలలోపు తప్పనిసరిగా నిర్వహించాలని ఆధునిక వైద్య విధానాలతో మెరుగైన చికిత్స అందుబాటులో ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఫిట్స్‌ను మూఢనమ్మకాలతో అనుసంధానం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు. వైద్య పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే సాధారణ జీవితం గడపవచ్చన్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా న్యూరో సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స ఎలా చేయాలి, ఫిట్స్ వచ్చిన వ్యక్తిని ఎలా సంరక్షించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి వంటి అంశాలపై వైద్యులు వివరించారు. ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను ముందుగానే గుర్తించవచ్చన్నారు.

## స్వచ్ఛభారత్ అర్బన్ 2.0లో భాగంగా
# తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 13(జనంసాక్షి) :** స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0 లో భాగంగా జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో తడి చెత్త, పొడి చెత్తను క్రమం తప్పకుండా సేకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో న్యూఢిల్లీ నుండి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ శాఖల అడిషనల్ డైరెక్టర్ డా. అమిత్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో తప్పనిసరిగా ప్రతి రోజు తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలని, ఆ దిశగా పంచాయితీ, మున్సిపాలిటీ అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ లో భాగంగా గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో పారిశుధ్యంపై ఎప్పటికప్పుడు అధికారులు సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. వచ్చే వర్షాకాలం ప్రారంభానికి ముందే మురుగు కాలువలలో ఉన్న చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మి నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, డివిజనల్ పంచాయతీ అధికారులు ఉమర్ హుస్సేన్, హరి కిరణ్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్ తిరుపతి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**కాటారం మే 13 (జనం సాక్షి) :** కాటారం మండలం కొత్తపల్లి, కాటారం వ్యవసాయ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాప్యం లేకుండా దాన్యం కొనుగోలు చేపట్టాలని కొనుగోలు కేంద్రాల వద్ద తార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. రవాణా సమస్య ఉంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. రోజుకు రెండు లారీలు కొనుగోలు కేంద్రాలకు పంపాలని ఆదేశించారు. కచ్చితమైన రిజిస్టర్లు ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. అక్కడి నుండి మలహార్ మండలం కొండంపేట, కొయ్యూరు లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ కొనుగోలు కేంద్రాల్లో దాన్యాన్ని శుభ్రపరచాలని తాలు, రాళ్లు ,మట్టి గుల్లలు లేని నాణ్యమైన ధాన్యాన్ని మిల్లులకు పంపించేందుకు రైతుల సహకరించాలన్నారు. ప్యాడి క్లీనింగ్ పరికరాలు అందుబాటులో లేకపోతే మరొక చోట నుంచి తెప్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంత కుమారి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో వెన్నం శ్రీకాంత్ రెడ్డి కీలక పాత్ర

- మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ప్రశంసలు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం



**మహబూబాబాద్ బ్యూరో,మే 13(జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా వెన్నం శ్రీకాంత్ రెడ్డిని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంలో వెన్నం శ్రీకాంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని మంత్రి సీతక్క ,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి లు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వెన్నం శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తోందని తెలిపారు. వెన్నం శ్రీకాంత్ రెడ్డి పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయి నుంచి పనిచేస్తూ కార్యకర్తలను సమన్వయం చేశారని, ఎన్నికల సమయంలో పార్టీ విజయానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజలకు విద్యా, విజ్ఞాన సేవలు అందించే గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధికి శ్రీకాంత్ రెడ్డి కృషి చేస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి, యువతలో పఠనాసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తానని అన్నారు. అలాగే జిల్లా పరిధిలో ఉన్న అన్ని శాఖ గ్రంథాలయాలను, గ్రామ గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, , ఎమ్మెల్యే మురళీ నాయక్,, డిసిసి అధ్యక్షులు ఉమా మురళీ నాయక్ , ,రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కార్య దర్శి ఝాన్సీ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,మాజీ డిసిసి అధ్యక్షుడు భరత్ బాబు, సీపీఐ. జిల్లా కార్యదర్శి విజయ్ సారధి, అజయ్ సారధి , సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యులు రాధా, మున్సిపల్ చైర్మన్ జ్యోతి ,మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ ,వైస్ చైర్మన్ మదన్ లోయ ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రాం రెడ్డి, జిల్లా గ్రంథాలయ అధికారి శ్రీలత ,యూత్ అధ్యక్షుడు సురేష్,బాలు చౌహన్ ,వార్డు కౌన్సిలర్ అరుణ, వివిధ వార్డు కౌన్సిలర్ లు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నీట్ యూజీ 2026 స్కాం బీజేపీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వం
- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 13(జనంసాక్షి ):** నీట్ యూజీ 2026 పరీక్షలో వెలుగులోకి వస్తున్న పేపర్ లీక్, అవినీతి ఆరోపణలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తున్నాయని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తీవ్రంగా విమర్శించారు. ఒక దేశం ఒక పరీక్ష అంటూ గొప్పలు చెప్పుకున్న బీజేపీ ప్రభుత్వం, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో పూర్తిగా విఫలమైందని ఆమె అన్నారు. నీట్ పరీక్షల సమయంలో విద్యార్థులపై అత్యంత కఠిన నిబంధనలు అమలు చేస్తూ, చెవిపోగులు నుంచి జుట్టు క్లిప్పుల వరకు తనిఖీలు చేసే అధికారులు, అసలు ప్రశ్నపత్రాలనే కాపాడలేకపోవడం సిగ్గుచేటని సుగుణక్క మండిపడ్డారు. విద్యార్థులపై మాత్రమే అనుమానం చూపించే ఈ ప్రభుత్వం, వ్యవస్థలో ఉన్న అవినీతిపరులపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతోందని ప్రశ్నించారు .ప్రతి సంవత్సరం నీట్ చుట్టూ పేపర్ లీకులు, మార్కుల గందరగోళం, గ్రేస్ మార్కుల వివాదాలు వస్తూనే ఉండటం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అయినా బీజేపీ ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం లేదని, తప్పు చేసిన అధికారులను కాపాడే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. గతంలో రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షలు ఉండేవని, కానీ బీజేపీ ప్రభుత్వం బలవంతంగా తీసుకొచ్చిన నీట్ విధానం వల్ల కోచింగ్ మాఫియాలు మాత్రమే లాభపడుతున్నాయని విమర్శించారు. గ్రామీణ, పేద, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. పరీక్షలు రద్దు చేయడం, మళ్లీ నిర్వహించడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను హక్కుగా కాకుండా వ్యాపారంగా మార్చిన బీజేపీ విధానాల ఫలితమే ఈ పరిస్థితి అని అన్నారు. నీట్ యూజీ 2026 స్కాంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు జరిపించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వైఫల్యంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని సుగుణక్క డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఎంతటి స్థాయిలో ఉన్నా కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు.



## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలి

- కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ బ్యూరో, మే13 (జనంసాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామ, పట్టణ ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. విద్యా వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలను తరచూ సందర్శించి మౌలిక సదుపాయాలు, బోధన ప్రమాణాలు, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించాలని సూచించారు. బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా పురోగతి సాధించడం సంతోషకరమని పేర్కొంటూ, నిర్మల్ జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు.

# జనగణనలో ఇండ్ల గణన పకడ్బందీగా నిర్వహించాలి

- హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హనుమకొండ ప్రతినిధి మే 13 (జనం సాక్షి) :** జనగణన-2027 తొలి దశలో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన, హౌస్ లిస్టింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. హన్మకొండ జిల్లా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ న్యూ శాయంపేట ప్రాంతంలో కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం గణన ప్రక్రియను పారదర్శకంగా, బాధ్యతా యుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలు జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించి సరైన వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల ప్రణాళిక రూపకల్పనలో జనగణన గణాంకాలు కీలకమని తెలిపారు. హౌస్ లిస్టింగ్‌లో ఇంటి నిర్మాణం, కుటుంబ సభ్యుల వివరాలు, ప్రాథమిక వసతులు తదితర అంశాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఎలాంటి అపోహలకు తావులేకుండా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేయాలని తెలిపారు. ఏ ఒక్క కుటుంబం కూడా గణనలో మిగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన పరిధిపై పూర్తి అవగాహనతో పనిచేయాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సమాచారాన్ని సేకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సంతోష్, ఆర్ ఐ కృష్ణ రావు, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి చెక్ పోస్ట్ తనిఖీ

- జిల్లా ఎస్పీ శబరిష్



**మహబూబాబాద్ బ్యూరో,మే 13(జనం సాక్షి):** బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టుల పనితీరును జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ అర్ధరాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. ఇందులో భాగంగా కురవి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అక్రమ పశువుల రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ అరికట్టాలని, చెక్‌పోస్ట్ ద్వారా వెళ్లే ప్రతి వాహనాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని ఎస్పీ ఆదేశించారు. తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా ప్రవర్తించే వ్యక్తులు లేదా పారిపోయే వాహనాల సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు అందించాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎస్పీ పేర్కొన్నారు.

# విద్యుత్ వైర్లు తెగి అగ్ని ప్రమాదం

- ప్రమాదంలో అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంట
- చేతికొచ్చిన రెండెకరాల పంట కాలిపోవడంతో బోరున విలపించిన రైతు నేరెళ్ల సుధాకర్
- పంట ప్రమాదం ఎక్కువ జరగకుండా ప్రజలను అప్రమత్తం చేసిన పోతుగల్లు గ్రామ సర్పంచ్ ఎలిగేటి తిరుపతి
- ఫైర్ స్టేషన్ కు చరవాణి ద్వారా సమాచారం అందించిన పట్టించుకోని ఫైర్ సిబ్బంది..ఆగ్రహించిన ప్రజలు
- సర్పంచ్ తీసుకుంటున్న చర్యలను అభినందిస్తున్న గ్రామస్తులు



**మొగుళ్లపల్లి, మే 13 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పోతుగల్లు గ్రామంలో విద్యుత్ వైర్లు తెగి మొక్కజొన్న పంట చేనులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీంతో గ్రామానికి చెందిన నేరెళ్ల సుధాకర్ కు చెందిన రెండెకరాల మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. చేతికొచ్చిన మొక్కజొన్న పంట అగ్ని ప్రమాదంలో కాలిపోతుండడంతో కళ్లారా చూసిన రైతు బోరున విలపించాడు. ఈ క్రమంలో అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న పంట ఎక్కువగా కాలిపోకుండా గ్రామ సర్పంచ్ ఎలిగేటి తిరుపతి ప్రజలను అప్రమత్తం చేసి..వీచే వడగాలుల వలన మంటలు వ్యాప్తి చెందకుండా ప్రజల సహకారంతో మంటలను ఆర్పి వేసి..పంట నష్ట తీవ్రతను తగ్గించే విధంగా కృషి చేశాడు. వీచే వడగల్లుల వలన పంటలు వ్యాప్తి చెందుతాయనే ఉద్దేశంతో చరవాణి ద్వారా ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చిన..వారు ఏమాత్రం స్పందించకపోవడంతో ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆ మంటలు వ్యాపించి గ్రామం కాలిపోయిన తర్వాత ఫైర్ సిబ్బంది స్పందిస్తారా అంటూ ఆగ్రహించారు. సర్పంచ్ ఎలిగేటి తిరుపతి అప్రమత్తతతో పోతుగల్లు గ్రామంలో పెను ప్రమాదం తప్పిందని, ఆయన గ్రామ ప్రజల కోసం తీసుకుంటున్న చర్యలను ప్రజలు, ఉన్నతాధికారులు అభినందిస్తున్నారు. మొక్కజొన్న పంట కాలిపోయిన రైతును ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ ఎలిగేటి తిరుపతి డిమాండ్ చేశారు.

## యూత్ ట్రైనింగ్ సెంటర్ తనిఖీ



**ఏటూరు నాగారం, మే 13 (జనం సాక్షి) :** ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ఏటూరునాగారంలో స్థానికంగా ఉన్నటువంటి యూత్ ట్రైనింగ్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూత్ ట్రైనింగ్ సెంటర్ ట్రైనింగ్ సెంటర్ లో ఉన్నటువంటి క్లాస్ రూమ్స్ కంప్యూటర్ ల్యాబ్స్ డార్మెంటరీ రూమ్స్ తనిఖీ చేశారు. భోజన వసతుల సౌకర్యాల గురించి నేరుగా శిక్షణ తీసుకున్నటువంటి యువతలతో అడిగి తెలుసుకున్నారు. ఈ అవకాశాన్ని గిరిజన నిరుద్యోగ యువతి, యువకులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి వెంట జేడిఎం, ట్రైనింగ్ ఏజెన్సీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.




# బహుళ మార్గాల్లో ఆదాయాన్ని ఆర్జిద్దాం

### జెన్‌జీ వ్యాపారవేత్తల ధోరణి ఇదీ • లింక్డ్‌ఇన్ నివేదిక

బహుళ మార్గాల్లో ఆదాయాలను ఆర్జించడానికి జెన్‌జీ (యువ) వ్యాపారవేత్తలు మొగ్గుచూపుతున్నారు. సంప్రదాయ ఉద్యోగాలకు భిన్నంగా, ఒకేసారి పలు రకాల పనులు చేస్తూ ఆదాయాన్ని ఆర్జించే 'పోర్ట్‌ఫోలియో కెరీర్'పై యువ పారిశ్రామికవేత్తలూ ఆసక్తి చూపుతున్నారని లింక్డ్‌ఇన్ నివేదిక వెల్లడించింది. 1997 నుంచి 2012 మధ్య జన్మించిన వారిని జెన్‌జీలుగా పరిగణిస్తున్నారు. ప్రతి నలుగురిలో ముగ్గురు (75%) జెన్‌జీ పారిశ్రామికవేత్తలు, ఒకటి కంటే ఎక్కువ ఆదాయ మార్గాలను కలిగి ఉన్నారు. జెన్ ఎక్స్ (1965–1980 మధ్య పుట్టినవారు)లో ఇది 62 శాతంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 8–16 తేదీల్లో, దేశవ్యాప్తంగా 500 మంది చిన్న వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తల నుంచి అభిప్రాయాలు సేకరించి, ఈ నివేదిక రూపొందించినట్లు లింక్డ్ ఇన్ పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం..

**భారత్‌లో స్టార్టప్‌ల జోరు:** మన దేశంలో తమ ప్రొఫైల్‌కు 'ఫౌండర్' (వ్యవస్థాపకుడు) అని జోడించుకునే వారి సంఖ్య ఏటా 104% పెరుగుతోంది. ప్రపంచ దేశాలతో చూస్తే ఇదే అత్యధికం. పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టడానికి ఉన్న ఖర్చు, సంబంధాలు, నైపుణ్యాలు వంటి అడ్డంకులను కృత్రిమ మేధ (ఏఐ) తొలగిస్తోంది. 85% మంది జెన్‌జీ వ్యవస్థాపకులు తమ వ్యాపారానికి ఏఐ, డిజిటల్ టూల్స్ చాలా కీలకమని భావిస్తున్నారు. దేశంలో నేపథ్యంతో సంబంధం లేకుండా ,నేడు పారిశ్రామిక రంగం అందరికీ అందుబాటులో ఉందని 80% మంది వ్యవస్థాపకులు తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు వ్యాపార లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతోందని 81% మంది అభిప్రాయపడ్డారు. స్వేచ్ఛ, ఫ్లెక్సిబిలిటీ (64%), వ్యక్తిగత ఎదుగుదల (56%), ఆర్థిక సంపద (55%) పరంగా విజయాన్ని జెన్‌జీ యువత నిర్వచిస్తున్నారు. ఈ లక్ష్యాలను సాధించడానికి రిస్క్ తీసుకోవడానికి కూడా సిద్ధపడుతున్నారు. 'మనం ప్రస్తుతం 'పోర్ట్‌ఫోలియో శకం'లో ఉన్నాం. నిపుణులు బహుళ ఆదాయ మార్గాలను సృష్టించుకుంటూ కెరీర్ అంటే ఎలా ఉండాలో కొత్తగా నిర్వచిస్తున్నారు. ఏఐ రాకతో గతంలో అసాధ్యం అనుకున్న వ్యాపారాలు కూడా ఇప్పుడు సాధ్యమవుతున్నాయి' అని లింక్డ్‌ఇన్ ఇండియా కంట్రీమేనేజర్ కుమరేష్ పట్టాభిరామన్ పేర్కొన్నారు.



# ప్రభుత్వ రంగ బ్యాంకులు బంగారు గుడ్లు పెడుతున్నాయ్

### 2025-26 లాభం రూ.1.98 లక్షల కోట్లు జీవనకాల గరిష్ఠమిది




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లు వరుసగా నాలుగో ఆర్థిక సంవత్సరాన్నీ లాభాల్లో ముగించాయి. 2025–26లో మొత్తం రూ.1.98 లక్షల కోట్ల నికర లాభాన్ని నమోదు చేశాయి. ఇది జీవన కాల గరిష్ఠమని ఆర్థిక శాఖ తెలిపింది. ఆస్తుల నాణ్యత మెరుగవ్వడం, రుణాల మంజూరులో వృద్ధి, అధిక ఆదాయం లాంటివి పీఎస్‌బీల లాభదాయకతకు తోడ్పడినట్లు వెల్లడించింది. 2025–26 పీఎస్‌బీల నిర్వహణ లాభం రూ.3.21 లక్షల కోట్లకు చేరగా.. 2024–25తో పోలిస్తే నికర లాభం 11.1% పెరిగి రూ.1.98 లక్షల కోట్లుగా నమోదైంది. మొత్తం వ్యాపారం 12.8% వృద్ధితో రూ.283.30 లక్షల కోట్లకు చేరింది.

డిపాజిట్లు 10.6% అధికమై రూ.156.3 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. పీఎస్‌బీలపై డిపాజిట్‌దార్ల విశ్వాసాన్ని ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయని ఆర్థిక శాఖ తెలిపింది. స్థూల రుణాలు 15.7% పెరిగి రూ.127 లక్షల కోట్లకు చేరాయి. ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల వ్యాప్తంగా రుణాలకు గిరాకీ కొనసాగుతోందన్న విషయాన్ని ఇది తెలియజేస్తోంది. 2025–26లో స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 1.93 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.39 శాతానికి తగ్గాయి. 2025–26లో పీఎస్‌బీలకు తాజా మొండి బకాయిలు తగ్గాయి. రైటాఫ్ (రుణాల సాంకేతిక రద్దు) ఖాతాలతో పాటు ఇతర ఖాతాల మొండి బకాయిల వసూలు రూ.86,971 కోట్లుగా నమోదైంది.

# త్వరలోనే సెమాగ్లుటైడ్ మాత్రలు

### డాక్టర్ రెడ్డీస్ వెల్లడి

### మార్చి త్రైమాసిక లాభంలో 86% క్షీణత

### ఒక్కో షేరుపై రూ.8 డివిడెండ్




**హైదరాబాద్:** ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో రూ.220.1 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2024–25 ఇదేకాల లాభం రూ.1,593.9 కోట్లతో పోలిస్తే, ఇది 86% తక్కువ. ఉత్తర అమెరికాలో లెనాలిడోమైడ్ ఔషధ విక్రయాలు తగ్గడం, పలు అసాధారణ ఖర్చులు కారణమని సంస్థ తెలిపింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.8,506 కోట్ల నుంచి 11.6% తగ్గి రూ.7,516.2 కోట్లుగా నమోదైంది. 2025–26 పూర్తి ఆర్థిక సంవత్సరంలో సంస్థ నికర లాభం 24.22% క్షీణించి రూ.4,285 కోట్లకు చేరింది. ఆదాయం 3.2% వృద్ధితో రూ.33,593 కోట్లకు చేరింది. సంస్థ చేతిలో రూ.3,281 కోట్ల నగదు నిల్వలున్నాయి. లాభాలు క్షీణించేందుకు ప్రధానంగా డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది.ప్రాంతాల వారీగా చూస్తే.. అమెరికాలో ఆదాయం రూ.3,558.6 కోట్ల నుంచి 51% క్షీణించి రూ.1,756.2 కోట్లకు పరిమితమైంది.దేశీయంగా ఆదాయం రూ.1,304.7 కోట్ల నుంచి 20% పెరిగి, రూ.1,566 కోట్లకు చేరుకుంది. వర్ధమాన దేశాల నుంచి రూ.1,806 కోట్ల ఆదాయం వచ్చింది. ఐరోపా మార్కెట్ల ఆదాయం రూ.1,275 కోట్ల నుంచి 14% వృద్ధితో రూ.1,452 కోట్లకు చేరింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.8 చొప్పున తుది డివిడెండ్ చెల్లించేందుకు కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. దీనికి రికార్డు తేదీగా జులై 10ని నిర్ణయించింది. మధుమేహ నియంత్రణ, బరువు తగ్గించే ఔషధం సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధం ఒబెడాను, అతి త్వరలోనే మనదేశంలో నోటిమాత్రల రూపంలో విడుదల చేయనున్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఆ తర్వాత ప్రపంచ దేశాలకు ఈ మాత్రలను అందుబాటులోకి తెస్తామని వివరించింది. కెనడాలో ఈ ఔషధానికి అనుమతి పొందిన మొదటి జనరిక్ కంపెనీ తామేనని డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది. బ్రెజిల్‌లోనూ జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్ విడుదల చేసేందుకు, అక్కడి నియంత్రణ సంస్థ అన్విసా అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు సమర్పించినట్లు వివరించింది. స్థిరమైన వ్యాపారంతో'అమెరికాలో జనరిక్ విక్రయాలు తగ్గడం, కొన్ని ఖర్చుల ప్రభావం ఆర్థిక ఫలితాలపై పడింది. మా బ్రాండెడ్ వ్యాపారాల పటిష్టత, అనుకూల కరెన్సీ మార్పుల వల్ల ఈ ప్రతికూలత కొంత తగ్గింది. వ్యయాల నియంత్రణ, ఉత్పత్తుల హేతుబద్ధీకరణ ద్వారా ప్రాథమిక వ్యాపారాన్ని మరింత బలోపేతం చేయడం, మార్జిన్లను మెరుగుపర్చడంపై దృష్టి సారిస్తున్నాం. వ్యాపారంలో దీర్ఘకాలిక విలువ సృష్టించేందుకు బయోసిమిలర్స్, ఆవిష్కరణ రంగాల్లో బలమైన వ్యూహాలతో ముందుకెళ్తున్నామన్నారు.

# విపణిలోకి బ్రిక్స్‌టన్ మోటార్ సైకిల్స్

హైదరాబాద్: ఐరోపా ద్విచక్ర వాహన బ్రాండ్లు బ్రిక్స్‌టన్ మోటార్ సైకిల్స్, వీఎల్ఎఫ్ స్కూటర్లు హైదరాబాద్ విపణిలో అందుబాటులోకి వచ్చినట్లు విక్రయ సంస్థ మోటోహౌస్ ఇండియా మంగళవారం ఇక్కడ ప్రకటించింది. దేశ వ్యాప్తంగా 14 విక్రయ కేంద్రాలుండగా, ఈ ఏడాదిలో కొత్తగా 16 ప్రారంభించబోతున్నామని, ప్రీమియం మోటార్ సైకిళ్లకు గిరాకీ పెరగడమే ఇందుకు కారణమని మోటోహౌస్ ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తుషార్ షెల్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో తొలి దశ కింద రూ.70 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో, ఏడాదికి 25,000 వాహనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందని వివరించారు.

# ఐరోపా సముద్రగర్భ సేవల్లోకి అదానీ పోర్ట్స్

### రూ.13,000 కోట్ల పెట్టుబడులకు సన్నాహాలు

ఐరోపాలో ప్రత్యేకమైన సముద్రగర్భ– తీరప్రాంత సేవల (స్పెషలైజ్డ్ సబ్‌సీ, ఆఫ్‌షోర్ సర్వీసెస్) విపణిలోకి అడుగుపెట్టేందుకు అదానీ పోర్ట్స్ సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం అమెరికాకు చెందిన ఇంజినీరింగ్ దిగ్గజం ఓషియనీరింగ్ ఇంటర్నేషనల్‌తో అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీసెజ్)కు చెందిన మెరైన్ ప్లాట్‌ఫామ్ 'ఆస్ట్రో ఆఫ్‌షోర్' భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా 2030–31 ఆర్థిక సంవత్సరం నాటికి 200 నౌకలతో అంతర్జాతీయ మెరైన్ ఫ్లీట్ ఏర్పాటు చేయడానికి, రూ.13,000 కోట్లు కేటాయించాలని అదానీ పోర్ట్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఆఫ్‌షోర్, మెరైన్ వ్యాపార పోర్ట్‌ఫోలియో ద్వారా 2030–31 నాటికి రూ.6000 కోట్ల ఆదాయం ఆర్జించాలన్నది కంపెనీ ప్రణాళిక. ఆఫ్‌షోర్ లాజిస్టిక్స్, అండర్ వాటర్ ఇంజినీరింగ్, డీప్ వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేవలను అందించే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ మెరైన్ ప్లాట్‌ఫామ్‌ల్లో ఒకటిగా ఎదగాలని ఏపీసెజ్ లక్ష్యంగా పెట్టుకుంది. నౌకల కొనుగోలు, సామర్థ్యాలు ఇలా: ఈ విస్తరణలో భాగంగా ఎనర్జీ సవన్నా అనే 97 మీటర్ల బహుళ ప్రాయోజిత నౌకను దుబాయ్ కేంద్రంగా పనిచేసే ఆస్ట్రో ఆఫ్‌షోర్ కొనుగోలు చేసింది. దీనికి 'ఆస్ట్రో అట్లాస్' అని పేరు పెట్టనున్నారు. 2021లో నిర్మించిన ఈ నౌక సముద్ర నీటిలో 3000 మీటర్ల కంటే ఎక్కువ లోతులో పనిచేయగలదు. ఇందులో 150 టన్నుల సబ్‌సీ క్రేన్, 100 మంది సిబ్బందికి వసతి సదుపాయాలు ఉన్నాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,53,900 (22 క్యారెట్లు) | ₹ 1,67,890 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 3,00,100

# భగ్గుమన్న నిత్యావసరాలు

## ఆభరణాలు ధరలు పైపైకి

### ఏప్రిల్‌లో రిటెయిల్ ద్రవ్యోల్బణం 3.48%



**దిల్లీ:** పసిడి, వెండి ఆభరణాలతో పాటు కొన్ని వంటగది సరుకుల ధరలు పెరగడంతో ఏప్రిల్‌లో రిటెయిల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి పెరిగింది. ఈ ఏడాది జనవరిలో 2.74%, ఫిబ్రవరిలో 3.21%, మార్చిలో 3.40 శాతంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం నమోదైంది. 2024 బేస్ ఏడాది ప్రకారం వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలను జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) మంగళవారం విడుదల చేసింది. ఆహార ద్రవ్యోల్బణం మార్చిలో 3.87% కాగా, గత నెలలో 4.20 శాతానికి చేరింది. ఏప్రిల్‌లో పసిడి ఆభరణాలు 144.34% ప్రియమయ్యాయి. తర్వాతి స్థానాల్లో కొబ్బరి (44.55%), పసిడి, వజ్రాలు, ప్లాటినం ఆభరణాలు (40.72%), టమాటా (35.28%), కాలీఫ్లవర్ (25.58%) ఉన్నాయి. బంగాళదుంపలు, ఉల్లిపాయలు, మోటార్‌కార్లు, జీపులు, బఠానీలు, ఏసీల ధరలు తగ్గాయి. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 3.74 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 3.16 శాతంగా నమోదైంది.తెలంగాణలో అత్యధికంగా 5.81% ద్రవ్యోల్బణ రేటు నమోదైంది. అత్యల్పంగా మిజోరాంలో 0.69% ఉంది. 2026–27 మొత్తంమీద రిటెయిల్ ద్రవ్యోల్బణం 4.6 శాతంగా, మొదటి త్రైమాసికంలో 4 శాతంగా నమోదుకావొచ్చని ఆర్‌బీఐ గత నెలలో అంచనా వేసింది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా పెరుగుతున్న ఇంధన ధరలు, ఎల్‌నినో పరిస్థితుల వల్ల మరింత పెరిగే ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది. ద్రవ్యోల్బణ గణాంకాల కోసం దేశవ్యాప్తంగా 1407 పట్టణ మార్కెట్లు, 1465 గ్రామాల నుంచి ఎప్పటికప్పుడు ధరలను ఎన్ఎస్ఓ సేకరిస్తోంది.

## బంగారం, వెండిపై దిగుమతి సుంకం పెంపు


పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బంగారం, వెండి దిగుమతులకు కళ్లెం వేసేందుకు కీలక చర్యలు చేపట్టింది. ఈ రెండు లోహాల దిగుమతులపై సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి పెంచుతూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వీటిపై 10% బేసిక్ కస్టమ్స్ డ్యూటీ, 5% అగ్రికల్చర్‌ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్ (ఏఐడీసీ) విధించారు. ప్రస్తుతం రూపాయి విలువ భారీగా పతనమై డాలర్‌తో పోలిస్తే రూ.95.75 వద్దకు చేరిన సమయంలో ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించింది. వాస్తవానికి బంగారం కొనుగోలు నిలిపేయాలని ప్రధాని మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేసిన తర్వాత కూడా కస్టమ్స్ డ్యూటీని పెంచడం గమనార్హం. ప్రపంచంలోనే బంగారం అత్యధికంగా దిగుమతి చేసుకొనే రెండో దేశం భారత్ కాగా.. వెండి విషయంలో మొదటి స్థానంలో ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సుంకాలు పెంచడంతో.. దేశీయ కొనుగోళ్లు డీలా పడే అవకాశాలున్నాయని ఇండియా బులియన్ అండ్ జువెలరీ అసోసియేషన్ కార్యదర్శి సురేంద్ర మెహత అభిప్రాయపడ్డారు.

**అత్యధికం ఈ రెండే**

భారతదేశం తన అవసరాలకు కావాల్సిన 85 శాతం ముడి చమురును ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. బంగారం కూడా భారీగా దిగుమతి అవుతోంది. ఏటా 700–800 టన్నుల బంగారం వినియోగిస్తుంటే అందులో దేశీయంగా ఉత్పత్తి అయ్యేది పరిమితమే. అంటే 90 శాతానికి పైగా బంగారం దిగుమతి చేసుకుంటున్నాం. బంగారం, ముడి చమురుకు అమెరికన్ డాలర్లలోనే చెల్లింపులు చేయాలి.

### పాక్‌ను ఏమాత్రం నమ్మలేను

## అమెరికా సెనెటర్ అలా ఎందుకు అన్నారంటే..?



**వాషింగ్టన్:** అంతర్జాతీయ వ్యవహారాల్లో పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని అమెరికా సెనెటర్ లిండ్సేగ్రాహం తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్‌ను ఏమాత్రం నమ్మలేనని వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా–ఇరాన్ శాంతి ఒప్పందం కోసం పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో ఇరాన్‌కు పాక్ సైనికంగా సహకరించిందన్న ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే లిండ్సే స్పందన వచ్చింది."నేను పాకిస్థాన్‌ను ఏమాత్రం నమ్మలేను. ఆ దేశాన్ని వీలైనంత దూరంగా ఉంచుతాను. ఇరాన్ విమానాల పార్కింగ్‌కు పాక్ అనుమతిస్తే.. మధ్యవర్తిత్వానికి అమెరికా వేరొక దేశాన్ని వెతుక్కోవాలి. అందుకేనేమో శాంతి ఒప్పందం అంశం ఏటూ తేలడం లేదు" అని సెనెటర్ అనుమానాలు వ్యక్తంచేశారు. ఇటీవల అమెరికా దాడుల భయంతో ఇరాన్ తన వైమానిక దళానికి చెందిన కొన్ని యుద్ధ విమానాలను పాకిస్థాన్‌లోని స్థావరాలకు తరలించిందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. గూఢచర్య, నిఘా కార్యకలాపాలకు వినియోగించే ప్రత్యేక ఆర్‌సీ–130 విమానం కూడా అందులో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కథనాలను పాకిస్థాన్ అధికారులు తోసిపుచ్చారు. తమ ఎయిర్‌బేస్‌లలో ఇరాన్ సైనిక విమానాలకు ఆశ్రయం ఇచ్చినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆ దేశ సీనియర్ అధికారి పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడారు. తమ దేశం మరో మధ్యవర్తిని వెతకడం లేదని వెల్లడించారు.

### ఉషను పెళ్లి చేసుకోకుంటే..

## బ్యాచిలర్‌గానే

### అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్



**వాషింగ్టన్:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన వైవాహిక జీవితం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రవాస భారతీయురాలు ఉషతో పెళ్లి కాకుంటే.. తాను జీవితాంతం బ్యాచలర్‌గానే ఉండిపోయేవాడినన్నారు. వాన్స్ తన ఆత్మకథ పుస్తకంలో ఈ విషయాలను పంచుకున్నారు. ఇది వచ్చే నెలలో విడుదల కానుంది. యేల్ లా స్కూల్‌లోనే ఉషని తొలిసారి కలిసినట్లు వాన్స్ తెలిపారు. తొలిసారి చూసినప్పుడు.. ఆమెలో చాలా అసాధారణమైన విషయాలు తనకు కన్పించాయన్నారు. ఆమె అందం, తెలివితేటలు, సంప్రదాయం, సక్సెస్ కొలమానాలపై నిరాసక్తత వంటి అంశాలు తనను ఆకర్షించినట్లు వెల్లడించారు. తాను ఉషను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానని, ఆమెతో పెళ్లి కాకపోతే జీవితాంతం బ్యాచిలర్‌గానే ఉండిపోతానని తన స్నేహితులతో పేర్కొన్నట్లు వాన్స్ తెలిపారు. పిల్లలంటే ఆమెకు చాలా ఇష్టమన్నారు. ఇక ఉష, జేడీ వాన్స్‌లకు 2014లో వివాహం జరిగింది. హిందూ సంప్రదాయంలో వీరి వివాహం జరగడం విశేషం. వీరికి ముగ్గురు సంతానం. త్వరలోనే ఉష మరో బిడ్డకు జన్మనివ్వనున్నారు. కాగా.. వేధింపులు, మద్యపానం, పేదరికంతో కూడిన తన బాల్యాన్ని వివరిస్తూ.. వాన్స్ అనే పుస్తకాన్ని రాశారు. ఇది అద్భుతమైన విజయం సాధించడమే కాకుండా.. సినిమాగా కూడా రూపొందింది.

## ములాయం చిన్నకొడుకు ప్రతీక్ హఠాన్మరణం

### ఆస్పత్రికి తీసుకెళ్లే లోగానే మరణించినట్లు వెల్లడి

### ప్రతీక్ మృతికి అఖిలేశ్, సిఎం యోగి సంతాపం

లక్నో(జనంసాక్షి): సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ములాయం సింగ్ యాదవ్ చిన్న కుమారుడు ప్రతీక్ యాదవ్ (38) హఠాన్మరణం చెందారు. బుధవారం ఉదయం 6:15 గంటల సమయంలో ప్రతీక్ యాదవ్ తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను లక్నో ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రతీక్ యాదవ్ మరణానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాథమిక పరిశీలనలో ఆయన శరీరంపై ఎటువంటి గాయాల గుర్తులు కనిపించలేదని వైద్యులు పేర్కొన్నారు. మరణానికి గల కారణాన్ని నిర్ధారించడానికి కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ వైద్యుల బృందం మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించనుంది. ప్రతీక్ యాదవ్.. మూలాయం సింగ్ యాదవ్ రెండో భార్య కుమారుడు, బీజేపీ నాయకురాలు అపర్ణా యాదవ్ భర్త. రాజకీయ కుటుంబంలో జన్మించినప్పటికీ, ప్రతీక్ యాదవ్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ రియల్ ఎస్టేట్, ఫిట్‌నెస్ రంగాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన అకాల మరణం ములాయం సింగ్ యాదవ్ కుటుంబంలో, రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రతీక్ కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. దీనికి చికిత్స కూడా తీసుకుంటున్నారు. ఈరోజు ఉదయం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాల్లో యాదవ్ కుటుంబం కీలకంగా ఉన్నప్పటికీ.. ఆయన మాత్రం దూరంగా ఉండేవారు. 2011లో ప్రతీక్–అపర్ణ వివాహం జరిగింది. అయితే ఇటీవల వీరిమధ్య విభేదాలు తలెత్తాయి. అపర్ణ వల్ల తమ కుటుంబసభ్యుల మధ్య అనుబంధాలు దెబ్బతిన్నాయంటూ భార్యపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. వ్యక్తిగత స్వార్థంతో తమ కుటుంబాన్ని ఆమె ధ్వంసం చేశారంటూ జనవరిలో ఆయన చేసిన పోస్టు చర్చనీయాంశమైంది. ఈ బంధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని అనుకుంటున్నట్లు, విడాకులు తీసుకుంటానని పేర్కొన్నారు.

## పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా రంగస్వామి ప్రమాణం

పుదుచ్చేరి(జనంసాక్షి): కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కూడా ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా మోదీ అభినందనలు తెలిపారు

# బ్రిటన్ ప్రధానికి పదవీ గండం!

### లేబర్ పార్టీలో ఊపందుకుంటున్న తిరుగుబాటు • రాజీనామా చేయనంటున్న స్టార్మర్



లండన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార లేబర్ పార్టీ ఘోరపరాజయం పాలైన నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా కోరుతూ ఆయన పార్టీలో తిరుగుబాటు ఊపందుకుంటోంది. మంగళ వారం ఆయన భవితవ్యాన్ని నిర్ణయించేందుకు ఒక వైపు మంత్రి మండలి అత్యవసరంగా సమావేశం కాగా, మరోవైపు దాదాపు 80 మంది లేబర్ పార్టీ ఎంపీలు బహిరంగంగా నాయకత్వ మార్పును డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్ హోం మంత్రి షబానా మహమూద్, విదేశాంగ మంత్రి య్వెట్ కూపర్‌తో సహా పలువురు సీనియర్ మంత్రులు స్టార్మర్ పదవి వీడాలని కోరుతున్న వారిలో ఉన్నారు. స్టార్మర్ రాజీనామాను డిమాండ్ చేస్తూ గృహ నిర్మాణ మంత్రి మియట్టా ఫహన్‌బుల్లేహ్ రాజీనామా చేయడం పరిస్థితిని మరింత దిగజార్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రధాని అధికార నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్‌లో అత్యవసర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఒత్తిళ్లకు లొంగేది లేదని, రాజీనామా చేయబోనని స్టార్మర్ తేల్చి చెప్పారు. తన ప్రత్యర్థులు కనీసం 20 శాతం మంది ఎంపీల మద్దతు కూడగట్టడంలో విఫలమయ్యారని ఆయన అంటున్నారు. "స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలకు బాధ్యత వహిస్తున్నాను. నేను హామీ ఇచ్చిన మేరకు పరివర్తన తీసుకొచ్చే పూచీ నాది" అని స్టార్మర్ పునరుద్ఘాటించారు. మరోవైపు... "మన దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. మీరు పరివర్తన తేగలరని ప్రజలు విశ్వసించడం లేదు. అందుకే దేశం కోసం మీరు సరైన చర్య తీసుకోండి. నాయకత్వ మార్పునకు కాల ప్రణాళిక నిర్ణయించండి. కనీసం మీ తర్వాత వచ్చే జట్టు అయినా దేశానికి కావాల్సిన మార్పు తీసుకురాగలదు" అని గృహనిర్మాణ మంత్రి తన రాజీనామా లేఖలో పేర్కొనటం గమనార్హం.

# శిశు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు





## జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 13 (జనం సాక్షి) :** శిశు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. ఆడ శిశువును 3 లక్షలకు అమ్మిన తల్లి తండ్రులు కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తాండకు చెందిన దంపతులు తమ 4 వ శిశువును అమ్ముకున్నారనే విషయం మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టడం జరిగినది. ఇట్టి విచారణలో కన్న తల్లి తండ్రులు తమ పాపను 3 లక్షలకు అమ్ముకున్నారని నిర్ధారించుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తగు చర్యల కొరకై పిర్యాదు చేయడం జరిగినది. ఇట్టి విచారణలో తెలిసినది కొల్చరం మండలం పోతిరెడ్డిపల్లి తాండకు చెందిన దంపతులకు ఇదివరకే 3 సంతానం ఉండగా తేదీ 27.3.2026 నాడు మెదక్‌లోని ఎంసిహెచ్ హాస్పిటల్‌లో ఆడ పాప జన్మించడం జరిగినది. పాపను దంపతులిద్దరూ 3 లక్షలకు కొంత మంది మధ్యవర్తుల ద్వారా అల్లినగర్, ములుగు మండలం సిద్దిపేట జిల్లాకు చెందిన దంపతులకు విక్రయించడం జరిగించడం జరిగినది. ఇట్టి విషయం పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి పాపను తీసుకువచ్చి మహిళా శిశు సంక్షేమ అధికారులకు అప్పగించడం జరిగినది. అధికారులు సంబంధిత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు పాపను తదుపరి సంరక్షణ నిమిత్తం సంగారెడ్డిలోని శిశుగృహకు తరలించి ఆశ్రయం కల్పించడం జరిగినది. జిల్లాలో అక్రమ దత్తత తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియచేస్తూ, ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవలంటే ప్రభుత్వ నియమ నిభందనల ప్రకారం మహిళా శిశు సంక్షేమ శాఖ లోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# అంబలి పంపిణీ అభినందనీయం

## టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో చత్రపతి శివాజీ యువసేన సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబలి పంపిణీ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు పాల్గొని ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అంబలి పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ సేవలో యువత ముందు ఒడి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువసేన సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# మైనార్టీలకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ

- మే 31 తేదీ లోపు దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు యాకూబ్ పాషా



**హైదరాబాద్:** యూపీఎస్సీ 2027లో నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థుల కోసం తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్ వారు అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు కలిగి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి 3 ఏండ్ల డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ యొక్కశిక్షణ పొందటానికి అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను https://cet.cgg.gov.in/tmreis వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులకు జూన్ 14న రాష్ట్రంలోని అన్నీ జిల్లా కేంద్రాలలోని సమీప మైనారిటీ గరుకులాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించబడతుందని, ఈ స్క్రీనింగ్ టెస్ట్ లో మెరిట్ సాధించిన అభ్యర్థులకు మెరిట్ ప్రాతిపదికన 100 మందిని ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందించటం జరుగుతుందని ఇట్టి అవకాశాన్ని రాష్ట్రంలోని మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ, పార్శీ మతాలకు చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కొరకు 8520860785 నంబర్ నందు సంప్రదించాలని సూచించారు.

# రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

- వరి ధాన్యం కొనుగోలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
- జూన్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు
- నవాబుపేటలో ధాన్యం కేంద్రం, ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**చిగురుమామిడి, మే 13 (జనంసాక్షి):** రైతుల వరి ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన తూకం వేసి మిల్లులకు తరలించాలని, రైతులకు ఇబ్బందులు కలిగేలా నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని, హమాలీలు ఎండలో ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం**

అదే గ్రామంలో బోదాసు లలిత రవిల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని రిబ్బన్ కట్ చేశారు. లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఇప్పటికే ఇళ్లు పూర్తి చేసుకొని గృహప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు జూన్ నుంచి ప్రారంభమవుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. అవినీతి లేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ గుల్ల రజిత రాజు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

- వేములవాడ పట్టణ క్రీడాకారులకు కేసీఆర్ కప్ క్రికెట్ కిట్లను అందజేసిన చల్మెడ
- జిల్లాస్థాయిలో రాణించిన రన్నరఫ్ విజేతలకు నగదు బహుమతి అందజేత



**వేములవాడ(జనంసాక్షి):**యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపాలనీ వేములవాడ బిఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చెల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు.యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించగా ఇటీవల దిగ్విజయంగా ముగిసింది. ఇందులో భాగంగా పాల్గొన్న జట్లకు ప్రోత్సాహకంగా ఉండేందుకు వేములవాడ పట్టణంలోని 14 జట్ల క్రికెట్ క్రీడాకారులకు బుధవారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కెసిఆర్ కప్ తో క్రికెట్ క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి పెంపొందడమే కాకుండా గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారులు తమ ప్రతిభను చాటారన్నారు. టోర్నమెంట్ లో పాల్గొన్న అన్ని జట్లకు క్రికెట్ కిట్లను అందజేసి వారికి ప్రోత్సాహంగా ఉండడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారులను వెలికి తీస్తామని తెలిపారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపేందుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎప్పుడు ముందున్నారని గుర్తు చేశారు. క్రికెట్ తో పాటు భవిష్యత్తులో కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో రాణించిన మొదటి రన్నర్ అఫ్ గా నిలిచిన వేములవాడ చెందిన 7, 8 వార్డ్ తిప్పాపూర్ జట్టు (వేములవాడ కమాండర్స్) ప్రోత్సాహక బహుమతిగా 1లక్ష రూపాయలు,అలాగే జిల్లాస్థాయిలో రెండవ రన్నరప్ గా నిలిచిన పట్టణంలోని (భగవంతరావునగర్) 26, 27 వార్డులకి చెందిన జట్టు వేములవాడ రాయల్స్ కు ప్రోత్సాహక బహుమతిగా 50వేల రూపాయలను చల్మెడ స్వయంగా అందించి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కే డి సి సి బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, కొండ కనుకయ్య, సిరిగిరి చందు, గూడూరు మధు, గుడిసె సదానందం, సుంకపాక రాజు, పెద్దిరాజు, హనుమంతు, అంజయ్య, లైశెట్టి మల్లేశం, అంజద్ పాషా, మామిండ్ల కనకయ్య, మంత సందీప్, ఉమర్, రాకేష్,అశోక్,తిరుపతి,రేవంత్,చందు తదితరులు ఉన్నారు.

### మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన

# బండి సాయి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

- క్యాబినెట్ నుంచి మంత్రి బండి సంజయ్ ను బర్త్ రఫ్ చేయాలి
- పట్టణ చౌరస్తాలో ఆందోళన చేపట్టిన గులాబీ నేతలు
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి



**గోదావరిఖని, జనంసాక్షి:** మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన ఉన్మాది బండి సాయి భగీరథ్ ను వెంటనే పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గోదావరిఖని పట్టణ చౌరస్తా వద్ద గులాబీ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సాయి భగీరథ్ చిత్ర పటానికి చెప్పుల దండ వేసి చెప్పులతో కొట్టారు. అలాగే కేంద్రమంత్రి బండి సంజయ్ చిత్రపటంపై షేమ్ షేమ్ అంటూ గీతలు గీశారు. ఈ సందర్భంగా పోలీసులకు పార్టీ శ్రేణులకు మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడు తూ గత మూడు నెలల నుంచి బండి సాయి భగీరథ్ చేస్తున్న అకృత్యాలను బండి సంజయ్ తన పదవిని ఉపయోగించుకొని కాపాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా అదే బాలిక కుటుంబం పై హాని ట్రాప్ ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రధానమంత్రి కి సీఎం రేవంత్ రెడ్డి లొంగిపోయాడని, దీంతో సాయి భగీరథ్ ను సిట్ విచారణ పేరుతో బెయిల్ కు ఇచ్చేందుకు అవకాశం ఇస్తున్నారని పేర్కొన్నారు. కేసును తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. భగీరథకు అరెస్టు చేసి రాష్ట్రంలో ఉన్న మహిళలకు భరోసా కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ తస్లీమా భాను, పర్స స్వాతి, జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, బూర్ల వంశీకృష్ణ, బొట్ల పోచం, కృష్ణస్వామి, కొండ సురేష్, పోయిల రవి, ఉదయ్, శైలజ, కుమారి, రజిత, ఇంద్ర, అశ్విని ఉన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానం

- 1వ, 5వ తరగతుల్లో ఎస్సీ విద్యార్థులకు అవకాశం
- జూన్ 10న లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు
- ఆదాయ పరిమితి, వయోపరిమితి వివరాలు వెల్లడి



**పెద్దపల్లి, మే 13 (జనంసాక్షి):** 2026-27 విద్యా సంవత్సరానికి పెద్దపల్లి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్)లో 1వ తరగతి, 5వ తరగతుల్లో ప్రవేశం కోసం జిల్లాకు చెందిన అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రకటించారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్) లో 70 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్)లో 73 సీట్లు కేటాయించారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000/-లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2,00,000/-లోపు ఉండాలి. 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ ప్రవేశం కోరే విద్యార్థులు 01.06.2019 నుంచి 31.05.2020 మధ్య జన్మించి ఉండాలి. ఒక కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే అర్హత ఉంటుంది. ఆసక్తి గలవారు దరఖాస్తు ఫారాలను మే 16 నుంచి జూన్ 5 వరకు జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను కులం, ఆదాయం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు వంటి ధ్రువీకరణ పత్రాలతో జతపరిచి జూన్ 6 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలి. జూన్ 10న లాటరీ పద్ధతి ద్వారా సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు 9618844454, 9989354155ను సంప్రదించవచ్చు.

**పీఎం సేతు పథకం అమలు**

పీఎం సేతు (పీఎం సేటు) పథకాన్ని పెద్దపల్లి జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 1000 ఐటీఐలను ఆధునీకరించేందుకు ఈ పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం క్రింద 50% నిధులు కేంద్రం, 33% రాష్ట్రం, 17% పరిశ్రమలు భరించనున్నాయన్నారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో పెద్దపల్లి క్లస్టర్ పరిధిలో ఐటీఐల మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునీకరణకు కేంద్రం రూ.120 కోట్లు, రాష్ట్రం రూ.80 కోట్లు వ్యయం చేయనున్నట్లు తెలిపారు. సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలతో భాగస్వామ్యం కోసం చర్చలు జరుపుతున్నామని, యువతకు సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యమని కలెక్టర్ వివరించారు.ఈ సమావేశంలో సిపిఓ రవీందర్, సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా అధ్యక్షుడు, క్లస్టర్ అధికారులకు ఘన సన్మానం




**బోధన్, మే 13 ( జనంసాక్షి ) :** నిజామాబాద్ జిల్లా సహకార సంఘం యూనియన్ అధ్యక్షులు బాబా, సహకార సంఘం బోధన్ క్లస్టర్ అధికారి అనుపాల రవీందర్ లను బుధవారం సహకార సంఘాల కార్యదర్శులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. నేడు శ్రీ బోధన్ క్లస్టర్ లోని 11 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు మరియు టాబ్ ఎంట్రీ ఆపరేటర్ లతో బోధన్ క్లస్టర్ అధికారి అనుపాల రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు, మొక్కజొన్న కేంద్రాల నిర్వహణ, టాబ్ ఎంట్రీ వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని, గోడౌన్ కి త్వరగా పంపించే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నిజామాబాద్ జిల్లా సహకార సంఘం యూనియన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన పెంటాకలాన్ సహకార సంఘం కార్యదర్శి షేక్ బాబాను 11 సంఘాల సిబ్బంది, క్లస్టర్ అధికారి అనుపాల రవీందర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శులు శ్రీనివాస చారి, ఉమాకాంత్, రవుఫ్, కండెల సంజీవ్, హన్మాండ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సైబరాబాద్ వ్యాప్తంగా అభివృద్ధి పనుల్లో

# సమగ్రత, పారదర్శకత పెంచాలి

- పౌర సేవలు, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- పనుల నాణ్యత, గడువులు, బిల్లుల ధృవీకరణపై జవాబుదారీతనం
- 'ప్రతిరోజూ ఒక వార్డు' కార్యక్రమం సమర్థవంతంగా అమలు




**శేరిలింగంపల్లి, మే 13 (జనంసాక్షి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పౌర సేవల్లో మరింత సమగ్రత, పారదర్శకత అవసరమని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి సృజన స్పష్టం చేశారు. బుధవారం తన కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన సృజన, ఇంజనీరింగ్ పనులు, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, ప్రత్యేక ప్రాజెక్టులు, వార్డు స్థాయి అమలు వంటి అంశాలపై సమగ్ర సమీక్ష చేశారు. ఫిర్యాదుల పరిష్కార వేగం, పనుల నాణ్యత, గడువులు, బిల్లుల ధృవీకరణపై జవాబుదారీతనం పాటించాలని ఆదేశించారు. కమిషనర్ సృజన మాట్లాడుతూ, ఫిర్యాదులను కేవలం మూసివేయకుండా ఫిర్యాదుదారులు ఆశించిన ఫలితం కనిపించేలా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు రోజువారీ అందుతున్న ఫిర్యాదులు, అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై దృష్టి పెట్టాలని సూచించారు. 'ప్రతిరోజూ ఒక వార్డు' కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిర్వహించి వీలైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సంబంధిత జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# ఓదెల మల్లన్న ఆలయాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తాం

- గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి
- పేదల సొంతింటి కల నెరవేరుతుంది
- 20 లక్షలతో గుండ్లపల్లి గ్రామంలో సీసీ రోడ్లు ప్రారంభం

**పెద్దపల్లి, మే 13 (జనంసాక్షి):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రకటించారు. ఈ సందర్భంగా ఓదెల ఆలయం చుట్టూ ప్రధాన రహదారి నిర్మాణం కోసం రూ.1 కోటి నిధులతో శంకుస్థాపన చేశారు. అలాగే గుండ్లపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆలయం చుట్టూ రోడ్డు నిర్మాణం, 15 లక్షలతో టాయిలెట్ల నిర్మాణం, డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులు ఇప్పటికే పూర్తి చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో దశలవారీగా ఓదెల మల్లన్న క్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని విజయరమణ రావు స్పష్టం చేశారు. గుండ్లపల్లి గ్రామంలో 10 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు నిర్వహించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సర్కారులో పేదల సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్, డైరెక్టర్లు, మండల పార్టీ అధ్యక్షులు, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కర్ణాటక పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- కుల్కచర్లలో దొంగ బంగారం, వెండి నగల స్వాధీనం
- స్థానిక జ్యువెలరీ షాపులో బెంగళూరులో చోరీకి గురైన నగలు
- నిందితులను అరెస్టు చేసి కర్ణాటకకు తరలింపు

**వికారాబాద్ జిల్లా బ్యూరో, మే 13 (జనంసాక్షి):** తెలంగాణ-కర్ణాటక సరిహద్దు మండలాల్లో అక్రమ వ్యాపారులు అమాయకులను మోసం చేస్తున్న విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. కర్ణాటకలోని బెంగళూరులో జరిగిన జ్యువెలరీ షాపు దొంగతనం కేసులో కీలకమైన ఆధారాలు కుల్కచర్ల మండలంలో లభించాయి. కర్ణాటక పోలీసులు కుల్కచర్లలోని ఒక జ్యువెలరీ షాపులో ఆకస్మిక తనిఖీలు చేపట్టి దొంగతనం చేసిన బంగారం, వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం చేసిన నిందితులు వికాస్, కైలాస్ అనే ఇద్దరిని అరెస్టు చేసి కర్ణాటకకు తరలించారు. ఈ నిందితులు బెంగళూరులోని ఒక జ్యువెలరీ షాపులో దొంగతనం చేసిన నగలను కుల్కచర్లలోని తమ షాపులో దాచి ఉంచి విక్రయించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

పెళ్లి సీజన్‌లో జ్యువెలరీ షాపులకు అడ్వాన్స్‌గా లక్షల రూపాయలు చెల్లించిన ప్రజలు నగలు అందకుండా మోసపోతున్నారని, ఇటువంటి సంఘటనలు జిల్లాలో తరచూ జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నవంబర్‌లో కూడా కుల్కచర్లలోని అజయ్ జ్యువెలరీ షాపు యజమాని మూడు కోట్ల విలువైన బంగారు నగలతో పరారీ అయ్యాడు. ఆ కేసులో కూడా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. మార్వాడీలు, జ్యువెలరీ షాపు యజమానులు ప్రజలను నమ్మించి మోసాలు చేస్తున్నారని, అధిక వడ్డీ, చిట్‌ఫండ్స్, నకిలీ విత్తనాల వ్యాపారం వంటి అక్రమాలు జిల్లాలో విస్తృతంగా జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. బంగారం, వెండి నగలు కొనుగోలు చేసేటప్పుడు హాల్‌మార్క్ ఉన్న నగలనే కొనాలని, ప్రైవేట్ ఫైనాన్స్‌లను నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు.

# విద్యా వారోత్సవాలు.. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా శిక్షణ కార్యక్రమం
- మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధనకు చర్యలు
- బడి బయట ఉన్న పిల్లలను చేర్చేందుకు ప్రజా ప్రతినిధుల సహకారం కావాలి




**కొడంగల్, మే 13 (జనంసాక్షి):** పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా బుధవారం కొడంగల్ కడ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి నాణ్యమైన బోధన, డిజిటల్ విద్య, మెరుగైన సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. విద్యార్థి సంక్షేమానికి అనేక కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టే పథకాల అమలుకు ప్రజా ప్రతినిధుల సహకారం అవసరమని పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి అధిక నిధులు కేటాయించడం జరుగుతోందని, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, టాయిలెట్ల నిర్మాణం వంటి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లాలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాలు మెరుగుపడ్డాయని, ముందుకు మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కస్తూరిబా గాంధీ పాఠశాలలు, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మత్తు పనులు, తాగునీటి, విద్యుత్, టాయిలెట్ల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే హస్నాబాద్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని, అంగన్వాడి కేంద్రాల్లో ప్రాథమిక పూర్వ పాఠశాలలు ప్రారంభించి విద్యాబోధన చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఏఐ సాంకేతికతతో మ్యాథమెటిక్స్ నైపుణ్యతపై శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధీర్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గం ఇంచార్జ్ తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ ఉషాశ్రీ, మండల విద్యాధికారి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## లారీల కోసం రోడ్లపై అధికారుల తిప్పలు..

కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం కుప్పలుగా పేరుకుపోతున్నాయి. కేంద్రాల్లోని తూకం వేసిన ధాన్యాన్ని మిల్లుల కు తరలించాలని జిల్లా అధికారులు,ఆయా శాఖల అధికారులను ఆదేశించారు ఈ మేరకు పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖ అధికారులు రహదారులపై లారీలు, డీసీఎం వ్యానులను ఆపుతూ కొనుగోలు కేంద్రాలకు పంపిస్తున్నారు. అక్కడి నుండి ధాన్యాన్ని వాటి ద్వారా కేటాయించిన మిల్లలకు తరలిస్తున్నారు అయినప్పటికీ లారీల కొరత తీవ్రంగా ఉండడంతో దాన్యం అనుకున్న మేరకు కేంద్రాల నుంచి మిల్లులకు తరలడం లేదు



# ఆందోళనలో అన్నదాతలు

## లారీల కొరత.. కొనుగోలు కేంద్రాల్లోనే నిలిచిపోయిన వరి ధాన్యం

- 42.50 కేజీల తూకం.. తాలు-చెత్త పేరుతో రైతులకు నష్టం
- త్వరగా లారీలు ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 13 (జనంసాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దాన్యం తరలింపులో లారీల కొరత వలన రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.93 లక్షల ఎకరాలలో వరి ధాన్యం పంటలు వేయగా నాలుగు లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చినట్లు సమాచారం. వ్యవసాయ అధికారుల అంచనాల ప్రకారం 3 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు వరి ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రతి సంవత్సరం యాసంగి పంట కోతకు వచ్చే సమయానికి ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఈసారి మాత్రం గత నెల 20న వరి ధాన్యం కొనుగోలు ప్రారంభించడంతో అప్పటికే రైతన్నలు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువ చేసి ఉంచారు. జిల్లా వ్యాప్తంగా 236 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగ ఇప్పటివరకు సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వరి ధాన్యపు బస్తాలు కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి.

**42.50 కిలోల ధాన్యం తూకం..**

వరి ధాన్యం కొనుగోలులో 40. 50 కిలోలు ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుండగా 42.50 కిలోలు తూకం వేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా వ్యవసాయ అధికారిని అఫ్జల్ బేగంను వివరణ కోరగా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూర్పార పట్టకపోవడంతో తాలు మట్టి ఉండడంతో 42. 50 కిలోలు తూకం వేస్తున్నారని ఆమె తెలిపారు కొనుగోలు కేంద్రాల్లో రైతులు తాలు మట్టి తొలగిస్తే 40.50 కిలోలు మాత్రమే తూకం వేస్తామన్నారు.

**తూకం వేసి వారం గడుస్తుంది : తంగేళ్ల బాబు రైతు.**



వేములవాడ లోని మహాలక్ష్మి ఏరియా కొనుగోలు కేంద్రం వద్ద వరి ధాన్యం తూకం వేసి వారం రోజులు గడుస్తుంది. లారీలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాము. అకాల వర్షాలు పడితే మా పరిస్థితి ఏంటి. పలుమార్లు కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు, అధికారులకు మొరపెట్టుకున్న లారీలు వస్తాయి అంటూ కాలం వెలదీస్తున్నారు, తప్ప లారీలు, డీసీఎం వ్యాన్లు రావడం లేదు.

**లారీలతో పలు ఇబ్బందులు : రైతు రవి..**



మా వరి ధాన్యాన్ని గన్ని బ్యాగులో నింపి తూకం వేసి ఐదు రోజులు గడుస్తుంది. లారీలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాము. తూకం వేసిన ప్పుడు 42.50 కిలోలు ఉండగా భానుడి ప్రతాపంతో తూకంలో తేడాలు వస్తె ఈ నష్టాలు ఎవరు భరించాలి. జిల్లా స్థాయి అధికారులు కొనుగోలు కేంద్రాలకు లారీలు,డీసీఎం వ్యాన్లు ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించాలి



## వేములవాడ నూతన ఆర్డీవోగా కె.ఎస్.బీ కుమారి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 13 (జనంసాక్షి):** వేములవాడ ఆర్డీవోగా కె.ఎస్.బీ కుమారి బుధవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ పదవిలో ఉన్న రాధాబాయి హైదరాబా ద్‌కు బదిలీ కావడంతో ఆమె స్థానంలో భీమ కుమారి నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఆర్డీవో బాధ్యతలు స్వీకరించిన భీమ కుమారి బుధవారం సాయంత్రం శ్రీ భీమేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు వేదోక్త ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ జయంత్ కుమార్ పాల్గొన్నారు. నూతన ఆర్డీవో కె.ఎస్. భీమ కుమారి వేములవాడ వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి, మే 13 (జనంసాక్షి) :** సదాశివనగర్ మండలం ఉత్తనూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, రైతుల నుండి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుత ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించాలని తెలిపారు. కేంద్రంలో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతులు తీసుకొచ్చిన మొక్కజొన్న నాణ్యత ప్రమాణాలను పరిశీలించి, తేమ శాతం నిబంధనల ప్రకారం ఉండేలా చూడాలని తెలిపారు. కొనుగోలు అనంతరం లిఫ్టింగ్ ప్రక్రియను కూడా వేగవంతం చేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించి డీఎం మార్క్‌ఫెడ్ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తూ, రవాణా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 5 వేల క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించడం జరిగిందని, మిగిలిన స్టాక్‌ను వచ్చే 10 రోజుల్లో పూర్తి స్థాయిలో తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మొక్కజొన్న తూర్పార పట్టే విధానాన్ని పరిశీలించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ప్రక్రియ నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు, తూర్పార పట్టడం మరియు రవాణా ప్రక్రియలు సమన్వయంతో కొనసాగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహకార అధికారి రామ్మోహన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల అక్రమానికి గురి కాకుండా చర్యలు చేపట్టాలి

### బీఆర్ఎస్ కౌన్సిలర్ యూసుఫ్ బాబా

**శామీర్‌పేట, మే 13 (జనం సాక్షి) :** చెరువుల ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) హద్దులను తక్షణమే ఖరారు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను కోరారు. చెరువుల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ కౌన్సిలర్ యూసుఫ్ బాబా పిలుపునిచ్చారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మురహరిపల్లి గ్రామంలోని పోచమ్మ కుంట, బండకుంట, రేణిగుంట చెరువులు క్రమంగా ఆక్రమణలకు గురవుతూ తమ అసలు వైశాల్యాన్ని కోల్పోతున్నాయని బీఆర్ఎస్ 13వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ యూసుఫ్ బాబా ఆందోళన వ్యక్తం చేశారు.

మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో కలిసి చెరువులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బండకుంట ప్రస్తుతం మూడు ఎకరాలకు పరిమితమైందన్నారు. పట్టణ విస్తరణ, అక్రమ కబ్జాల కారణంగా చెరువుల సహజ స్వరూపం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు కేవలం నీటి వనరులు మాత్రమే కాకుండా భూగర్భ జలాల పరిరక్షణకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. చెరువులు కనుమరుగైతే భవిష్యత్తులో తీవ్ర నీటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. వెంటనే రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించి శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చెరువుల చుట్టూ రక్షణ రాళ్లు ఏర్పాటు చేసి ఆక్రమణలను తొలగించాలని, భవిష్యత్ తరాలకు నీటి వనరులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని యూసుఫ్ బాబా కోరారు. ఈ కార్యక్రమంలో కత్తి బాలయ్య, ధార బాబు, భూమిరెడ్డి పెద్దబల్‌రెడ్డి, భూమిరెడ్డి అంజిరెడ్డి, వరాల గోపాల్, మాజీ వార్డు సభ్యుడు వరాల బాల్‌రెడ్డి, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

- పోక్సో కేసులో భగీరథ్‌పై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ ప్రజా ప్రతినిధులు మహిళలపై లైంగిక దాడులు కొత్త కాదు
- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి



**హయత్‌నగర్, మే 13 (జనంసాక్షి):** గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కేంద్ర హోమ్ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడంపై సిపిఐ తీవ్ర విమర్శలు గుప్పించింది. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ, 17 ఏళ్ల బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినా ఐదు రోజులు గడిచినా భగీరథ్‌ను అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సాధారణ వ్యక్తిపై ఇలాంటి కేసు నమోదైతే వెంటనే అరెస్టు చేసే పోలీసులు, ఇప్పుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో మౌనం వహిస్తున్నారని విమర్శించారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను పట్టుకునే టెక్నాలజీ ఉన్న దేశంలో కేంద్ర మంత్రి కుమారుడి అడ్రస్ కనుగొనలేకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడం కేసును బలహీనపరచడానికే నని సందేహం వ్యక్తం చేశారు. హనీ ట్రాప్ కేసుగా మలచే ప్రయత్నం జరుగుతోందని, కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాలిక తండ్రిపై కేసు నమోదు చేయడం ద్వారా అసలు కేసు దృష్టి మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు మహిళలపై అత్యాచారాలు చేయడం కొత్త కాదని, ఉన్నావ్, బ్రిజ్ భూషణ్ కేసులను ఉదాహరణగా చెప్పారు. బండి సంజయ్ తన కుమారుడిని వెంటనే అరెస్టు చేయించి విచారణకు సహకరించాలని, లేకపోతే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు బండి సంజయ్ గతంలో కేటీఆర్‌పై చేసిన డ్రగ్స్ ఆరోపణలను గుర్తు చేస్తూ, ఇప్పుడు తన కుటుంబంపైనే ఆరోపణలు రావడం కర్మ సిద్ధాంతమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం వెంటనే భగీరథ్‌ను అరెస్టు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**పిట్లం మే 13(జనం సాక్షి) :** పిట్లం మండల పరిధిలోని జాతీయ రహదారి ఎన్ హెచ్ 161 గద్ద గుండు తాండ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ ఐ ఆంజనేయులు తెలిపారు. పెద్ద కొడప్ గల్ మండల కేంద్రానికి చెందిన మారేపల్లి హన్మండ్లు తన భార్య అయిన లక్ష్మి తో కొడప్ గల్ నుండి ఎల్లారెడ్డి మండలం కళ్యాణి వద్ద తన యొక్క బంధువుల వివాహం ఉన్నందున శుభకార్యం ముగించుకొని తిరిగి వచ్చే సమయంలో మోటార్ సైకిల్ ను వేగంగా నడపడం వలన అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో బైక్ వెనుక కూర్చున్న లక్ష్మి కిందపడి తలకు తీవ్ర గాయాలై చనిపోయింది. వాహనం నడిపిస్తున్న హన్మండ్లు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి మేత్రి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.



## సింగవరం స్టేజీ వద్ద రోడ్డు ప్రమాదం

- బస్సు కోసం నిలబడిన మహిళ మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- అతి వేగంగా వచ్చిన స్కార్పియో ఢీకొట్టడంతో దారుణం
- ప్రమాదానికి స్థానికుల ఆగ్రహం, పోలీసులు కేసు నమోదు

**గంభీరావుపేట, మే 13 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజ సింగవరం స్టేజీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్ల లక్ష్మి (38) అనే మహిళ మృతి చెందారు. మరో మహిళ, బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. ప్రతిరోజు మాదిరిగా పని కోసం సిరిసిల్ల జిల్లా కేంద్రానికి వెళ్లే క్రమంలో లక్ష్మి బస్సు కోసం స్టేజీ వద్ద నిలబడి ఉండగా, మహారాష్ట్రకు చెందిన స్కార్పియో వాహనం అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మితో పాటు బాలుడితో ఉన్న మరొక మహిళ రజిత కూడా తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఎల్లారెడ్డిపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ లక్ష్మి మృతి చెందారు. రజిత, యశ్వంత్ అనే బాలుడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

స్థానికులు మాట్లాడుతూ, స్కార్పియో వాహనం అతి వేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ అనిల్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగించింది. రహదారి ప్రమాదాలు తగ్గాలంటే అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## గోవధ నిషేధం అక్రమ రవాణాపై పగడ్బందీ చర్యలు


- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- అక్రమంగా తరలించిన పశువులను స్వాధీనం చేసుకొని షెడ్డుకు తరలించాలి
- వికారాబాద్ కలెక్టర్ ఎస్పీ ఆదేశాలు జారీ



**వికారాబాద్ జిల్లా బ్యూరో మే 13 (జనం సాక్షి):** పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసు కోవాలని.సమన్వయంతో పని చేస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలని బక్రీద్ సందర్భంగా సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్ పి కోరారు.జిల్లా లో పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి , జిల్లా ఎస్ పి స్నేహ మెహ్రా అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగ సందర్బంగా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలని అన్నారు. గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవులను వధించడంపై నిషేధం ఉందని, ఈ విషయాలపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఎక్కడ కూడా గోవులు, వధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వధించరాదని సూచించారు. పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అన్ని చోట్ల సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని ఎస్ పి తెలిపారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ జరపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సంయమనంతో వ్యవహరిస్తూ అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకుసూచించారు. సీజ్ చేసిన పశువులకు తగిన షెల్టర్ కల్పిస్తూ, వాటికి పశుగ్రాసం, నీటి వసతి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా చూడాలని, వ్యర్థాలను వెంటదివెంట జనావాసాలకు దూరంగా తరలించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుక జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, పశు సంవర్ధక శాఖ అధికారి సదానందం, పరిగి, కొడంగల్, తాండూర్, వికారాబాద్ మున్సిపల్ కమిషనర్‌లు, డిఎస్‌పిలు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు

- ఆధునిక వైద్యంతో క్యాన్సర్ రోగులకు కొత్త ఆశలు
- సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ ప్రముఖ హెమటాలజిస్ట్ వైద్యులు శ్రీనివాస్ చక్రవర్తి



**కరీంనగర్ బ్యూరో, మే 13 (జనంసాక్షి) :** రక్త క్యాన్సర్ చికిత్స రంగంలో ఆధునిక సాంకేతికతలు, అత్యాధునిక వైద్య పద్ధతులు, విప్లవాత్మక మార్పులకు దారితీస్తున్నాయని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ ప్రముఖ హెమటాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి తెలిపారు. కరీంనగర్ యశోద ఆసుపత్రిలో బుధవారం రోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రముఖ హెమటాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడు తూ... గతంతో పోలిస్తే ప్రస్తుతం బ్లడ్ క్యాన్సర్ చికిత్స మరింత ఖచ్చితంగా, సమర్థవంతంగా మారిందన్నారు. బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో ప్రస్తుతం "టార్గెటెడ్ మెడిసిన్స్, ఇమ్యూనో థెరపీ" కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ ఆధునిక చికిత్సల వల్ల ఆరోగ్యకరమైన కణాలకు నష్టం కలగకుండా కేవలం క్యాన్సర్ కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని చికిత్స అందించడం సాధ్యమవుతోందన్నారు. "ప్రెసిషన్ థెరపీ" ద్వారా రోగి పరిస్థితిని బట్టి ప్రత్యేక చికిత్స అందిస్తున్నామని, దీనివల్ల చికిత్స ఫలితాలు మరింత మెరుగుపడుతున్నాయని చెప్పారు. అలాగే "కార్-టి సెల్ థెరపీ"ను "లివింగ్ డ్రగ్"గా అభివర్ణిస్తూ, రోగి స్వంత కణాలను శిక్షణ ఇచ్చి క్యాన్సర్ కణాలపై పోరాడే విధంగా మార్చడం ఈ విధానంలోని ప్రత్యేకత అని తెలిపారు. ఈ థెరపీ ద్వారా కొన్ని క్లిష్టమైన రక్త క్యాన్సర్ కేసుల్లో కూడా ఆశాజనక ఫలితాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఆధునిక బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ పద్ధతుల వల్ల రోగులు ఎక్కువ కాలం మెరుగైన జీవన ప్రమాణాలతో జీవించే అవకాశాలు పెరిగాయని ఆయన అన్నారు. గతంలో అందుబాటులో లేని పలు అధునాతన చికిత్సలు ఇప్పుడు భారతదేశంలో కూడా సామాన్య ప్రజలకు అందుబాటులోకి వస్తుండటం వైద్య రంగంలో సానుకూల పరిణామమని డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

### జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు



**చేవెళ్ల, మే 13 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా బుధవారం చేవెళ్ల మండల పరిధి ముడిమ్యాల్‌లోని జీపీఆర్ కన్వెన్షన్‌లో నియోజకవర్గ స్థాయి గ్రామ సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సర్పంచ్‌లు, కౌన్సిలర్లు కృషి చేయాలని, పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచడం, సదుపాయాల మెరుగుదల, విద్యా నాణ్యత పెంపులో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రజలకు వివరించి ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, చిన్నారుల కోసం ప్రత్యేక తరగతులు, విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో విద్యాభివృద్ధి కోసం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మూడు మున్సిపాలిటీల మున్సిపల్ చైర్మర్లు సమతా వెంకట్ రెడ్డి, సోనియా దర్శన్, సాత ప్రవీణ్ కుమార్, చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఎంపీడీవో హిమబిందు, తహసీల్దార్లు కృష్ణయ్య, మండల వివిధ గ్రామాల సర్పంచ్ లు విద్యాధికారులు, విద్యా సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 13 (జనం సాక్షి);** పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం లాంటిదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఇద్దరు చిన్నారులను దత్తతకు అందించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలను చక్కగా చూసుకోవాలని చెప్పారు. ఎవరైనా చట్టబద్ధంగా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా మాత్రమే ఆన్లైన్ ద్వారా పిల్లలను దత్తతకు ఎంపిక చేసుకోవాలని సూచించారు.అలాకాకుండా ఇతర అక్రమ మార్గాలలో చేసుకున్నట్లయితే ఐదు సంవత్సరాల జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

పిల్లలను పెంచే స్థోమత లేనటువంటి తల్లితండ్రులు తమ పిల్లల్ని దత్తత కోసం అప్పగించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు. పిల్లలను రోడ్డు మీద వదిలి వేస్తున్న వారి తల్లిదండ్రులపైన జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారము చర్య తీసుకుంటామని హెచ్చరించారు.పిల్లలను నిర్లక్ష్యం చేసినా, వదిలివేయడానికి ప్రోత్సహించిన వారికి కూడా చట్ట ప్రకారం జైలు శిక్ష జరిమానా ఉంటుందని స్పష్టం చేశారు.ప్రస్తుతం దత్తత కోసం చాలామంది ఎదురుచూస్తున్నారని, ఎవరికైనా పిల్లలు పెంచే శక్తి లేనట్లయితే,అవాంచిత గర్భం అయినప్పుడు,వద్దు అనుకున్నట్లయితే పిల్లలని ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రాలకు అప్పగించాలని, వారిని చట్ట ప్రకారం దత్తతకు పంపిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు పిల్లల సంరక్షణ గురించి, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు అందించారు.దీంతో ఆ పిల్లలకు మంచి జీవితాన్ని, వెలుగులు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఇట్టి సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా బాలల ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్ఐసీ ఎం గగన్ కుమార్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
14 మే 2026

## నేడు ఆదివాసీ భవన్‌లో ప్రతిభా పురస్కారాలు

### రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన బీసీ గురుకుల, బీసీ హాస్టల్ విద్యార్థులకు ఈనెల 14న బంజారా హిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో ప్రతిభా పురస్కారాలు - 2026 అందిస్తున్నామని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన విద్యార్థినులకు అండగా ఉందని గత ఏడాది బీసీ గురుకుల, హాస్టల్ విద్యార్థులకు పురస్కారాలు అందించామని ఆయన గుర్తు చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రతిభావంతులైన 508 మంది విద్యార్థులను సన్మానిస్తామన్నారు. పదో తరగతి ఫలితాల లో ఎం జె పి నుంచి 147 మంది విద్యార్థులు (576 కటాఫ్), దీజ హాస్టల్ విద్యార్థులు 67 మంది (550 కటాఫ్)కి మొత్తం 214 మంది విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్నామని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరించారు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం 137 మంది విద్యార్థులు (988 కటాఫ్/1000), 28 మంది బీసీ హాస్టల్ విద్యార్థులు మొత్తం 165 మంది విద్యార్థులను ఈ సందర్భంగా సత్కరిస్తామని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో (467/437/493 కటాఫ్) సాధించిన 107 మంది ఎం జే పి విద్యార్థులు, 22 మంది బీసీ హాస్టల్ విద్యార్థులు మొత్తం 129 మంది విద్యార్థులను సన్మానిస్తామని ఆయన తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రతిభా వంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

## బక్రీద్ పండగ సందర్భంగా శాంతి భద్రతలకు

# విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

### డీజీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్, మే 13 (జనంసాక్షి) :** రాష్ట్రంలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషల్ సీఎస్ శ్రీ జయేష్ శ్రీ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రెటరీ శ్రీ కే. ఇలంబర్తి తదితరులతో కలిసి డిజిపి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయి లో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు ఈ నెల 27న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫిట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ హెచ్చరించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప, నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండు వర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు. పోలీస్, మున్సిపల్ పశుసంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని సూచించారు. సీజ్ చేసిన పశువులను సంరక్షించేందుకు తగిన విస్తీర్ణంలో క్యాటిల్ పాండ్‌లను ఏర్పాటు చేయాలని, అక్కడ పశువులకు అవసరమైన సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గందరగోళం సృష్టించేలా పోస్టులు పెట్టే వారిని స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలని చెప్పారు. గతంలో బక్రీద్ సందర్భంగా నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. స్పెషల్ సిఎస్ (ఎం ఏ యు డి) జయష్ రంజన్ మాట్లాడుతూ.... మున్సిపల్ అధికారులు బక్రీద్ పండుగ అప్రమత్తతో ఉన్నారని తెలియజేశారు. కౌ స్లాటర్ యాక్ట్, ట్రాన్స్పోర్ట్ యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ చట్టాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పశుసంవర్ధక శాఖ సెక్రెటరీ కె ఇలంబర్తి మాట్లాడుతూ.... పశువుల రవాణాకు సంబంధించిన సర్టిఫికెట్లను ఇచ్చేందుకు వెటర్నరీ డాక్టర్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వెటర్నరీ డాక్టర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శిశ్రీ కె. ఇలంబర్తి, డైరెక్టర్ శ్రీ గోపి, శాంతిభద్రతల డిజిపి మహేష్ ఎం భగవత్, ఐజీపీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, కార్తికేయ, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్ తదితరులు తగు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్పీలు, వీడియో కాన్ఫరెన్సుకు హాజరయ్యారు.

### ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన హెడ్ కానిస్టేబుల్ కూతురును సన్మానించిన డీజీపీ

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ కు ఎంపికైన హెడ్ కానిస్టేబుల్ కూతురు చల్లా యామినిని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ సివి ఆనంద్ బుధవారం నాడు తన కార్యాలయంలో సన్మానించారు. సూర్యాపేట జిల్లాలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న చల్లా యాదగిరి కుమార్తె యామిని ప్రస్తుతం సికింద్రాబాద్లోని ఎంసీఈఎంఈ లో ఆడిటర్ గా పనిచేస్తున్నారు. ఇటీవల వెలువడిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఫలితాల్లో ఆమెకు 119 ర్యాంక్ లభించింది. శాంతి భద్రతల డిజిపి శ్రీ మహేష్ ఎం భగవత్ మెంటార్ గా వ్యవహరించారు.

## ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

- కొల్లూరు ఎస్ఐ సురేశ్ సస్పెన్షన్



**హైదరాబాద్, మే 13 (జనంసాక్షి) :** మహిళా కానిస్టేబుల్‌ను ప్రేమ పేరుతో ఓ ఎస్సై మోసం చేశాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాక ఉన్నతాధికారులు సదరు ఎస్సైని సస్పెండ్ చేశారు. ప్రేమిస్తున్నాను అంటూ నమ్మించి.. పెళ్లి పేరుతో కాలయాపన చేస్తూ తప్పించుకు తిరుగుతున్న కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్ కుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ లో మహిళా కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతిని.. పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమ పేరుతో మోసం చేసినట్లు కేసు నమోదు కావటంతో.. ఈ నిర్ణయం తీసుకున్నారు ఉన్నతాధికారులు. పూర్తి వివరాల్లోకి వెళితే..2018 బ్యాచ్ ఎస్సై సురేష్ కుమార్.. కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతితో పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పటంతో.. ఎస్సై సురేష్ కు దగ్గరైంది ఆ మహిళా కానిస్టేబుల్. కొన్నాళ్లుగా పెళ్లి విషయంపై ఒత్తిడి చేస్తుంది. సాకులు చెబుతూ.. పెళ్లిని వాయిదా వేస్తూ వస్తున్నారు ఎస్సై సురేష్ కుమార్. పెళ్లి వాయిదాపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వెంటనే పెళ్లి చేసుకోవాలని మహిళా కానిస్టేబుల్ పట్టుబట్టింది. పెళ్లి విషయంలో ఎస్సై సురేష్ కుమార్ తప్పించుకునే ప్రయత్నం చేస్తుండటంతో.. మహిళా కానిస్టేబుల్ గట్టిగా నిలదీసింది. పెళ్లి చేసుకునేది లేదని.. పెళ్లి చేసుకోవటం కుదరదు అని తేల్చి చెప్పారు ఎస్సై సురేష్. ఈ క్రమంలోనే ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసినట్లు కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కంప్లయింట్ చేసింది మహిళా కానిస్టేబుల్. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎస్సై సురేష్ ను విచారించేందుకు ప్రయత్నించారు. అతని సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ లో ఉండటంతో.. విచారణకు స్పందించకపోవటం.. అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో.. ఎస్సై సురేష్ కుమార్ ను సస్పెండ్ చేశారు ఉన్నతాధికారులు. బాధితురాలు మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఆధారాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాధిత యువతి ఇచ్చిన ఆధారాలతో పోలీస్ ఉన్నతాధికారులు అతణ్ని సస్పెండ్ చేశారు.

## రాధన్ పండిట్ వెట్రివేల్ విషయంలో యూటర్న్

### విమర్శలు రావడంతో నియామకాన్ని రద్దు చేస్తే ఉత్తర్వులు



**చెన్నై, మే13 (జనంసాక్షి) :** జ్యోతిష్యుడు రాధన్ పండిట్ వెట్రివేల్ విషయంలో తమిళనాడు సీఎం విజయ్ వెనక్కు తగ్గారు. ఆయనను తన ఓఎస్‌డీగా నియమిస్తూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేశారు. ఒక జ్యోతిష్యుడిని ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమించడం ఏమిటని ప్రతిపక్షాలు, మిత్రపక్షాల నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలో సీఎం విజయ్ వెనక్కు తగ్గారు. వెట్రివేల్‌కు గతంలో ఇచ్చిన నియామక ఉత్తర్వులను రద్దు చేసినట్టు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో సీఎం విజయ్ నెగ్గిన విషయం తెలిసిందే. అయితే, విశ్వాస పరీక్షకు ముందు వీసీకే ఎమ్మెల్యే వాణి అర్సు ఓఎస్‌డీ అంశాన్ని లేవనెత్తారు. శాస్త్రీయత, తార్కిక ఆలోచనా ధోరణితో ముందుకు సాగాలని అన్నారు. మూఢనమ్మకాలను పక్కనపెట్టాలని చెప్పారు. 'మన ప్రభుత్వం జ్యోతిష్యానికి కాక శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యం ఇవ్వాలి' అని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రాధన్ నియామక ఉత్తర్వులను ఉపసంహరించుకున్నామని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్ దగ్గర విజయ్ జ్యోతిష సలహాలు తీసుకుంటుంటారు. ఎన్నికలకు ముందే ఆయన టీవీకే విజయాన్ని ఊహించారు. జయలలిత సహా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులకు కూడా ఆయన సలహాలు ఇచ్చేవారు. మంగళవారం ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా వెట్రివేల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే దీనిపై అన్ని పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ విమర్శలపై విజయ్ స్పందిస్తూ.. ఆ నియామకాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఓఎస్డీ బాధ్యతల నుంచి వెట్రివేల్‌ను తప్పిస్తూ విజయ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బలపరీక్ష అనంతరం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## 42 ఏళ్ల తర్వాత పరీక్షా హాల్‌కు..

### తెలుగు పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు నేత దేవ్ జీ



**జగిత్యాల (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా కోరుట్లలో బుధవారం జరిగిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రంలో కనిపించిన ఒక వ్యక్తి మాత్రం అందరి దృష్టిని ఆకర్షించాడు. ఒకప్పుడు అడవుల్లో తుపాకీతో తిరిగిన మాజీ మావోయిస్టు అగ్రనేత... నేడు పెన్నుతో పరీక్ష రాయడానికి పరీక్షా హాల్లోకి అడుగుపెట్టారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన కామ్రేడ్ తిప్పిరి తిరుపతి అలియాస్ "దేవ్ జీ" సుమారు 42 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారి పరీక్ష రాయడం విశేషంగా మారింది. 1982లో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న సమయంలో ఆయన తెలుగు పరీక్ష తప్పిపోయింది. ఆ ఒక్క పరీక్ష రాయకపోవడంతో ఇంటర్ విద్య అసంపూర్తిగానే మిగిలిపోయింది. అదే సమయంలో సమాజంలో ఉన్న అసమానతలు, పేదల సమస్యలు, అన్యాయాలు ఆయన మనసును కదిలించాయి. విద్యార్థి జీవితాన్నే వదిలి విప్లవ బాట పట్టారు. అడవులు ఆయనకు ఆశ్రయమయ్యాయి. తుపాకీ ఆయనకు ఆయుధమైంది. సిద్ధాంతం ఆయనకు జీవితం అయింది. దశాబ్దాల పాటు ప్రజా పోరాటాల్లో పాల్గొన్న తిరుపతి... "దేవ్ జీ"గా మావోయిస్టు ఉద్యమంలో కీలక నాయకుడిగా ఎదిగారు. అయితే కాలం మారింది. పరిస్థితులు మారాయి. పోరాటాల పద్ధతులు మారాయి. చివరకు దేవ్ జీ సాధారణ జీవనంలోకి వచ్చారు. కానీ జీవితంలో ఒక అసంపూర్తి మాత్రం ఎప్పటికీ ఆయనను వెంటాడింది. 1982లో రాయకపోయిన తెలుగు పరీక్ష. ఆ అసంపూర్తిని పూర్తి చేయాలనే సంకల్పంతో ఆయన ఇంటర్ బోర్డును సంప్రదించారు. ప్రత్యేక అనుమతి పొందారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు హాజరయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత పరీక్షా హాల్లోకి అడుగుపెట్టిన దేవ్ జీని చూసి అక్కడి విద్యార్థులు, అధికారులు ఆశ్చర్యపోయారు. కొందరు ఆసక్తిగా గమనించారు. మరికొందరు ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా దేవ్ జీ మాట్లాడుతూ, "ఇంటర్ పూర్తి చేసిన తర్వాత న్యాయ విద్య అభ్యసించాలని ఉంది. పేదలకు న్యాయ సహాయం అందించాలనేది నా కోరిక" అని తెలిపారు. దేవ్ జీ కథను కేవలం ఒక మాజీ మావోయిస్టు పరీక్ష రాశాడనే సంఘటనగా చూడటం సరైంది కాదు. ఇది ఒక తరం చరిత్ర. ఒక భావజాల ప్రయాణం. ఒక మనిషి అంతర్మథనం. 1980ల కాలంలో గ్రామీణ తెలంగాణలో పేదరికం, భూస్వామ్య దౌర్జన్యాలు, సామాజిక అసమానతలు తీవ్రంగా ఉండేవి. అప్పుడు అనేక మంది యువకులు విద్యను, కుటుంబాలను వదిలి విప్లవ ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. వారికి తుపాకీ మార్గమే మార్పుకు సాధనంగా కనిపించింది.

## విపక్షనేతల అంటే లెక్కలేదా?


- మోడీ తీరుపై మండిపడ్డ వీహెచ్



**హైదరాబాద్, మే 13 (జనంసాక్షి) :** మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యం అంటే లెక్కలేకుండా పోయిందన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని మోదీ భావిస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ డైరెక్టర్ అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోకపోవడంతో రాహుల్ గాంధీ లేఖ రాసినట్లు చెప్పారు. ప్రధానికి రాహుల్ లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. మోదీకి అనుకూలంగా ఉన్న వాళ్లను సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తారా అని వీహెచ్ ప్రశ్నించారు. భజన చేసే వాళ్లకే మోదీ.. పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. రాహుల్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వీహెచ్ తెలిపారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తోందని మండిపడ్డారు. జనగణనలో బీసీ కాలమ్ లేకపోవడం అన్యాయమన్నారు. ఆర్ఎస్ఎస్ చేతిలో నరేంద్ర మోదీ కీలు బొమ్మగా మారారని దుయ్యబట్టారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' అబద్ధమని... బీజేపీ వికాసం మాత్రమే జరుగుతోందని వీహెచ్ వ్యాఖ్యానించారు

## అమూల్ పాలధరలు పెంపు

- లీటర్‌కు రెండు రూపాయలు పెంచిన సంస్థ
- నేటినుంచే పెంచిన ధరలు అమల్లోకి ..
- అదే బాటలో మదర్ డెయిరీ కూడా పెంపు



**హైదరాబాద్, మే13 (జనంసాక్షి) :** అమూల్ బ్రాండ్‌పై పాల ఉత్పత్తులు విక్రయించే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ పాల ధరలను పెంచింది. లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మే 14 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. అమూల్ స్టాండర్డ్ మిల్క్, గేదె పాలు, ఆవు పాలు, గోల్డ్, స్లిమ్ / ట్రిమ్, టీ-స్పెషల్ పాల ధరలు లీటరుకు రూ.2 చొప్పున పెరగనున్నాయి. గతేడాది మే 1న చివరి సారిగా ధరలు సవరించింది. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అమూల్ తెలిపింది. పశువుల దాణా, ప్యాకేజింగ్ ఖర్చులు, చమురు ధరలు పెరుగుదల దీనికి కారణమని పేర్కొంది. పాల రకాన్ని బట్టి లీటరుకు 2.5 నుంచి 3.5 శాతం మేర ధరలు పెరుగుతున్నాయని, ఆహార పదార్థాల ద్రవ్యోల్బణంతో పోలిస్తే ఈ పెంపు తక్కువేనని పేర్కొంది. మదర్ డెయిరీ కూడా పాల ధరలను పెంచింది. లీటరుకు రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. మే 14 నుంచి పెరిగిన పాల ధరలు అమల్లోకి రానున్నాయని తెలిపింది. పాల ధరలను అమూల్, మదర్ డెయిరీ పెంచిన నేపథ్యంలో ఇతర కంపెనీలూ ఇదే బాటలో పయనించే అవకాశం ఉంది.

## బండి సంజయ్ కుమారుడిపై లుక్‌ఔట్ నోటీసులు జారీ చేయాలి

- విదేశాలకు పారిపోకుండా చర్యలు చేపట్టాలి.. బాధితురాలికి న్యాయం చేయాలి
- పాలమూరు-రంగారెడ్డి జాతీయ హోదాపై ప్రధాని నోటి వెంట ఒక్క మాట రాలేదు
- సీఎం రేవంత్ రెడ్డి అడగలేదు.. బీఆర్ఎస్ ప్రశ్నించలేదు
- ప్రధాని ఆంధ్రాకు పైసలు ప్రకటించి... మనకు పొదుపు సూత్రాలు చెప్పిండు
- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేసి విదేశాలకు పారిపోకుండా చర్యలు చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై గంభీరమైన ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయన ప్రధానితో వేదిక పంచుకోవటం శోచనీయమని అన్నారు. కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు బండి సంజయ్ ఆ మీటింగ్ కు వెళ్లాల్సింది కాదన్నారు. బడాబాబుల పిల్లలు ఏం చేసిన సరే పోలీసులు చర్యలు తీసుకోరన్న అభిప్రాయం ప్రధాని సభతో ప్రజల్లోకి వెళ్లిందన్నారు. నిందితులను దేశం దాటించే అలవాటు బీజేపీకి ఉందని గుర్తు చేశారు. ప్రజ్వల్ రేవణ్ణ కేసులో అది నిరూపితమైందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటిపోకుండా లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కొందరు ట్వీట్స్ చేస్తూ సమస్యను పరిష్కరించినట్లు బిల్డప్ ఇస్తున్నారని.. అలాంటి పార్టీ వాళ్లు తానేందుకు స్పందించలేదని అడ్డగోలుగా కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. ఆడపిల్ల విషయం, అందులోనూ మైనర్ విషయంలో స్పందించే ముందు సంయమనం పాటించాలన్నారు. ఈ సమాజం మగపిల్లలను క్షమించినట్లుగా ఆడపిల్లలను క్షమించదని చెప్పారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహం కారణంగా బాధిత అమ్మాయి ఫొటోలు బయటకు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఫొటోలు బయటకు వస్తే వాళ్ల జీవితం నష్టపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఫొటోలు పోస్ట్ చేసిన సోషల్ మీడియా ఎకౌంట్లను గుర్తించి వాళ్లను అరెస్ట్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. రాజకీయాల్లోని లేని బండి సంజయ్ కుమారుడి విషయంలో రాజకీయాలను చేయటం తనకు ఇష్టం లేదని బాధితురాలికి న్యాయం జరగాలన్నదే తన అభిమతమన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు మరోసారి మొండి చెయ్యి చూపించారని చేశారు. తెలంగాణ పర్యటనలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఇస్తారని భావించిన మనకు పొదుపు సూత్రాలు చెప్పి... ఆంధ్రాకు పైసలు ఇచ్చి వెళ్లిపోయారని మండిపడ్డారు. పాలమూరు ప్రాజెక్ట్ జాతీయ హోదా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జాతీయ హోదా గురించి ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందని కవిత ప్రశ్నించారు. ప్రధాని పర్యటనలో తెలంగాణకు ఏం ఇవ్వకపోయినా ప్రధాన ప్రతిపక్షం ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు.

తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ మరోసారి రాష్ట్రం పై వివక్ష చూపారని కవిత అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా సహా మహిళ బిల్లు, జన గణనలో కుల గణన గురించి మాట్లాడతారని భావించినప్పటికీ వాటి గురించి ఒక్క మాట మాట్లాడలేదన్నారు. దేశంలో 16 రాష్ట్రాల్లో ప్రాజెక్ట్ లకు జాతీయ హోదా ఇచ్చి తెలంగాణకు ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లులకు ఆమోదం తెలుపా లని మరోసారి డిమాండ్ చేశారు. జనగణనలో కుల గణన కాలంతో పాటు సబ్ క్యాస్ట్, ప్రజల సామాజిక స్థితిగతులు తెలుసు కునేలా వివరాలు పొందుపర్చాలని కేంద్రాన్ని కవిత కోరారు. మహిళ బిల్లులో ఓబీసీ మహిళల సబ్ కోటా ఉండాల్సిందేన్నారు.

### రైల్వే కోర్టుకు హాజరైన కల్వకుంట్ల కవిత

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో రైల్ రోకో చేసిన కేసులో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం రైల్వే కోర్టుకు హాజరయ్యారు. నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్ లో గల సికింద్రాబాద్ సెకండ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు మేజిస్ట్రేట్ సమన్లు జారీ చేయడంతో వ్యక్తిగతంగా హాజరయ్యారు. కేసు తదుపరి విచారణ జూలై 17న నిర్వహిస్తామని మేజిస్ట్రేట్ ప్రకటించారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 2025 నవంబర్ 28న కామారెడ్డిలో టీఆర్ఎస్ నాయకులు రైల్ రోకో చేశారు. ఈ ఆందోళనపై రైల్వే పోలీసులు కల్వకుంట్ల కవితతో పాటు 12 మందిపై కేసు నమోదు చేశారు. మనోరంజన్ రైల్వే కోర్టు విచారణ అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370